

ఊసుపోక శీర్షికతో తెలుగుతూలికలో ధారావాహికగా ప్రచురించిన కతలు

నిడదవోలు మాలతి

2016

పరిచయం

ఊసుపోక శీర్షికతో 2008లో మొదలుపెట్టి హాస్యంగా, వ్యంగ్యంగా, గంభీరంగా, సంభ్రమాశ్చార్యాలతో కలగాపులగంగా అనేక అంశాలమీద వ్యాఖ్యానిస్తూ రాసేను. పాఠకుల స్పందనలు నేను ఆశించనిస్థాయిలో వచ్చేయి. వారి వ్యాఖ్యలనుండి అనేక కొత్తవిషయాలు తెలుసుకుంటూ వచ్చేను. కొంతకాలం అయేక వాటికి ఉపశీర్షిక ఎన్నెమ్మకతలు అని పెట్టేను వీటిలో వ్యాసానికి ఉండవలసిన వాస్తవికత కంటే కల్పనే ఎక్కువగా ఉండడంచేత. వస్తువైవిధ్యంమూలంగా సంకలనాలకి ఒక్క పేరూ నప్పలేదు. అంచేత నాపేరుమీదే నేను చెప్తున్నకతలు అన్న ఉద్దేశంతో ఎన్నెమ్మకతలు అని స్థిరం చేసేను. పొడి అక్షరాలు యన్. యమ్. లకి తెలుగుస్వారస్యంకోసం అమ్మ చేరిస్తే పెరిసి ఎన్నెమ్మకతలు అయింది.

ఇంతకుముందు రెండు సంపుటాలు సంకలనం చేసేను. ఇది మూడో సంపుటం. మిగతావి మరో సంపుటం చేస్తాను.

కొన్ని పోస్టులు ఏదో ఒక తాత్కాలిక సంఘటనో సన్నివేశమో లేదా ఒక పాఠకుడికి సమాధానంగానో రాసినవి. అవి సంకలనంలో పట్టవు అనిపించి ఇక్కడ చేర్చలేదు.

చివరిమాటగా, వస్తువైవిధ్యంమూలంగా అందరికీ అన్నీ నచ్చవని నాకు తెలుసు. కానీ హాస్యంగా రాసినవాటిలో కూడా సీరియస్‌గా ఆలోచించదగిన అంశాలు ఉన్నాయనే అనుకుంటున్నాను. తుది నిర్ణయం మీదే.

మీఅభిప్రాయాలు నాకు thulikan@yahoo.com ద్వారా తెలియజేయవచ్చు.

-- నిడదవోలు మాలతి. జూన్ 18, 2016.

గమనిక - తెలుగు తూలిక లో ధారావాహికగా ప్రచురించిన టపాలు సంస్కరించి ఈ సంకలనంలో కూర్పబడినవి.

నా ఇతర రచనలకు నాసాహిత్యం pdf లో చూడవచ్చు

- రచయిత.

జూన్ 2016.

విషయసూచిక

1. సోంవారంఉదయం పావుకాసువెనక!

“అనువాదాలు చేద్దాం అనుకుంటున్నానండీ,” అన్నాడు తారకం.

“ఔతే సేసీండి మరి,” అంది సంద్రాలు.

ఇద్దరినీ చూస్తూ ఆనందిస్తున్నాన్నేను. నాకీమధ్య వీళ్లిద్దరూ అందిస్తున్న వినోదం వేరే ఎక్కడ గానీ దొరకడం అసంభవం.

“మీరు చెప్పండి ఏకథ చేస్తే బాగుంటుంది? ఏభాషలోంచి ఏభాషలోకి తేలిగ్గా చేసీవొచ్చు? గూగుల్ అనువాదాలకి ఏది అనువు?”

“అదేటి బాబూ నానింక నీకే ఏదో కత శానా అబ్బురంగున్నది, ఏరేవోల్లకి గమనం నేదూ అదందరికి తెలవాలని అనోదం సేసీస్తవనుకొంటి.”

“నాకేవో చాలా కథలే కనిపిస్తున్నాయి. ఏ కుటుంబరావుకథో చలం కథో తీసుకు చేస్తే మనకీ వారికీ కూడా ఘనంగా ఉంటుందని.”

సంద్రాలు హీహీ అంటూ నవ్వింది.

“ఎందుకూ ఆ నవ్వు?”

“ఏటి నువ్వు అనోదం సేస్తే గాని ఆరికి గనం రాదా ఏటనీ …”

తారకంమొహమ్మీద చిరాకు రేగింది. “అది కాదండీ, ఇతర భాషలవారికోసం అనువాదాలు చెయ్యడం. మరి వారికి తెలియాలి కదా మనకింత గొప్ప రచయితలున్నారని,” అన్నాడతను నావేపు చూస్తూ.

“ఆయమ్మకి సెప్తవేటి. నాను అడగతంటె,” అంది సంద్రాలు తనఉనికిని అతను నిర్లక్ష్యం చేసినందుకు నిరసన తెలియజేస్తూ.

“అది కాదమ్మా. మనవాళ్ళకి తెలుసు కానీ ఇతరదేశాల్లో వారికి తెలీదు కదా అని.”

నేను సంధ్రాలు మాటకి అడ్డం వస్తూ, "నిజమే," అన్నాను.

సంధ్రాలు అసంతృప్తిగా నావేపు చూసింది.

నవ్వుకున్నాను నాలో నేను.

తారకం సంచీలోంచి ఓ కట్ట లాగేడు. "చెయ్యాలనుంది" అంటూ మొదలెట్టేడు కానీ చెయ్యడం అయిపోయిందన్నమాట. ఆ మాటే అన్నాను.

"లేదులెండి. ఇది నా గళ్ ఫ్రెండ్ చేసింది."

"తెలుగమ్మాయేనా?"

"అర్థ తెలుగు. నాన్న తెలుగువాడే."

"ఆహా" అంటూ తీసుకున్నాను ఆ కాయితాలు.

"తీరిగ్గా చూసి తరవాత చెప్పండి, తొందర్లేదు," అనేసి అతను వెళ్ళిపోయేడు. సంధ్రాలు కదల్లేదు.

"రండి, మిమ్మల్ని మీయింటిదగ్గర దింపుతాను," అన్నాడు తారకం.

"నేదునే. నాకు పనేం నేదు. కాస్సేపాగి నడిసిపోత," అంది సంధ్రాలు.

000

నేను అనువాదం చూస్తున్నాను. నాకు నవ్వొస్తోంది.

"ఏటి నవ్వతన్నవ్," అంది సంధ్రాలు.

అందుకన్నమాట వెనక్కి ఉండిపోయింది. ఆవిడకి కూడా నాలాగే చిలిపి ఆలోచనలు ఎక్కువ మరి!

"ఈ అనువాదాలు ..."

"ఎలగున్నయేటి?"

అది చదువుతుంటే నాకు అక్కడక్కడ చూసిన కొన్ని అనువాదాలు గుర్తుకొచ్చేయి.

తెలుగులోంచి ఇంగ్లీషులోకి -

రెండు తగల్నియ్ దానికి -- let her touch two.

ఎక్కడ చచ్చిందో పిల్లముండ -- Wherever did the child widow die?

రమ్మంటే రావు, పొమ్మంటే పోవు -- I say come you don't come I say you go you don't go.

మళ్ళీ చదవడం మొదలు పెట్టేను తారకం ఇచ్చిన కాయితాలు.

ఇంగ్లీషులోంచి తెలుగులోకి -

Doctor is studying patient's complaints. - డాక్టరు రోగి ఫిర్యాదులు పఠిస్తున్నాడు.

Where on earth are you going? – ఈ నేలమీద ఎక్కడికెళ్తున్నావు?

How're you feeling today? -- మీరు ఈ రోజు ఏ అనుభూతి అనుభవిస్తున్నారు?

Monday morning quarterback -- సోంవారం ఉదయం పావుకాసువెనక

ఫక్కున నవ్వేస్నేను.

"నాక్కాడ సెప్మంటే సెప్పవేటి?" అని కోప్పడింది సంధ్రాలు.

మరో రెండు నిముషాలు విరగబడి నవ్వడం అయేక చెప్పేను, "నాక్కూడా చాలాకాలం తెలీలేదులే ఆ క్వార్టరుబాకేమిటో, అందులోనూ సోమవారంఉదయం ఏమిటో. ఇంచుమించు నేనూ ఇలాగే అనుకున్నా మొదట్లో. తరవాత్తెలిసింది ఆయన ఓ ఆటగాడనీ, ఫుట్బాల్ ఆటలో అది ఒక ప్రముఖ స్థానమనీను. అది తెలుసుకునేసరికి, సోమవారం రాత్రి టీవీలో ప్రసారాలు మొదలయేయి. అంచేత నేను సోమవారం రాత్రి

ఆడబోయే ఆటగురించి ఉదయం కూచుని మాటాడుకుంటారు కాబోలు అనుకున్నాను."

"మరి గాదేటి?"

"కాదుట. ఆట ఆదివారాలు ఆడే రోజుల్లో పుట్టిన జాతీయంట అది."

"ఆట ఐపోనాక ఏటుంటాది మాటాడుకోనాంకి?"

"అదే మరి. ఆట అయిపోయేక, అయ్యో నేనిలా చేయ్యాల్సింది, అలా చేయాల్సింది అంటూ ఆ క్వార్టరుబాకు ఆగకుండా నస పెడుతున్నప్పుడు, 'గడిచిపోయినదానికి ఎందుకు ఏడవడం?' అంటూ బుద్ధి చెప్పే మంచిమాటట అది."

"అదేటి మరి. గాలుపెండు ఈగడ్డనుట్టిన పిల్లే గంద. ఆమాత్రరం ఎరికనేదంటవ?"

"ఆట సంగతి తెలిసే ఉంటుంది. భాషదగ్గరే తిరకాసు."

"మరయితే ఆ బాబుకేటి సెపతవు?"

హుమ్. నేను కూడా అదే ఆలోచిస్తున్నా ఏం చెప్పనా అని.

000

(జులై 19, 2011)

2. సంద్రాలేటంటదంటే ...

“ఔతె ఏటి సెప్తవు తాల్కకంబాబుకి?”

“చూశారా? ఎలా ఉందంటారు?” అంటూ తారకం వచ్చేడు.

“చూశాన”ని తారకానికి చెప్పి, ““నువ్వే చెప్పరాదూ?” అన్నాను సంద్రాలుతో.

“అదేటి నన్ను సెప్మంతవు?”

“చూశావు కదా కిందటివారం వ్యాఖ్యలు. నువ్వేం మాటాడతావో అడగమంటున్నారు వ్యాఖ్య రాసినాళ్ళలో ఒకాయన.”

“వోమ్మా. నివ్వు మరీను. నిజింగ అట్టన్నడా?” అంది సంద్రాలు సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ.

“ఆ. నువ్విలా సిగ్గు పడిపోతావని కూడా అన్నాడు. అయినా నీకు అభిమానులు ఎక్కువయిపోతున్నట్టున్నారు. ఈ లెక్కన నేను కలం, కాయితాలూ నోరుగులో పడేసి, ముడుచుకు పడుకోవచ్చు,” అన్నాను.

“సేదులే. నీకతలు గూడ సదూతరు,” అంది సంద్రాలు నామోకాలిమీద తట్టి బుజ్జగిస్తూ.

“అవునండీ. మీకథలు కూడా చదువుతారు చాలామందే.” అన్నాడు తారకం.

“ఓరి బగమంతుడా,” అంటూ ఆక్రోసించేను మనసులోనే. వీళ్ళిద్దరూ నన్ను ఓదారుస్తున్నారు! ఇంత బతుకూ బతికి ...

“సరేలే. నామాటకేం గానీ నువ్వు చెప్పు అసలు ఈరాతల్లో లొసుగులు. లేదా నీ అభిప్రాయంలో కథలు ఎలా ఉండాలి? ”

తారకం అయోమయంగా చూసి, “మీరు ముందు చెప్పండి. సంధ్రాలుగారు తరవాత చెప్తారు,” అన్నాడు.

“లేదులే. నేనేముంది ఇప్పటికి చాలాసార్లే చెప్పేను కదా అనువాదాలగురించి. ఆమెనే చెప్పనియ్ ‘ఫ్రెష్షబ్రీ’గా ఉంటుంది.” సంధ్రాలుమాటనే వేదవాక్యంగా అందరూ తీసుకుంటున్నారని నాకు దుగ్ధ మరి.

“సర్లే. మీరిద్దురు అడ్గతన్నరు గెన్క నాకు తెల్సింది సెప్త. అసులు అనోదాలు ఏల సేస్తరంతవు?”

“తెలుగు చదవలేనివాళ్ళకోసం.”

“అదో కార్నం. పెదానంగ నీమనసుకి నచ్చింది ఉంకొ అమ్మకో బాబుకో సెప్పనంపే. నీకేంవో ఏదో కత గొప్పగ ఉందన్పిస్తది. పక్కవోడికి చెప్తవు. ఔతె ఈడ ఏటి ఆలోసింసుకోవల? నివ్వు ఎవుర్కి సెప్తన్నవూ అని. మా ముత్తవ్వ కతలు బలె సెప్పేది. మాముత్తాతకి ముగ్గురు పెల్లాలు.”

“ముగ్గురా? అసలు మనదేశంలో ఇద్దర్ని చేసుకోడమే చట్టవిరుద్ధం కదా?” అన్నాడు తారకం.

సంధ్రాలు నవ్వింది. “సూసినావ? ఒప్పుడె మొదలెట్టీసినావు. నాన్సెప్పేది అద్గదె మరి. నివ్వేమొ నీ సట్టాలూ, దరమాలు మాటాడతవు. మా సట్టాలూ, దరమాలూ ఏరని నీకు ఎరికె సేదు.”

తారకం, “అది కాదండీ. చట్టం అందరికీ ఒక్కటే గదా.”

“ముందు ఆవిడ్ని చెప్పనీ. నీ సందేహాలు తరవాత,” అన్నాను.

“ఇది మరోబాద మీ సదూకున్నోల్లకి. అడగనీ. నాను సెప్తన్న గంద. నువ్వేల మాటాడతవు?” అంది సంధ్రాలు.

“అది గాదు,” అని ఏదో చెప్పబోయి ఆగిపోయేను. అంటే నన్నును కానీ చదువుకున్న వాళ్ళనందర్నీ ఎందుకు కలుపుతావు అని అనాలనుంది నాకైతే.

“ఏటి సెపతన్ననూ .. మా సట్టాలు ఏరని గంద. ముప్వురు పెల్లాలు. మీనాగ మాకేటి ఆస్తులా అంతస్తులా, నగలా నాణేలా ఏటి పోతాయని మాం బాద పడిపోవాల. ఇస్టంపైతే ఉంటం నేదంటే మరోడితో నేసిపోతం. మా ముత్తవ్వ అంతే సేసింది. బాగున్నన్నాల్లుంది. ఆయెనక ఊల్లోకి కొత్తగొచ్చిన కూలిగుంటడితో పట్నంపెల్లిపోనాది. అది సానాకాలం తరవోతలె. అంసేత నీ సట్టాలూ నీతులూ మాకు సెప్పమాక. ఐన అడిగినవు గెన్క సెప్తన్న. ఇది కతలగ్గూడ పనికొస్తది. మాయవ్వ మాకు కతలు సెప్పేది అంటి గెద? మా ముత్తవ్వ ఇట్టనె మజ్జమజ్జలో ఆలతో ఈలతో మాటాడతా, ఆల్లకి పన్లు సెప్తా కతలు సెప్పేది. అదేటి కతమజ్జిన అయీ ఇయీ మంతనాలేటి. కత సెప్పు అని మాంపెప్పుడూ అరవనేదు,” అంది సంద్రాలు గలగల నవ్వుతూ.

“అది కాదమ్మా. కథకి కొన్ని నియమాలున్నాయి. స్థలం, కాలం ...” అంటూ దండకం మొదలెట్టేడు.

నేనేదో చెప్పబోయి సంద్రాలుమొహం చూసి ఊరుకున్నాను.

“అదే బాబూ నాన్సెప్తన్నది గూడ. నివ్వేమొ కతంటే అట్టగుండాల ఇట్టగుండాల అంటా అడ్డుపుల్లలేస్తవు. మాముత్తవ్వకదేం తెలవదు గంద. ఏదో సెప్పేది. మాం వినీవోల్లం. మాకర్తం ఐపోయీది గూడ. మాకది పెంతొ సక్కగుండీది. సెప్పొచ్చీదేటంటే నివ్వు కత సెప్తంటే వినీవోలకి బావున్నదా నేదా అనే గంద. అదన్నమాట నాను సెప్పేది,” నావేపు తిరిగి, “అదేటదీ బుర్రలోకొచ్చిందనాగె సెప్పెస్తరూ...” అనడిగింది నావేపు తిరిగి.

“Stream of consciousness.”

“అదన్నమాట. ఎట్టగొస్తె అట్ట సెప్పీడంపే.”

“ఏంటండీ, ఏం తెలీదంటున్నారు, మీకు జేమ్స్ జాయిస్ కూడా తెలుసా?” అన్నాడు తారకం తెల్లబోయి.

“జాయిసో వాయిసో అదేటీ నాకు తెల్వదు. ఆయనెవురో అట్ట రాస్తరని మాదొరబాబు సెప్పిండోపాలి. ఓస్, అంతేనా మా ముత్తవ్వ, ముత్తాత గూడ అట్టనే సెప్తరు కతలు అంటిన్నేను. మా ముత్తాత గూడ అట్టనే. మజ్జనాల కూడట్టుకెల్లీదాన్నిలే పొలాల పన్జేస్త న్నలే ఒప్పుడు. కూలీలమీన అజ్మాయిసీ సేస్తా మాకు కతలు సెప్పీవోడు. ఆయన అట్టా అటు కూలీల్తో ఇటు మాతో మాటాడ్తంటే - ఆ మాటల్ల కతెక్కుడుందో మాం ఎతుక్కోవాలన్నమాట. అట్లుండేది ఆయన సెప్పీతీరు. ఔతేనేం మాకదె బహు సక్కంగుండీది.”

“అయితే అనువాదాలమాట సెప్పేరు కారు,” అన్నాడు తారకం ఆమెని దార్లోకి మళ్ళించడానికి.

“ఉండు మరి. అది రెండో ఇసియంవన్నమాట. నువ్వు ఎవురికి సెప్తన్నవు అనీది. మా ముత్తవ్వ నాకోనాగ సెప్పీది, మా బుడ్డోడికోనాగ సెప్పీది. ఆడికేఁవో గోరుముద్దలెట్టినట్టు సక్కంగ యిడమర్సి సెప్పీది. నాకేంవో గబగబ సెప్పీసీది.”

“మీరు కుశాగ్రబుద్ధులని,” అన్నాడు తారకం.

“అదేటి?”

“నువ్వు చాలా తెలివయినదానివి అంటున్నాడు.”

“సూసినావా. ఈపాలి రొండు పాయింట్లొచ్చీసినాయి. నీకు సదువుంది, పెద్ద పెద్ద పుస్తకాలు ఔపోసనొట్టీసినావు. అందుసేత ఆ మాటలన్నీ అనీస్తవు. ‘నాను సదూరాని ఆడమడిసితో మాటాడతన్నను, ఆఁవెకి తెల్సినమాటల్ల సెప్పాల’ అని నీకు తోసనేదు. సూసినావ. అదన్నమాట అనోదాలు సేసీప్పుడు గుర్తెట్టుకోవల్సిన ఒక ఇసయిం. అనగా నివ్వు ఎవురికోసం సేస్తన్నవో ఆరికి అర్తం అవుతాదా అవదా అని.

రొండేదేంవో ఇదింకా నిజం. అందుసేత బాగా వినుకో. నివ్వు ఎవురికి సెప్తన్నది మరిసిపోగూడదని సెప్పినాను గంద. నువ్వు సదివినకత ఎట్టాటి మాటల్లో సెప్పినారన్నది గూడ సూస్కోవాల. మాటకి సెప్త - తొలికతలో ఓ కూలోడే అనుకో ఆడు కూడు తిన్నడు అనుంటాది. నువ్వు అదే ఇంగిలీసులో నాకామాటలు తెలీవులే బోయినం సేసేరని రాసేవనుంకో. అప్పుడేటవుతది. మా దొరబాబునాగ బండిసెక్రంవంత పల్లెంలో తొమ్మిది ఆదరవులేసుకు తినీవోడికి బోయినంనాగ కల్లడతది. అదే మాలాటోల్లకి యాదకొచ్చీదేటంటే గెంజినీలు, సంగడిముద్ద. అందుసేత మరి నిజింగ కతలో ఏటున్నది, అదెట్ల సెప్తే నిజింకతలో ఉండినది ఉన్నట్టు తెలుస్తది నివ్వు సూసుకోవాల. అదన్నమాట యిస్యం. అనువోదం అయినా ఇంతే. కొత్తంగ రాసినకతైన ఇంతే."

నేను తెల్లబోయి చూస్తున్నాను.

తారకం కూడా నోట మాట రానట్టు కూర్చుండిపోయేడు. అతను తను తెచ్చిన అనువాదంమాట మరెత్తలేదు.

000

(జులై 25, 2011.)

3. రామయమంత్రి భోజనపరాక్రమేమని చెప్పవచ్చు

గ్రామము చేత నుండి పరికల్పిత ధాన్యము నింట నుండి శ్రీ
రామ కటాక్ష వీక్షణ పరంపరచే గడతేరె గాక మా
రామయమంత్రి భోజన పరాక్రమ మేమని చెప్పవచ్చు నా
స్వామి యెరుంగు దత్కుటళ చాతురి తాళ ఫల ప్రమాణమున్.

అని వర్ణిస్తాడు శ్రీనాథుడు రామయమంత్రి భోజనపరాక్రమము. ఆ రోజులలాటివి. పూర్వం తిరపతికొండమీద లడ్డూలు గంగాబోండాలంత ఉండేవిట. తరవాత ఒలిచిన కొబ్బరికాయంతై, వెలక్కాయంతై, నిమ్మకాయంతై ... ఇప్పుడు ఉసిరికాయంత అయేయేమో తెలీదు.

భోజనం ఒక దినచర్య కాదు. కాలక్షేపం కాదు. దానికదే సాటి అయిన ఒక గొప్ప అనుభవం. షడ్రసోపేతంగా పంచభక్ష్యపరమాన్నాలూ ఆరగించి కప్పురవిడెము సేవించే కవి సార్వభౌముడికి చల్లా అంబలీ, వెల్లుల్లీ, తిలపిష్టము కర్నాటక పడతులు వడ్డించినప్పుడు పాపం, ఆయనకి ఎంత కటకట అయిందో ఆ అలవాటు లేని కూడు. వివాహభోజనంబు అంటే గారెలూ, బూరెలూ, అప్పళాలూ, ధప్పళాలూ, మూడు కూరలూ, నాలుగు పచ్చళ్ళూ, పప్పూ, పులుసూ, చారూ, జారీకొమ్ములోంచి ఏకధారగా అన్నంగుంటలోకి పారే నెయ్యీ అడుగున్నర వెడుగు అరిటాకులో కలగలుపుకు తినగలగడం ఒక కళ. మనకి భోజనం అంటే అదీ!

ఎండాకాలంలో పెరుగన్నంతోపాటు పెద్దరసాలు చీక్కుతినడంగురించి వేరే చెప్పక్కర్లేదు కదా. ఒకసారి ఒకాయన ఆత్రంగా పండు చేత్తో పుచ్చుకు గట్టిగా నొక్కేట్ట – పులుసో

చారో అయింతరవాత ఆ చేత్తో అంటే అదొక సర్కసే కదా. ఆయనచేతిలోంచి టెంక ఎగిరి వెళ్ళి పక్కవారి విస్తరిలో పడింది. పాపం అవతల పెద్దమనిషి ఏంవంటాడోనని గుటకలు మింగుతూ ఆయనవేపు చూశాడీయన. ఆయన కూడా ఆ సమయంలో అదే కార్యక్రమంలో ఉండడంచేత తన విస్తరి చూసుకుని, "హా, ఆశ్చర్యం, నా పండులో రెండు టెంకలున్నాయి," అన్నాడు. వెంటనే మొదటి పెద్దమనిషి, "హో, నాపండులో టెంకే లేదు," అన్నాడు మరింత ఆశ్చర్యపోతూ.

నిత్యా అలా అన్ని రకాల వంటకాలు లేకపోయినా, ఓ కూరా, పచ్చడీ, పులుసుతో సంతుష్టిగానే తింటాం మనం. అది లేకుండా చేసేస్తున్నారు ఈమధ్య కొందరు ఆరోగ్యసూత్రాలతో ఊదర పెట్టేస్తూ. మొదట్లో ఆడవాళ్ళకి పెట్టేరు, తరవాత మొగవాళ్ళకీ, ప్రస్తుతం పిల్లలకీ పాకింది ఈ జబ్బు. ఆదినించీ వేళా పాళా లేకుండా ఎక్కడ పడితే అక్కడ ఎప్పుడు పడితే అప్పుడు నానా గడ్డీ తినడం అలవాటు చేయకపోతే అసలీ డైటు బాధలుండవు కదా.

అమెరికా రాగానే డోనట్ చూసి గారెలూ, కీవీ పండు చూసి సపోటా అనుకుని మోసపోని తెలుగువాడుంటాడనుకోను. నాకు కీవీ పండు బాగానే ఉంది గానీ డోనట్ తినడం మాత్రం నావల్ల కాలేదు. ఇప్పటికీ అదంటే వెగటే.

అసలు అమెరికనులకి దవడాడితే గానీ మెదడాడదేమో. ఎవరు ఎవరితో ఏం మాటాడాలన్నా కాఫీ, అల్పాహారం, భోజనం … ఏదో ఒకటి ఏర్పాటు చేసుకుంటారు. అదో ఒకటి నోట పెట్టకపోతే మాట తోచదు. సభల్లో వక్తలు మధ్య మధ్యలో మంచితీర్థం పుచ్చుకుంటారు ఎందుకనుకుంటారు? నోట్లో మాట తోచకే.

నఁవల్డానికేమీ లేకపోతే గమ్. ఇది మాత్రం బుర్ర పని చేయడానికి తోడ్పడదు సరి కదా ఎదురు ఏడో స్వర్గంలోకి తీసుకుపోతుందనుకుంటాను. తెలుగుపాఠాలు చెప్పేరోజుల్లో చూసేను - అరమోడ్పుకనులతో, వెనక్కి వాలి, కాళ్ళు చాపుకుని గమ్ నవుల్తూ

కూచున్న అబ్బాయిని చెప్తున్న పాఠం ఆపి ప్రశ్న వేస్తే, అతడులిక్కి పడి "హ?" అంటాడు తికమక పడిపోయి.

మనవాళ్ళు భోజనం చేస్తున్నప్పుడు మాటాడకూడదంటారు. అంటే తినే తిండి తృప్తిగా తినలేం మాటల్లో పడితే అని. మరో సిద్ధాంతం ఎంత తింటున్నామో చూసుకోకుండా మితి మీరి తినేస్తాం అని. అమెరికాలో డైటుసూత్రాలు హెచ్చిపోయేక, భోజనాలవేళ టీవీ కూడదంటున్నారు.

నేను టీవీ చూస్తాను సర్వకాలాల్లోనూ. మామూలుగా నాతిండికి టీవీ ప్రతిబంధకంకాదు. ఎందుకంటే మంగళగిరి పానకాలస్వామికి ఉన్న స్థితి నాక్కూడా ఉంది. తినడం సరీఘ్గా సహం కాగానే "చాల్చాలు" అంటూ హెచ్చరిక వచ్చేస్తుంది గొంతులోంచి, ఏ జన్మలోనో పెట్టి పుట్టడంచేత కాబోలు. లేదూ, "పెట్టకుండా" పుట్టడంచేత అనుకుందాం.

ఈమధ్య టీవీ చూస్తే తినే తిండి సయించడంలేదు. నాకు ఎంతో ఇష్టమైన కూరో పచ్చడో వేసుకుని, కంచం పుచ్చుకు కూర్చుని, టీవీ పెట్టబోతే, వచ్చేవి ప్రకటనలు – అజీర్తి, విరేచనాలు, కలెస్టరాల్ ... మందులు, మందులు, మందులు ... అవి చూస్తుంటే భోజనప్రీతి మాట దేవుడెరుగు అసలు ముద్ద దిగుతుందంటారా?

నే చెప్పేది తినేది ఏదైనా, ఎంతయినా, హాయిగా తృప్తిగా, వాటిరుచులు అనుభవిస్తూ పరమానందంగా తినాలని. కేలరీలు లెక్కలేసుకుంటూ, ఏం తింటే ఏ జబ్బులొస్తాయో బేరీజు వేసుకుంటూ తినకండి. అది అనారోగ్యమే కాదు దౌర్భాగ్యం కూడా కాగలదని నా అనుమానం.

ooo

(అక్టోబరు 23, 2011)

4. సంస్కృతీ, కల్చరూ

ఈరోజు పొద్దున్నే నాకు మాధురి కృష్ణ ఒక విడియో పంపేరు. తణుకుకి చెందిన 11 ఏళ్ళ శృతి తేట తెలుగులో ఇచ్చిన ఉపన్యాసం. విని ఆశ్చర్యపోయేను. ఆ తల్లిదండ్రులని అభినందిస్తున్నాను. వినండి -

<http://www.youtube.com/watch?v=BZg74oCNvZM>

నాకు వెంటనే మరో ప్రశ్న ఉదయించింది - ఆ సభలో ఎంతమంది అంతమంచి తెలుగులో మాటాడగలవారు ఉన్నారా అని. బహుశా మరో ఇద్దరో ముగ్గురో ఉండొచ్చు. కానీ ఈనాడు చాలావరకూ తెలుగుసభల్లో చాలా ఇంగ్లీషు వినిపిస్తుంది. నిజానికి నేను కూడా మాటాడలేనలా. అమెరికా వచ్చేక తెలుగు మాటాడే, వినే అవకాశం తగ్గిపోయిన నాతెలుగు చివికిపోతోంది క్రమంగా.

నిన్న టీవీలో వార్తలు వింటుంటే, మన సంస్కృతిగురించి నాకు మరి కొన్ని ఆలోచనలు కలిగేయి. దాదాపు మూడు వారాలుగా పెన్ స్టేట్ యూనివర్సిటీలో జరిగిన అఘాయిత్యం – యాభై ఏళ్ళ పెద్దాయన పదేళ్ళ పిల్లవాడిమీద జరిపిన అత్యాచారం గురించిన వివరాలతో హోరెత్తిపోతున్నాయి వార్తలు. దీన్ని గురించి కావలిస్తే Scandusky అనో Paterno అనో వెతికి చూడండి జాలంలో. గురుతుల్యులు పిల్లలని తమ కామానికి గురి చేయడం హేయం అయితే, ఆ సంస్థ అధికారులు తమ సంస్థపేరూ, ఆదాయం (92 మిలియన్లట) పరిరక్షించుకోడంకోసం కుమ్మక్కయి ఆ విషయాన్ని గుట్టుగా ఉంచి, అదే నీతి అని సమర్థించుకోడం హేయాతిహేయం.

పెన్ స్టేట్ యూనివర్సిటీ ఫుట్బాల్ అశేష జనాదరణ పొందిన క్రీడ అని నాకిప్పుడే తెలిసింది, అదీ ఆ కోచ్ దుష్ప్రవర్తనద్వారా! టీవీలో ఒక వ్యాఖ్యాత ఆ కుట్రని వాళ్ళ

"culture"గా అభివర్ణించడం నన్ను మరింత ఆలోచించేలా చేసింది. ఆ ప్రయోగంతో culture అన్న పదం cult అన్న పదానికి చాలా దగ్గరగా కనిపిస్తోంది. culture, cult – రెంటికి మూలధాతువు ఒకటే అయినా, మొదటిపదానికి ఉన్న గౌరవం రెండో పదానికి లేదు. సమస్త జనులకూ శ్రేయస్కరమైన కొన్ని నియమాలు ఏర్పరుచుకుని వాటిని పాటించడం culture – మనభాషలో దాన్ని గుర్తించడం సంస్కారం, గౌరవించి పాటించడం సంస్కృతి. అందుకు భిన్నంగా cult అన్నది ఒకరకం మూర్ఖత్వం, వితండవాదం. మంచీ చెడ్డా వివక్షత లేకుండా తమకి ప్రియమైన ఒకే ఒక అభీష్టాన్నో ఒక వ్యక్తినో మూర్ఖంగా అనుసరించడం cult. దానివల్ల సమాజానికి జరిగే మంచి కంటే హానే ఎక్కువ.

ఇప్పుడు సంస్కృతి మాట చూద్దాం. మామూలుగా ఒక జాతి తినే తిండీ, కట్టే బట్టా, మాట్లాడే భాషా, అభివ్యక్తీకరించే భావపరంపరా, ఆచారాలూ, నిత్యనైతిక జీవనసరళిలో వారు వ్యవహరించే విధానం, ఉపయోగించే వస్తువులూ – ఇవన్నీ కలిసి ఉమ్మడిగా వారి సంస్కృతిని తెలియజేస్తాయని స్థూలంగా నిర్వచించవచ్చు.

ప్రతి దేశంలోనూ భౌగోళికంగానూ, వాతావరణంలోనూ గల వ్యత్యాసాలమూలంగా వారి ఆహారవ్యవహారాలూ, దుస్తులూ, ఆచారాలూ మొదలనవన్నీ కలిసి వారికే ప్రత్యేకమైనవిధంగా వారి సంస్కృతికి రూపు కల్పిస్తాయి. వారి భాష కూడా తదనుగుణంగానే రూపు కడుతుంది. ఆ వ్యత్యాసాలమూలంగానే మనకి మరొక దేశపుసంస్కృతిగురించి తెలుసుకోవాలన్న ఆసక్తి కలుగుతుంది. వారికథలు చదివినప్పుడు మనం గ్రహించేది వారి భావజాలమే కాక, ఆకథల్లో ప్రకటితమైన ఆచారవ్యవహారాలు కూడా. ఆశలూ, ఆశయాలూ, ఆకలీ, నొప్పీ, ఇల్లూ, వాకిలీ, కోపతాపాలవంటివి అన్నీ అన్ని దేశాల్లో ఒక్కలాగే ఉన్నా వాటిని ఆ దేశప్రజలు ఎదుర్కొనే లేదా సాధించుకునే తీరులో ఉండే వ్యత్యాసాలు వేరుగా ఉంటాయి. అవి అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తాం వారికథల్లో.

ఈసందర్భంలో నాకు రెండు సందేహాలు. మొదటిది - పైన చెప్పిన సంస్కృతిలో భాగాలు – ఆహారం, దుస్తులూ, భాషా, నిత్యజీవితంలో ఉపయోగించే వస్తువులూ – మారిపోతూ ఉంటాయి కదా మరి అదే మన సంస్కృతి అవుతుందా? ఉదాహరణకి, మనం ఇదివరకు పుట్టినరోజు జరుపుకునేతీరు వేరు. ఇప్పుడు పుట్టినరోజు అంటే cake, candles, happy birthday పాటా. మరి ఇదే మన సంస్కృతి అనగలమా? ఈ విషయం వర్ణిస్తూ రాసిన కథ మరొక దేశపు పాఠకుడికి ఆసక్తికరంగా ఉంటుందా? ఆకథవల్ల ఆ పాఠకుడికి మనదేశంగురించి ఏం తెలుస్తుంది? అంటే ఇప్పుడు కేకు పుట్టినరోజు వర్ణించే కథ అనువాదం చేస్తే, ఇతరదేశాల్లో వారికి మన సంస్కృతిగురించి తెలిసేదేమిటి?

ప్రస్తుతం మనం మాటాడుతున్న తెలుగులో మూడొంతులు ఇంగ్లీషు. అలాగే బ్లూజీన్స్, పీచా, నూడుల్స్ మనయిళ్ళలో సర్వసాధారణం అయిపోతే, అదే మన సంస్కృతి అవుతుందా? తెలుగువారికి ఇదీ “మన సంస్కృతి” అంటూ ప్రత్యేకంగా చెప్పుకోడానికి ఏమీ లేదా?

నేనిలా అడగడానికి కారణం ఇదివరకు చెప్పేను కానీ మళ్లీ చెప్తాను. తూలిక.నెట్ తెలుగువారి సంస్కృతిగురించి విదేశీయులకి తెలియజేయడానికి ప్రారంభించిన సైటు అని నేను చెప్తుంటే, ఈనాటి సమాజాన్ని, ముఖ్యంగా పాశ్చాత్యసంప్రదాయాల్ని పూర్తిగా ఆకళించుకుని అనుసరిస్తున్న పట్టణజీవితాన్ని చిత్రించే కథలు నాకు పంపుతున్నారు అనువాదకులు. నాకు అది పనికిరాదంటే, “ఏంటండీ మీ సంస్కృతి?” అని రొకాయించేరు ఒకరు. అంచేత అడుగుతున్నాను పై ప్రశ్న.

రెండో సందేహం, పెన్ స్టేట్ అధికారులప్రవర్తనని culture అన్నారు ఒక అమెరికన్ వ్యాఖ్యత. సమస్త మానవజాతికి సహజమైన “గుంపులో ఒకరినొకరు ఆదుకునే మనస్తత్త్వం,” మనవారిని మనం రక్షించుకోవాలన్న తపన ఈ దుర్నీతికి ఆపాదించేరు వారు. పాత రాతియుగంనుండీ అనూచానంగా వస్తున్న ఆచారం అది. నిజమే. కానీ

ఇక్కడ culture అన్న పదానికి అర్థం పైన మనం చెప్పుకున్న భాష్యానికి వేరుగా కనిపిస్తోంది. అది లోకకల్యాణానికి పనికొచ్చేది కాదు. ఒక కుటుంబంలోనో, ఒక గుంపులోనో ఒకరినొకరు ఆదుకునే ప్రవృత్తి మౌలికమైన, మానవీయమైన నీతికి దూరం కాకూడదు కదా. కుటుంబంలో ఒకరు తప్పు చేస్తే వారిని సరైనదారిలో పెట్టే బాధ్యత, ఆ తప్పు చేసినవాడు తన తప్పుని అంగీకరించి శిక్షకి తల ఒగ్గేలా చేయడమే నిజమైన సంస్కృతి అని నా విశ్వాసం.

ఇంతకీ మనం మాటాడుకుంటున్న సంస్కృతి – నా అభిప్రాయంలో ప్రస్తుతం మన భాషా, ఆచారవ్యవహారాలూ మారిపోతున్నా, అవి మన సంస్కృతి అనిపించుకోడానికి మరో శతాబ్దం కావాలనీ, ప్రస్తుతానికి మాత్రం వెనకటి ఆచారాలూ, వ్యవహారాలూ మాత్రమే మన సంస్కృతి అనిపించుకుంటాయనీ. ఏమంటారు?

000

(నవంబరు 18, 2011)

5. ఏకాగ్రతా, అనేకాగ్రతా

ఏకాగ్రత అంటే సమస్తం మరిచి ఒకే విషయంలో నిమగ్నమై ఉండడం. అనేకాగ్రత అంటే ఏమిటో చెప్పడం కష్టం. ఈటపా చదివినతరవాత మీకేం తోస్తే అదే. ఇంకా దీన్నే అష్టకర్మావధానం అని కూడా అనొచ్చు. కారు నడుపుతూ, కాఫీ చప్పరిస్తూ, రేడియో వింటూ, ఒక చెవి పీసుసాయంతో మరొకళ్ళతో ఊసులాడుతూ పోతుంటారు కొందరు. ఇంకా వెనకసీట్లో పిల్లలు ఇంకా ఎంతసేపూ అంటూ పిల్లలు నస కూడా చేరిస్తే అది మరీ వీర అష్టకర్మావధానమే! అలాటి అవస్థని అన్నమాట అనేకాగ్రత అనాలి.

పూర్వము ద్వాపరయుగంలో ద్రోణాచార్యులవారు పాండవులకి విలువిద్య నేర్పినవిధానంగురించి చెప్పుకునే కథ - మీకు జ్ఞాపకం లేకపోతే ఇదుగో.

శ్రీ ద్రోణాచార్యులవారు పంచపాండవులని వరసగా నిలబెట్టి, "అదుగో, దూరంగా ఓ చెట్టుంది. కనిపిస్తోందా?" అని అడిగేరు. పాండవులలో నలుగురు, "అవునవునవును, ఉంది, ఉంది," అన్నారు. అర్జనుడు మాత్రం, "నాకేమీ కనిపించడంలేదు," అన్నాడు. ఆచార్యులవారు, "మరి ఆ చెట్టుమీద పిట్ట కనిపిస్తోందా?" అనడిగేరు. మళ్ళీ అందరూ, "అవునవునవును," అన్నారు కానీ అర్జనుడు మాత్రం "లేద"న్నాడు. "మరి ఆ పిట్టకన్ను కనిపిస్తోందా?" అంటే, "కనిపిస్తోంది," అన్నాడు అర్జనుడు. మిగతావారేమన్నారో తెలీదు కానీ ఇది మాత్రం అర్జనుడి ఏకాగ్రతకి నిదర్శనంగా చెప్తారు. అంటే ఏ పని చెయ్యాలో దానిమీద మాత్రమే దృష్టి నిలపడం.

అందుకు ప్రతిగా ఏకకాలంలో నాలుగో పదో కర్మలయందు నిమగ్నులైతే లేదా అవడానికి ప్రయత్నిస్తే దాన్ని ఏకాగ్రత అనరాదు. కలియుగం నాలుగోపాదంలో ఈ

బహుముఖకార్యనిర్వహణ అమెరికాలో పుట్టి దేశదేశాలా వ్యాపించినట్టు అనిపించినా, నిజానికి ఇది మన నిత్యజీవితంలో ఎల్లెడలా ఉంది.

మన పల్లెల్లో రోజుకూలీ చేసుకునే ఆడవాళ్ళు పిల్లలని చెట్టుకొమ్మకి వేలాడేసిన గుడ్డఉయ్యాలల్లో పడేసి, అనకాపల్లి చుట్టముక్కొకటి అడ్డపొగ పట్టి, పదాలు పాడుకుంటూనో, పక్కవాళ్ళతో కబుర్లు చెప్పుకుంటూనో రాళ్ళు కొట్టడమో జల్లెడ పట్టడమో చేయడం ఈ అష్టకర్మావధానం కిందకే వస్తుంది నా అభిప్రాయంలో. మధ్యతరగతి ఇళ్ళల్లో ఆడవాళ్ళు పిల్లలకి చదువు చెప్తూనూ, మరీ చిన్నపిల్లలయితే వారి ఆలనాపాలనా చూసుకుంటూ, పొయ్యిమీద కూర ఎనుపుతూ, ఫోనులో మాటాడుతూ, టీవీలో సీరియల్ అనుసరించడం కూడా అలాటిదే.

నామటుకు నేను ఒక పని కంటే ఎక్కువ చెయ్యలేను ఏ ఒక్క క్షణంలోనూ. అది అర్జునుడికున్నలాటి ఏకాగ్రత కాదు. కేవలమూ నాబలహీనతే అని ఒప్పుకుంటాను. ఒకే సమయంలో నాలుగు పనులు చేబట్టడం నాకు చేతకాదంతే. కానీ గత నాలుగు నెలలుగా సీను కొంత మారింది. సమాజం నన్ను అటువేపుకి తోసేస్తున్నట్టు అనిపిస్తోంది. టీవీలో split screen రెండ మూడో షోలు ఏకకాలంలో కనిపిస్తున్నాయి నాఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే. వార్తల్లో ముగ్గురో నలుగురో తాజా తాజా రాజకీయాలు చర్చిస్తుంటే, స్క్రీనుకి అడుగుభాగాన సెలయేరులా పారుతున్న రిబ్బనులో సరికొత్త వార్తలు ఏకవాక్యాలలో సాగిపోతుంటాయి. అలాటప్పుడు కళ్ళు అటు తిరక్కుండా ఆపడం కష్టం. వీధిలోకెళ్తే కళ్ళు రోడ్డుమీద ఉండాలని నియమం అయితే ఉంది కానీ రోడ్డుపక్కన మారీచసుబాహుల్లా బిల్లుబోర్డులు మీద పడిపోతూ దృష్టిని అటువేపుకి లాగేస్తాయి. బట్టలు కొనడానికి వెళ్తే అక్కడ నాకక్కర్లేని, నేను విని ఆనందించలేని సంగీతం నాబుర్ర తినేస్తుంది. ఆ హోరులో పడి రెండు సైజులు పెద్దదయిన చొక్కా కొనుక్కొచ్చేస్తాను హడావుడిగా. ఎవరింటికేనా వెళ్తే, టీవీ పెట్టేసి,

మాటల్లోకి దిగిపోతారు వేడి వేడి పకోడీలు నవుల్తూ. మరి ఏకాగ్రత రమ్మంటే ఎలా వస్తుంది? హుమ్.

మాంఛి రద్దీసమయంలో కారులో కూర్చుని ఓచేత్తో చక్రం పట్టి మరో చేత్తో సెల్ పుచ్చుకుని టెక్స్టింగూ, నిక్స్టింగూ, పెక్స్టింగూ, (ఇంకా సెక్స్టింగూ) చేయడంమూలంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటీవలే గుర్తించి, అలా ఫోనులో మాటాడరాదని నియమాలు పెడుతున్నారు. దాంతో నీలిటూతులూ, చెవిపీసులూ వచ్చేయి. చేతులయితే ఖాళీ అయేయి కానీ బుర్రవిషయంలో మాత్రం పంపకాలు తప్పవు కదా. అంటే రోడ్డుమీద, చుట్టుపక్కల కార్లమీదా, నడిచే జనాలమీదా ఉండాల్సిన ఏకాగ్రతలో కొంత భాగం లుప్తమయిపోతుంది కదా.

అలాగే ఫోనులో మాటాడుతూ పిల్లలని సముదాయించబోతే వాళ్ళు హర్షించరు సరికదా తీవ్రనిరసన తెలియజేస్తారు రాగాలు తీస్తూ.

ఆపీసుల్లో అయితే బాసురుడు ప్రకటించే నిరసన మరింత విషాదకరం కాగలదు.

పడకటింటిలో సంగతి … నేను చెప్పనులెండి.

జరగడం అయితే ఇలా జరుగుతోంది కానీ నా సిద్ధాంతం మాత్రం ఈ బహుళ కర్మావధానం మంచిది కాదనే. ఎందుకంటే మెదడు ఎంత పెద్దదయినా దానికో పరిమితి ఉంది. ఒక విషయంమీద పెట్టవలసిన దృష్టి అనేక విషయాలకి పంచితే, ఒక విషయంమీద ఉండాల్సిన దృష్టి కాస్తయినా లోపించడం ఖాయం. సాధారణ భౌతికశాస్త్రం చెప్పే పాఠం అది, మంది ఎక్కువైతే మజ్జిగ పల్చబడినట్టు.

ఎలా చూసినా అనేకాగ్రత పరిమితసమయాల్లో మాత్రమే ఉత్తమమని గ్రహించగలరని ఆశిస్తున్నాను.

000

(నవంబరు 30, 2011)

6. చుక్కలూ, తోకచుక్కలూ

ఈమధ్య పాఠకులు చాలామంది ఈనాటి రచనల్లో చుక్కలూ [.], తోకచుక్కలూ [,] సరిగా లేవని చిరాకు పడుతున్నారు. అంచేత ఈరోజు పొద్దున్నే లేచి, ఈ విషయం సవిస్తరంగా చర్చించదల్చుకున్నాను. అంటే విశ్వవిద్యాలయాల్లో ఘనాపాఠీ పండితుల సిద్ధాంత గ్రంథాలలోవలె పాశ్చాత్య మహాశయులని ఆదర్శంగా తీసుకోక తప్పదు కదా. మనం అధ్యయించవలసిన రెండో విషయం మనచరిత్ర. మనకి ఈ రాతతీరు ఏ రాతలనుండి సంక్రమించెను అన్నది.

ప్రధానంగా మనకి మౌఖికసాహిత్యం అంటే చాలా గౌరవం. అంచేత చారిత్ర్యకంగా మనరాతలెలా వచ్చేయో చూడాలి మొదట. చాలా చాలా సంవత్సరాలక్రితం ఒక శుభసందర్భంలో వ్యాసులవారు మహా భారతం అనర్గళంగా గానం చేస్తుంటే వినాయకులవారు ఆపకుండా రాసేసినట్టు గ్రంథస్తం అయి ఉంది. “గంటం పుచ్చుకుని” అని అంటారు కానీ అప్పటికే గంటం వాడుకలోకి వచ్చిందా అన్నది నాకు అనుమానమే. ఇది ప్రక్షిప్తం అని నా నమ్మకం. ఎందుకంటే, కాలక్రమం చూస్తే ముందు వ్యాసులవారూ తరవాత అశోకుడూ వాళ్ళూ కదా వచ్చింది. అశోకుడి శిలాశాసనాలూ, తామ్ర శాసనాలూ కొంతవరకూ దొరికేయి. ఇదుగో, అశోకుని శిలాశాసనం.



(tewikiసౌజన్యంతో -
http://te.wikipedia.org/wiki/%E0%B0%B6%E0%B0%BE%E0%B0%B8%E0%B0%A8%E0%B0%82)

చూశారా, చుక్కలూ, తోకచుక్కలూ కనిపించడంలేదు. నిజానికి అసలు అక్షరాలే సరిగ్గా తెలీడం లేదు.

రెండవదశలో మనకి తాటాకుదస్త్రాలూ, గొలుసుకట్టు రాతా వచ్చేయి. తాటాకుమీద ఒకొక అక్షరానికి గంటం ఎత్తి రాయడంకంటే, గొలుసుకట్టుగా రాసుకుంటూ పోవడమే సులభం. కోర్టు దస్తావేజులూ, జాతకాలలో ఈ రాత నాకాలంలో కనిపించింది. ఇప్పుడుందో లేదో తెలీదు. వీటిల్లో కూడా విరామచిహ్నాలు కనిపించవు. ఎందుకంటారు? మనకి ఆపకుండా గుక్క తిప్పుకోకుండా మాటాడ్డం అలవాటు కనక. అలా ఆపకుండా గుక్క తిప్పుకోకుండా మాటాడుతున్నమాటలు రాస్తే చుక్కలూ తోకచుక్కలూ కనిపించే అవకాశం లేదు.

వెనక వ్యాసుడికి వినాయకునిలాగే, విశ్వనాథ సత్యనారాయణగారికి వారితమ్ముడు వెంకటేశ్వర్లుగారూ, ఆ తరవాత మన రచయిత్రులకి భర్తలో రిసెర్చి స్కాలర్లో లేఖరులుగానూ వ్యవహరిస్తూ వచ్చేరు. (చివరివిషయం నా కల్పిన కాదు. ఆయా రచయిత్రులే స్వయంగా ప్రకటించుకున్నారు). ఇలా నోటితో చెప్పి మరొకరిచేత రాయించుకోడం మనకి ఆనవాయితీ అయిపోయింది. ఈవిధంగా మనం మౌఖికసాహిత్యాన్ని పదిలపరుచుకుంటూ వస్తున్నాం. అంచేత, మనకి ఈ విరామచిహ్నాలమీద దృష్టి లేకుండా పోయింది.

పోతే, ఈ విరామచిహ్నాలఅవసరం పాశ్చాత్యులనించి సంక్రమించిందే అయినా వాళ్ళలో కూడా అందరికీ ఈ విరామచిహ్నాలంటే అట్టే గౌరవం ఉన్నట్టు కనిపించదు. సుప్రసిద్ధ రచయిత మార్క్ ట్వేన్ అంత సుప్రసిద్ధుడు కాని రోజుల్లో ఒక కథ రాసి ఏదో పత్రికకి పంపేడు అప్పటికి సంపాదకులు మార్క్ ట్వేన్ కథ ఇస్తే చాలు మహా ప్రసాదం అంటూ

పొంగిపోయే స్థితి లేదు అంచేత ఆ సంపాదకుడు ఆకథని తిప్పి పంపుతూ ఇందులో ఫుల్ స్టాపులూ కామాలూ లేవు వాటిని తగిన స్థానాల్లో ఉల్లోఖించి సరిదిద్ది పంపించు అని రాసేడు మార్క్ ట్వైన్ అప్పుడు మరొక కాగితం టైపురైటరులో పెట్టి దాన్నిండా .... ,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,,, టైపు చేసి ఇవిగో మీక్కావలసినచోట పెట్టుకోండి అని జవాబిచ్చేడుట.

అయ్యో, నేను కథ చెప్పే ఉత్సాహంలో చుక్కలూ, తోకచుక్కలూ పైపేరాలో ఎగరగొట్టేసేను చూసేరా. అయినా మీకు అర్థమయిపోయింది అవి ఎక్కడ లేవో. లేదంటారూ, పోనీ, మరోపని చెయ్యండి. నోరు విప్పి కనీసం మీకు వినిపించేలా పైకి చదువుకోండి ఆ భాగం. మీకు అప్పుడు కథ అర్థమయిపోతుందనే నా నమ్మకం.

000

(డిసెంబరు 17, 2011)

7. పూర్తి చెయ్యని పుస్తకాలు – 1

ఇదివరకోసారి చదవనివారికి ప్రత్యేకం శీర్షికతో "చదువుతాను, తరవాత చదువుతాను, తప్పక చదువుతాను" అను తిరుమంత్రం జపిస్తూ మనం పోగేసుకుని అటకమీదకి ఎక్కించేసే పుస్తకాలగురించి రాసేను. అప్పుడు నాలాటి పాఠకులు చాలామందే ఉన్నారని అర్థమయింది. మళ్ళీ ఇప్పుడు నాకు చదవాలన్న కోరిక అంటే నిజంగా చదవాలన్న కోరిక పుట్టింది. ముఖ్యంగా గత నాలుగు నెలలూ మరీ నిస్సారం అయిపోడంచేత. అంచేత అయం ముహూర్తో సుముహూర్తోస్తు అనుకుని కొన్ని పుస్తకాలు అటకమీంచి (ప్రతీత్మకంగా) దింపి, మరో రెండు కొత్తపాళీఇంట్లో అటకమీంచి దింపించి తెచ్చుకున్నాను. ఓ శుభముహూర్తాన వాలుకుర్చీలో వాలి, ఆ పుస్తకాలని పక్కనున్న బల్లమీద పెట్టి సుదీర్ఘంగా ఆలోచించడం మొదలెట్టేను ఏది ముందు అని.

అలా ఓ పది రోజులు గడిచేక, ఓ పుస్తకం తీసేను. ఏ పుస్తకమో తరవాత చెప్తాను. ఈలోపున నేను గ్రహించిన మరి కొన్ని విషయాలు చెప్పుకుందాం.

ముందు నాకు పుస్తకంపేరు నచ్చాలి. చాలామంది అట్టమీద బొమ్మ కూడా మనని ఠక్కున ఆకట్టుకునేగుణం కలిగి ఉండాలంటారు గానీ నాకది అంత ముఖ్యం కాదు. అంటే మరీ నెత్తిన చెంగూ, చెంపలమీద కన్నీటిచారికలతో మన హృదయకమలాన్ని కటకటలాడించేసే పరిదీనవదనలు గల అట్ట అని కాదు. అలా అయితే నాకస్సలు రుచించదు. ఓ మోస్తరుగా ఫరవాలేదు లెద్దు అనిపించేబొమ్మయితే, అట్టలోదిలేసి, పుస్తకంలో ముందుమాట, వెనక అట్టమీద పెద్దల లేక ప్రచురణకర్తల కితాబులు

చూస్తాను. అప్పటికి సుమారుగా అందులో సందేశం లేక ప్రధానాంశం తెలిసిపోతుంది. నవల అయితే ముగింపు తెలిసిపోయి, కౌతుకం ఖూనీ అయిపోయే ప్రమాదం కూడా వాటిల్లుతుంది కానీ వాటిని అధిగమించే ఆత్మబలం నాకుండడంచేత ఫరవాలేదు. నిజానికి నాకు చివరికి ఏమయింది అన్నది తెలుసుకోడం ఇష్టమే అయినా అంతకంటే ఎక్కువగా రచయిత ఎలా చెప్పేడు అన్నది ఎక్కువ ఇష్టం. ఎందుకంటే రచయిత ఎలా చెప్పేడు అన్నదానిమీదే మనం మళ్లీ మళ్ళీ "చదవగలగడం" అన్న సుగుణం ఆధారపడి ఉంటుంది.

ఇక్కడే మరో విషయం చెప్పాలి. నేను పూర్తిగా చదవలేదు అంటే ఆ పుస్తకం చదివేలా లేదు అనో మనచేత చదివించేలా లేదనో అర్థం కాదు. నేను పుస్తకం పూర్తి చెయ్యలేకపోవడానికి కారణం చాలామటుకు నా లోపమే. ఈనాటి చాలామంది పాఠకులలా నాకు "స్పీడురీడు" రాదు. నాకు ప్రతి మాటా, ప్రతి వాక్యం అర్థమయితే తప్ప చదివినట్టు ఉండదు. అక్కడే వస్తుంది తంటా. చదువుతుంటే, ఓ మాటో ఓ ఆలోచనో తగిలి నన్ను ముందుకి పోనివ్వకుండా ఆపేస్తుంది. ఆ మాటో ఆలోచనో నన్ను ఆ దిక్కుగా లాక్కుపోతుంది. వాటిని అదుపులోకి తీసుకుని, మళ్ళీ చేతిలో ఉన్న పుస్తకంలో పేజీమీదికి రావడానికి కొంత టైము పడుతుంది. అంచేతన్నమాట ఒక పుస్తకం పూర్తి చెయ్యడానికి నాకు చాలాకాలం పడుతుంది. అయితే నన్ను అలా ఆలోచింపజేయడం కూడా ఆ పుస్తకం సాధించిన ప్రయోజనమే కనుక దాన్ని సుగుణంగానే స్వీకరిద్దాం.

అలా కొంతకాలం సుదీర్ఘాలోచన చేసేక, త్రిపురకథలు తీసి చదవడం మొదలు పెట్టేను. మీలో చాలామందికి తెలిసే ఉంటుంది. కనీసం కొందరైనా వినుంటారు ఆయన విలక్షణమైన కథలు రాస్తారని. చక్కని తెలుగుసాహిత్యం చదవాలనుకునేవారికి ఒయాసిస్సులాటిది త్రిపురకథలు అంటారు విమర్శకులు. నాకు మాత్రం ఆదిలోనే హంసపాదు – ఈ సంకలనంలో కనకప్రసాదుగారి

ముందుమాట. అది చదవడం మొదలు పెట్టి, పది పేజీలు చదివేసరికి ఇది మనలాటి సగటు పాఠకులకి కాదేమో అనిపించింది. నేను ఈ సంకలనం చూడ్డం ఇదే మొదలు కానీ ఇంతకుముందు దాదాపు రెండేళ్ళ క్రితం ఒక కథ, "భగవంతంకోసం" చూసేను. ఎలా ఎక్కడ చూడ్డం జరిగిందో జ్ఞాపకం లేదు కానీ చదివేను. నాకు నచ్చింది. అనువాదం చేసేను కూడా. అప్పట్లో త్రిపురగారిని ఆ కథ నేపథ్యంగురించి అడిగేను. ఆయన, "పెద్దగా చెప్పుకోడానికేంలేదు. Samuel Beckett రాసిన Waiting for Godot చదివేక అలాటికథ రాయాలనిపించింది. రాసేను. అంతే," అన్నారు. బెకెట్ శైలివిషయంలో చాలా తర్జనభర్జనలు జరిగేయి. ఆసంగతి ఇక్కడ అప్రస్తుతం.

పై సంకలనంలో రెండో మూడో కథలు చదివినతరవాత అన్ని కథలూ దాదాపు ఒకే మూసలో ఒకే ధోరణిలో చెప్పుకుపోతున్నట్టు అనిపించేయి. స్థూలంగా ఈ కథల్లో రచయిత ప్రధానాంశం – రచయితఅంతరంగం, ఆత్మతత్త్వవిచారణ కనిపిస్తుంది. నేనెవరు, బతుక్కి అర్థం ఏమిటి, మనం ఏదైనా ఎందుకు చేస్తాంలాటి ఆత్మశోధన, మానవ తత్త్వవిచారణ అంటారు కనకప్రసాదుగారు, పాలగుమ్మి పద్మరాజుగారు, ఇంకా ప్రముఖ రచయితలూ, విమర్శకులూ. అంటే ఆల్బర్ట్ మొరేవియా, కామూ, బెకెట్ వంటి పాశ్చాత్య తత్త్వజ్ఞాన రచయితలని అభిమానించేవారికి ఇవి నచ్చుతాయి. నామటుకు నాకు మాత్రం ఏమనిపించిందంటే నాక్కూడా అలాటి ఆలోచనలు – నేనెందుకు పుట్టేను, ఎందుకిక్కడ ఉన్నాను, (ఏం చేసినా) ఎందుకు చేస్తున్నాను - లాటి ప్రశ్నలు కలుగుతాయి తరుచూ. నాక్కూడా ఇలాటి కథలు రాయాలని ఉంటుంది. కానీ నేను రాయలేను. అంచేత త్రిపురగారిని మెచ్చుకోవాలి. నిజానికి ఎవరికైనా ఇలాటిప్రశ్నలు వస్తే ఎవరికి వారే జవాబులు చెప్పుకోవాలి కానీ వేరేవారికథల్లో దొరకవేమో అని నా నమ్మకం. అంచేతన్నమాట ఈ పుస్తకంలో కథలన్నీ చదవలేకపోయేను. ఏమైనా, మీక్కూడా ఇలాటి తత్త్వజిజ్ఞాసా, పాశ్చాత్య

తాత్త్విక రచయితలంటే విపరీతమైన అభిమానమూ ఉంటే ఈ కథలు మీకు నచ్చవచ్చు.

రెండోది నోరి నరసింహశాస్త్రిగారి నారాయణభట్టు. వారి రుద్రమదేవి చదివినప్పట్నించీ ఆయన రాసిన మిగతా చారిత్రక నవలలు కూడా చదవాలని నాకు మాచెడ్డ కోరికగా ఉండింది. గత జూన్‌లో కొత్తపాళీగారింటికి వెళ్ళినప్పుడు వారి లైబ్రరీనించి సంగ్రహించేను ఈ నారాయణభట్టు, కవి సార్వభౌముడు అన్న రెండు నవలలు. ఇప్పటికే ఆర్నెల్లయింది కనక గబగబ (నావేగంలోనే) పూర్తి చేయాలని తలపెట్టేను. నేను మొదలు పెట్టకముందు ఎదురు చూసింది నారాయణభట్టు కవిత్వ ప్రశస్తి ఇక్కడ చూడగలనని. దాదాపు పాతిక పేజీలు అయింతరవాత ఈ నవలలో నారాయణభట్టు రాజనీతిపైదుష్యానికే ఎక్కువ ప్రాధాన్యత అని అర్థమయింది. నిజానికి శాస్త్రిగారు రుద్రమదేవిలో కూడా కవి తిక్కనని రాజనీతి దురంధరుడిగానే ఎక్కువగా చూపించేరు. నాకెందుకో అక్కడ బాగుందనిపించింది కానీ నారాయణభట్టులో ఆయన కవిత్వప్రశస్తి చాలినంతగా లేదు. ఉన్నచోట పద్యాలు నాకు అర్థం కాలేదు. ప్చ్.

కవి సార్వభౌముడు పూర్తిగా చదివేను కానీ రచయిత పూర్తి చేయలేదనిపించింది. అంటే నేను ఎదురు చూసినంతగా కథ లేదని. శ్రీనాథుడు అష్టైశ్వర్యాలూ, అష్టకష్టాలూ కూడా అనుభవించినట్టు చెప్పుకుంటారు. ఆవిధంగా చూస్తే ఆయనజీవితంలో చాలా నాటకీయత ఉంది రుద్రమదేవి జీవితంలాగే. ఈ నవల కూడా ఆస్థాయిలో ఉంటుందనుకున్నాను. నరసింహశాస్త్రిగారు శ్రీనాథుని చైత్రయాత్ర, అందులోనూ గౌడ డిండిమభట్టు కంచుఢక్క పగులగొట్టడమే ఎంతో వివరంగా చిత్రించేరు. ఆయన ఇతర నవలలలోగే ఇందులో కూడా అస్త్రశస్త్రాలలో కవిగారి అనన్యసామాన్యమైన కౌశలం చూస్తాం. ఏతే, పద్యాలూ, శ్లోకాలూ మాటకొస్తే, మామూలే – నాకు అర్థం అయినవాటికన్నా కానివే ఎక్కువ. ఇంకా నాకు కొత్తగా అనిపించిన ఒకటి, రెండు

విషయాలు – మొదటిది పోతనని చిన్నకుర్రవాడిగా చిత్రించడం. కుల్లాయుంచితి, కోక చుట్టితి, … అన్న పద్యం ఆయనచివరి రోజుల్లో చెప్పింది అనుకున్నాను. ఈ నవలలో శ్రీనాథుడు జైత్రయాత్ర సందర్భంలో ఒక ఊళ్ళో గృహస్తుని నొప్పించలేక, తన ఆచారాలకి ప్రతిబంధకమయినా తిలపిష్టమూ, వెల్లుల్లితో తిన్నట్టు ఉంది. ఇవి ఎందుకు రాస్తున్నానంటే నరసింహశాస్త్రిగారు చారిత్రకనవలలు రాస్తున్నప్పుడు విస్తృతంగా పరిశోధన చేసి చారిత్రకసత్యాలను సేకరించి నవలలో పొందుపరిచేననీ, తాను కనుగొన్న విషయాలు రిసెర్చి స్కాలర్లు వాడుకున్న సందర్భాలు కూడా ఉన్నాయనీ రాసేరు తమ సాహిత్యవ్యాసాలు అన్న పుస్తకంలో. నాకెందుకో ఈ నవలలో చారిత్ర్యక సత్యాలకంటే శాస్త్రిగారి కల్పనాచాతుర్యమే ఎక్కువగా కనిపించింది.

కొన్ని వ్యాసాలు చదువుతుంటే, వ్యాసకర్తలు చర్చించే పుస్తకాలే కాక, విమర్శ పద్ధతులు, సిద్ధాంతసాహిత్యంలాటి విషయాలలో కూడా ప్రవేశం కలుగుతుంది. అలాటి విమర్శకులు రా.రా., శేషేంద్రశర్మగారలు.

రాచమల్లు రామచంద్రారెడ్డిగారి సారస్వతవివేచనలో వ్యాసాలు మూడు చదివిన తరవాత (కొల్లాయి గట్టితేనేమి, విమర్శ, ఆర్. యస్. సుదర్శనంగారి **సాహిత్య దృక్పథాలు** మీద వ్యాసం) మిగతా వ్యాసాలు ఆ మూలగ్రంథాలు చదివితే గానీ ఈ వ్యాసాలు అర్థం కావు అనిపించింది.

గుంటూరు శేషేంద్రశర్మగారి **వ్యాసావళిలో వ్యాసాలు కూడా** మరీ విశ్వవిద్యాలయ స్థాయిలో ఉన్నాయి. ఇది చదివితే రసం, ధ్వని, సాహిత్యవిలువలు, సాహిత్యప్రయోజనం వంటి సైద్ధాంతికవిషయాలు చాలా తెలుస్తాయి, అవి తెలుసుకోడం నాకు ఇష్టం కూడా. కానీ, ప్రస్తుతం అవి కొరుకుడు పడే స్థాయిలో నా బుద్ధి పని చేయడం లేదు. అంచేత ఈ రెండు పుస్తకాలూ పక్కన పెట్టేసేను.

ఇప్పటికి ఇంతే.

000

(డిసెంబరు 23, 2011)

8. పూర్తి చెయ్యని పుస్తకాలు - 2

తెలుగు నవలాసాహిత్యంగురించి తెలిసిన ఎవరినైనా తెలుగులో గొప్ప ప్రాచుర్యం పొందిన నవలలు ఓ పదో పన్నెండో చెప్పమంటే ఆ పట్టికలో వుప్పల లక్ష్మణరావుగారి "అతడు – ఆమె" తప్పకుండా ఉంటుంది. నేను చాలాకాలంగానే ఈపేరు వింటున్నా, తొలిసారిగా పుస్తకం చూసింది మాత్రం కొత్తపాళీగారింట్లోనే. ఎయిర్పోర్టులోనే చదవడం మొదలెట్టేశాను. ఓ గంటసేపు ఆపకుండా చదివేసేను కూడా నా అలవాటుకి విరుద్ధంగా అంటే నేను ఎయిర్పోర్టుల్లోనూ, ప్లేనులోనూ, రైళ్ళలోనూ అట్టే చదవలేను. ఆపైన లక్ష్మణరావుగారు మాప్రాంతంవారేనని తెలిసి మహ గొప్పపడిపోయేను.

ఇంతకీ కథ సంగతి – మొదట పుస్తకంపేరు సంగతి చెప్తాను. అతడు, ఆమె లాటి సర్వనామాలు వాడినప్పుడు దాన్ని రెండు రకాలుగా అర్థం చేసుకోడానికి అవకాశం ఉంది. వారిద్దరూ కొన్ని ప్రత్యేకలక్షణాలు గల వ్యక్తులు అని అనుకోవచ్చు పండిత పరమేశ్వరశాస్త్రిలా. లేదా ఆ ఇద్దరూ ఆనాటి యువతీయువకుకి ప్రతినిధులు అంటూ సాధారణీకరించినట్టు అని కూడా అనుకోవచ్చు.

ఈ నవల త్రిసంపుటి అన్నారు రచయిత. మొదటిభాగంలో అతడు అంటే చిదంబరశాస్త్రి. ఆమె అంటే శాంతం. మన స్వాతంత్ర్యపోరాటం మొదలై, ఉధృతంగా సాగుతున్న సమయంలో ఆనాటి విద్యాధికులకి ప్రతినిధులు. చిదంబరశాస్త్రిలాటి "అతడు" శాంతంలాటి "ఆమె"లూ ఆనాడూ ఉన్నారు ఈనాడూ ఉన్నారు. అంచేత సార్వత్రికంగా ఒక అబ్బాయి, ఒక అమ్మాయి భావాలూ, వారి ప్రవర్తనలూ, నమ్మకాలూ, వీటితో పాటు ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులూ ఎంతో విపులంగా చిత్రించేరన్నమాట. రెండోభాగంలో వారి పెద్దకూతురు సుభ "ఆమె".

ఆమెస్నేహితుడు జనార్దనం "అతడు". మూడోభాగంలో రెండోకూతురు లక్ష్మి "ఆమె", ఆమెస్నేహితుడు భాస్కరం "అతడు".

శైలి విషయంలో చెప్పవలసిన మాట ఇది డైరీరూపంలో రాసినట్టు ముందుమాటలో చెప్పేరు. అయితే ఇది ఒకరి డైరీ కాదు. పైన చెప్పినట్టు ముగ్గురు "అతడు"లూ, ముగ్గురు "ఆమె"లూ ఉన్నారు కనక ఆరు డైరీలు అనొచ్చు. అంటే కప్పగంతులేస్తూ అక్కడక్కడ చదివేవారికి ఈ "నేను" ఎవరు అన్నప్రశ్న తలెత్తే అవకాశం ఉంది.

కథ చెప్పిన తీరు, భాష సహజంగా, మనని ఆకట్టుకునేలా ఉన్నాయి. "కాంసు" (కాబోలు), గ్యేపకం (జ్ఞాపకం), చూపుణ్ణు (చూపి ఉండును?) లాటి మాటలతోపాటు "అల్పాగ్యతాభాగ్యం" లాటి కొత్త నుడికారం కూడా కనిపించి మురిపించిందని ఒప్పుకోక తప్పదు. అయితే నేను ఆకళించుకోలేకపోయిన సందర్భాలు కథ చక్కగా నడుస్తున్నప్పుడే తగిలేయి. ఒకచోట మొత్తం సంభాషణ అంతా ఇంగ్లీషులో సాగింది మూడు, నాలుగు పేజీలు. అదంతా తెలుగులిపిలో రాయడం జరిగింది. అలా ఇంగ్లీషు తెలుగులిపిలో చదవడం, చదివి అర్థం చేసుకోడం నాకు చాలా కష్టం. అలాటి సందర్భాలలో పాత్రలు ఇంగ్లీషుకి అలవాటు పడిపోయేరన్న సంగతి రచయిత మరో విధంగా పాఠకులకి తెలియజేసి ఉంటే బాగుండేది. దానికి తగిన మాధ్యమం సృష్టించుకోగలిగినప్పుడే రచయిత ప్రతిభ వ్యక్తమవుతుందని అని నా అభిప్రాయం. ఏ విషయమైనా కథలో ఉన్నదున్నట్టు చెప్పినప్పటికంటే ఇతరసాధనాలు వాడుకుని సూచనప్రాయంగా చెప్పడంలో కొత్తదనం, స్ఫూర్తి కనిపించడమే కాక, పాఠకులకి ఆలోచించుకోడానికి కూడా అవకాశం కల్పిస్తుంది, వారి మేధకి పని పెడుతుంది. ఇది నాకు లోపంగానే కనిపించింది ఈ నవలలో. అలాగే జనార్దనం బ్రిడ్జి కట్టడానికి ఇంజినీరింగు లెక్కలు పాఠం పెట్టేయడం కూడా నా ఉత్సాహాన్ని కాస్త మందగించేలా చేసింది.

రాజకీయసిద్ధాంతాలని స్వప్రయోజనాలకి వాడుకోడం, స్వప్రయోజనంకోసం కోట్లు మార్చేయడం చాలా వాస్తవికంగా చిత్రించేరు రచయిత. రాజకీయ చర్చలతోపాటు, నిత్యజీవితంలో వంటకాలవంటి సాధారణవిషయాలు కూడా సరదాగా ఉన్నాయి. శాస్త్రి ఎండావకాయ వర్ణన నోరూరించింది. ఆకాలంలో మగవాళ్ళు వంటింటిపేపు వచ్చేవారు కాదు చాలా ఇళ్ళల్లో. ముఖ్యంగా కొన్ని బ్రాహ్మణకుటుంబాల్లో ఇంట్లో భార్య తప్ప మరో ఆడమనిషి లేకపోతే తప్ప.

నేను చదివినంతమేరకి, నాకు ఆశ్చర్యం కలిగించిన రెండు సందర్భాలు – తల్లీకూతుళ్లు చీటికి మాటికి కౌగలించుకోడం, ముద్దులు పెట్టుకోడం, తల్లిని కూతురు పెళ్ళికి ముందు సెక్స్ అనుభవించేరా అని ప్రశ్నించడం, మన సంప్రదాయంప్రకారం అసహజమే. కనీసం నాకాలంలో నేను వినలేదు అలాటివి. నిజానికి తల్లిగారి సెక్స్ జీవితంగురించి అమెరికాలో కూడా చాలా కుటుంబాల్లో మాటాడరు ఇప్పటికీ. రెండోది, సుప్రసిద్ధ నటి Catherine Hepburn సౌందర్యంమూలంగా పేరు తెచ్చుకుంది అనడం. ఆమె అందంగా ఉండడంనిజమే కానీ ఆవిడ కీర్తి సంపాదించుకున్నది character actressగానే. కేవలం తమ సౌందర్యం కారణంగా పేరు తెచ్చుకున్నవాళ్ళు Marilyn Monroe, కొంతవరకూ Elizabeth Taylor. మరి జర్మనీలో Catherine Hepburnకి అలాటి పేరు ఉండేదేమో ఆరోజుల్లో నాకు తెలీదు.

ముందే చెప్పేను రెండోభాగంలో పెద్దకూతురికథ, మూడో భాగంలో రెండోకూతురి కథ అని. ఆ మూడో భాగానికొచ్చేసరికి, నాకు ఆసక్తి తగ్గిపోయింది. నాకు రాజకీయాల్లో, ఇలాటి వాదప్రతివాదాల్లో అంత ఆసక్తి లేని కారణంగా. నా రాజకీయ అజ్ఞానంగురించి మరో టపాలో ప్రస్తావిస్తాను. ప్రస్తుతానికి, దేశంలోస్వాతంత్ర్యం రాకముందు, సమరం జరుగుతున్నప్పుడూ, వచ్చేక ఆ మూడుతరాల భావజాలంలో, సమాజంలో వచ్చినమార్పులు ఈ నవల చదివితే అర్థమవుతాయని మాత్రం అర్థమయింది.

ఇంతకీ, ఈ అన్ని కారణాలవల్ల నేను పూర్తి చేయలేదీ పుస్తకం.

000

(డిసెంబరు 27, 2011)

9. వెనక్కి చూడ్డంలో సొగసులు

వెనక్కెందుకూ చూడ్డం? మనకళ్ళు తలవెనక లేవు కదా? పరమశివుడికి నుదుట ఉంటుందిట మూడో కన్ను. భృగుమహర్షికి అరిపాదంలో ఉండేదిట ఓ కన్ను. నేను చూడలేదు కనక ట అంటున్నాను. భృగుమహర్షికి అదెలా వచ్చిందో తెలీదు కానీ శ్రీమహా విష్ణువు ఆ కంటిని మూసేసిన కథ మాత్రం బావుంటుంది. కదాచితుగా కొందరికి కళ్ళు నెత్తికెక్కేయంటారు, ప్రతీకాత్మకంగా అయిఉండొచ్చు. కానీ ఎవరికీ ఎప్పుడూ కళ్ళు నెత్తివెనక ఉన్నట్టు వినలేదు యావత్ సృష్టిలోనూ. ఎందుకంటారు? మనం చూడవలసింది ముందుకి కానీ వెనక్కి కాదు కనక.

మరి వెనక్కి చూడకుండా మనగలమా? అసలేం జరిగిందంటూ మొదలు పెట్టగానే మనం చెప్తున్నది వెనకటి కథే కదా. అలాగే అనగా అనగా అన్నా పూర్వకాలం శుకుడు శౌనకాది మహాఋషులకు అని మొదలు పెట్టినా చెప్పేవి వెనకటికథలే కదా. పోనీ, నిన్నా మొన్నా జరిగినసంగతులు మాటాడ్డం వేరూ, ముప్ఫై ఏళ్ళక్రితం సంగతులగురించి మాటాడ్డం వేరూ.

వారంరోజులక్రితం ఓ స్నేహితురాలు వాళ్ళ నాలుగేళ్ళ పాపని తీసుకొచ్చింది మాయింటికి. మేం ఏటిఒడ్డున నడుస్తుంటే, ఆ పాప "నాచిన్నప్పుడు" అని మొదలుపెట్టింది. నిజంగానే! ఆ పాప చెప్పిన కబుర్లు మరిచిపోయేను కానీ ఆ ప్రారంభం మాత్రం గుర్తుండిపోయింది.

అమెరికా మరియు ఇతరదేశాల్లో ఉన్న తెలుగువాళ్ళు అమితోత్సాహంతో సాహిత్యం సృష్టించేస్తున్నారు "మేం రచయితలం కాం," అనేవారి సంఖ్య చూస్తే, వీరితో ఓ డాట్ కాం సృష్టించవచ్చు అనిపిస్తోంది. తదితర రచయితలు కొందరు ఈ డయాస్పొరా

సాహిత్యంలో ఏంవుంది ఎంతసేపూ వాళ్ల చిన్నప్పటి ఊరూ, తాత ముత్తాతల కబుర్లూ, గతకాలపు స్మృతులే కదా అంటున్నారు. ఇలా అన్నవారినందర్నీ నిగ్గదీసి అడగాలనిపిస్తుంది నాకు. ఏమనా? మీ చిన్నప్పటి ఫొటోవో ఇల్లో స్నేహితుడో కనిపిస్తే మీమనసు ఎగిరిపడదా? పోనీ, కనీసం ఉలికిపడదా? అవును సుమా ఆరోజులు మరిచేపోయేను అనిపించదా?

వెనక్కి తిరిగి చూసుకోడం ఎందుకో చెప్తాను. ఇలా కేవలం అదొక మధురస్మృతి అనే కాదు. మనం ఎక్కడినుంచి వచ్చేమో తెలుసుకోడంకోసం. గతం తెలిస్తే కానీ భవిష్యత్తు దిద్దుకోలేం. అమెరికావో, రష్యావో, బ్రిటనో గొప్ప చరిత్ర సృష్టించిందని వారి చరిత్ర, సాహిత్యం, సంగీతం తెలుసుకుని ఆనందించే ఉత్సాహంలో మనకీ ఓ చరిత్ర, సాహిత్యం, సంగీతం ... ఉన్నాయని గుర్తించకపోడం శోచనీయం.

ఇదంతా ఎందుకొచ్చిందంటే, ఈమధ్య ఓ స్నేహితురాలు మీ ఎడ్రెసివ్వండి, చక్కగా కలంతో కాగితంమీద రాస్తాను అనడంతో. నిజమే, ఇమెయిలులు, చాటులు, విడియో చాటులు, టెక్స్టింగు ... ఇన్ని సౌకర్యాలున్న ఆధునిక యుగంలో చేత్తో ఉత్తరం రాయడమేమిటి ఎవరైనా వింటే నవ్విపోతారు అని అనుకుని నవ్వుకునేవారు ఉంటే ఉండొచ్చు గాక. నాకు మాత్రం అర్థమయింది ఆ ఆలోచనలో ఆంతర్యం. టకటక నాలుగు ముక్కలు కీలాడించి సెండు కొట్టేసి మరో పనిలోకి మళ్ళడం ఒక ఎత్తు. తీరిగ్గా కూర్చుని అనేక రకాలు ఆలోచనలు సావధానంగా కూడదీసుకుని కాగితంమీద పెట్టి, ఓపిగ్గా ముందు రోజు ప్రత్యేకం దానికోసం బజారుకెళ్ళి కవరు కొనుక్కొచ్చి దానిమీద ఎడ్రెసు రాసి, స్టాంపు అతికించి పోస్టాఫీసుకో పోస్టు డబ్బాకో వెళ్ళి ఉత్తరం పోస్టు చెయ్యడం ఒక ఎత్తు. ఈ రెండో తంతులో వెచ్చించిన కాలం ఆవ్యక్తికి చేస్తున్నపనిమీద గల శ్రద్ధ, మనమీద గల ప్రత్యేకాభిమానమూ కూడా ద్యోతకం కావూ? మళ్ళీ జవాబుకోసం ఎదురు చూడ్డంలో కూడా అంతటి ఆత్మీయతలూ అంతఃకరణలూ కనిపిస్తాయనే నా నమ్మకం. ఈనాటి స్పీడు బతుకులకి ఇదొక మంచి

మందు, వేగపిచ్చికి విరుగుడు. వెనకటి రోజుల్లో ఉత్తరాలు రాయడం కూడా ఒక కళ. అందుకే కొందరు పెద్దల ఉత్తరాలు పుస్తకరూపంలో నిక్షిప్తం చేసేరు.

మాఅమ్మాయి అప్పుడప్పుడు నాకు నచ్చుతాయనుకున్న సినిమాలగురించి చెప్తుంది. ఈమధ్య ద ఆర్టిస్ట్ సిడీ చూడమని చెప్పి డివిడీ పంపించింది. ఇంతకీ ఈ సినిమా విశేషం ఏమిటంటే మూడున్నాయి. ఒకటి – ఈనాటి రంగురంగులలోకంలో ఇది నలుపు తెలుపు చిత్రంగా నిర్మించింది. రెండు – ఈనాటి సినిమాలు నానారకాల భాషలతో, అవాచ్యాలతో వీరాంగం వేస్తున్న సందర్భంలో మాటలు, పాటలు లేకుండా తీసినది. అంటే వెనక్కి చూడ్డం ఎందుకు అనేవారందరికి ఇది సినిమా చరిత్రని వందేళ్ళు వెనక్కి తిప్పడమే అనొచ్చా? అనరాదు. ప్రేక్షకులూ, సినీవిమర్శకులూ ఎంతో మెచ్చుకుంటున్నారు ఈ సినిమాని. ఇదే మూడో విశేషం.

ఈ సినిమా మాటలు లేకుండా, రంగులు లేకుండా, ఈనాటి ప్రేక్షకులని అలరించేలా తీసేరంటే ఆనాటి సాంకేతిక పరికరాలని ఆధునికం చేసేరనే కదా. అలాగే ఈమధ్య వచ్చిన శ్రీరామరాజ్యం కూడా చాలా చాలా పాతకథే అయినా చాలామంది మెచ్చుకున్నది కద.

అంచేత, వెనక్కి తిరిగి చూసుకోడంలో తప్పు లేదు. అక్కడ నేర్చుకున్న పాఠాలని ఈనాడు మన జీవితాలకి అన్వయించుకోగలిగినవి అన్వయించుకుని బతుకులు తీరిచి దిద్దుకోడంలో ఉండాలి మన నేర్పు. నామాట నమ్మకం లేకపోతే, ఓమారు ప్రయత్నించి చూడండి.

ooo

(జనవరి 22, 2012)

10. ఇదేం కాలమో!

మామూలుగా మనకి ఆరు ఋతువులున్నాయి కానీ అవి ఇప్పుడెంతమందికి తెలుసో నాకు తెలీదు. ప్రస్తుతం వాటిని ముచ్చటగా మూడు కాలాల్లోకి కుదించి ఎండాకాలం, వానాకాలం, చలికాలం అని చెప్పుకుంటున్నాం. విస్కాన్సిన్లో రెండే కాలాలు – చలికాలం, రోడ్ రిపేర్లకాలం. ఈ రెండు కాలాల్లోనూ రోడ్డుమీద కార్ల జోరు బాగా తగ్గించవలసివస్తుంది. చలిలో జోరు హెచ్చిస్తే జరిగే ప్రమాదాలు రెండు – ఏ గుంటలోకో జారిపోడం లేదా మరో కారుకి పెట్టేయడం. రిపేర్లకాలంలో పోలీసులిచ్చే తాంబూలాలందుకోడం మరో ముచ్చట.

టెక్సస్ వచ్చేక ఈ పంచాంగాలు పనికి రావని తెలిసింది ఈయేడు నాకు. కిందటేడు ఫిబ్రవరి ఐదో తారీకున మంచు పడిందని ఫిబ్రవరీ ఐదో తారీకున రాసేననుకుంటాను. ఈయేడు ఫిబ్రవరీ ఐదో తారీకున మంచు లేదు, ఆరో తారీకునా లేదు. ఏడో తారీకునా, తొమ్మిదో తారీకునా, ఆఖరికి ఇరవైతొమ్మిదో తారీకున కూడా లేదు. లేదు, లేదు మంచు లేదు. ఈయేడు మంచు ఎంత లేదంటే, టెక్సస్లో మంచేమిటి, హాహా అని నవ్వుకోవాలన్నమాట. అంత పొడిగా ఉందిక్కడ.

మంచు లేకపోతే చలి లేదని కాదు. చలి ఉంది. ఎంత ఉంది ఎప్పుడుంది అని చెప్పాలంటే మాత్రం ఉగాదినాడు యాయవారపు బ్రాహ్మణుడిలా మొదలెట్టాలి తిథి, వార నక్షత్రాలూ, రాహుకాలం, వర్జ్యం మున్నగువాటితో.

నాకసలు మతి పోతోంది. రోజు పొద్దున్నే లేస్తూనే కంప్యూటరులో చూస్తాను ఎంత ఎండ, గంటకి ఎన్ని మైళ్ళవేగంతో గాలి వీచును, ఎంత శాతం వాన పడడానికి అవకాశం ఉంది ... ఇలాటివి. ఎందుకంటే ఈనాటి వేడిమి 40 డిగ్రీలు సెంటిగ్రేడు

అంటాడనుకోండి పెదరుమనిషి. గంట గంటకి కూడా చెప్పగలడు కానీ అదిప్పటికి అప్రస్తుతం.

నలభై డిగ్రీలంటే నాకో లెక్క కాదు. ఓ తేలిక జాకట్టు తొడుక్కు పోగలను. కానీ, గాలి ప్రళయప్రభంజనంలా ఇరవై ముప్ఫై మైళ్ళ వేగంతో చెలరేగినప్పుడు ఆ నలభై డిగ్రీల ఎండా నలభైలా కాక పదిహేనులా అనిపిస్తుంది. చలి సూదుల్లా చర్మాన్ని గుచ్చేస్తుంది. అలా చలి ఓపక్కన చర్మాన్ని కొరికేస్తుంటే, మరోపక్క ఆ గాలే మనల్ని గాల్లోకి తేలిపోయేలా కొట్టుకుపోతుంటే నడుచుట ఆనందదాయకంగా ఉండదు. గాలి వీస్తున్న వేపు నడవడం తేలికే కానీ వెనక్కి రావడం చాలా చాలా కష్టం.

ఆ తరవాతి ఇబ్బంది పెదరుమనిషి చెప్పే వాన గణాంకాలు. నామటుకు నాకు ఈ ఇరవై శాతం, ముప్ఫై శాతం లెక్కలు హాస్యాస్పదంగా ఉంటాయి. నాకు కావలసింది వాన పడుతుందా, పడదా, గొడుగు పట్టుకెళ్ళాలా, పట్టుకెళ్ళక్కర్లేదా, నడిచి వెళ్ళడమా, కారులో వెళ్ళడమా – ఇదీ నా సదసత్సంశయం. వాన పడుతుందంటే గొడుగు, లేదంటే నడిచి … అంతే కానీ “వాన పడవచ్చు లేదా పడకపోవచ్చు“ అంటే ఎలా నేను నానిర్ణయాలు చేసుకోడం? నలభైఐదు శాతం పడే అవకాశం ఉందంటే గొడుగు కావాలా వద్దా అన్నది ఎలా తేల్చుకోడం?

అమెరికాలో farmer's almanac అని ఓ రకం పంచాంగం ఉంది. అందులో రైతులు ఎలా వాన వచ్చేదీ తెలుసుకోడానికి ఓ సూత్రం ఉంది. గాడిదలు తోకలెత్తి ఓండ్ర పెడుతే వాన వస్తుందని అర్థంట. అలాగే ground hog day అని ఉంది. పెన్సిల్వేనియాలో ఆ ground hog అనబడు పంచాంగకర్త తన కలుగులోంచి బయటికొచ్చి, తన నీడ కనిపించిందో లేదో చూసుకోడంద్వారా చలికాలం ఆరువారాలపాటు పొడిగించబడునో బడదో తెలియజేస్తాడుట. కొందరేమో ఆ గ్రౌండ్ హాగ్ కంటే ఉడతలూ, తొండలూ ఎక్కువ నమ్మకంగా చెప్పగలవంటున్నారు.

మనదేశంలో కూడా రైతులకి ఆవులూ, గేదెలూ, ఎద్దులూ ఇలాటి సేవలేమైనా అందిస్తాయేమో నాకు తెలీదు కానీ అందిస్తాయనే నా నమ్మకం.

టీవీలో పెదరుమనిషి చదివే వాతావరణవాణి వింటుంటే, నేను ఓ గాడిదని పెంచుకుంటే బాగుండుననిపిస్తోంది. ఇంతకీ మొదటికొస్తాను. విస్కాన్సిన్లో రెండే కాలాలు కనక ఏరకం బట్టలు ఎప్పుడు వేసుకోవాలో కూడా స్పష్టంగా తెలుస్తుంది మనకి. నిజానికి ఈ రెండు కాలాలూ ప్రవేశించేసమయంలో ఓ చిన్న తంతు ఉంది. ఒక కాలం ముగిసి రెండో కాలం ప్రవేశించేసమయానికి క్లాజెట్లో బట్టలు కూడా తదనుగుణంగా మార్పిడి చేస్తాం. ఎండాకాలం ప్రవేశిస్తోందనుకోండి. చలికాలం బట్టలన్నీ పెట్టెల్లో సర్దేసి, ఎండాకాలం బట్టలు హేంగర్లమీదకి ఎక్కిస్తాం. మళ్ళీ చలికాలం ప్రవేశిస్తూనే, అదే కార్యక్రమం మలివరసలో ...

టెక్సస్లో అలా లేదు. నిజానికి నాకు చాలా చిరాగ్గా కూడా ఉంది. ఇదేం కాలం అంటే "ఏరోజు కారోజే అర్థం కాక పోయేకాలం" అనాలనిపిస్తోంది. ఎందుకంటే ఇవాళ ఇరవై డిగ్రీలుంటే రేపు యాభై డిగ్రీలుంటుంది. ఇవాళ ఈదురుగాలి ఈ చెవిలోంచి ఆ చెవిలోకి కొడితే రేపు రెమ్మ కదలదు. ఇవాళ ఇరవై డిగ్రీలుంటే రేపు యాభై డిగ్రీలుంటుంది. అలాటప్పుడు ఏ బట్టలు దాచేయడమో ఎలా తెలుస్తుంది చెప్పండి. అసలు ఒకొకప్పుడు ఒకేరోజు రెండు జతలు మార్చవలసి వస్తోంది.

నా అదృష్టంకొద్దీ ఈసారి రెండు క్లాజెట్లున్న వాటా దొరికింది. నాచిన్నప్పుడు మాయింట్లో వెనకవసారాలో సామాన్లకొట్టు ఉండేది. ఈ క్లాజెట్లు అలాగే ఉంటాయి. నాకిప్పుడొక ఆలోచన వస్తోంది. ఆ రెంటిలో ఒకటి శిశిరక్లాజెట్టు, రెండోది గ్రీష్మ క్లాజెట్టుగా కేటాయించి, తదనుకూలంగా బట్టలు రెండు క్లాజెట్లలోనూ సర్దేస్తాను.

తెల్లారి లేస్తూనే ఏ క్లాజెట్టుని వరించను – ఎడమ కొట్టా? కుడికొట్టా? చలిబట్టలా, ఎండబట్టలా అని అన్నమాట నా సదసత్సంశయం!

000 (మార్చి 11, 2012)

11. ఇ-చదువుడు

రీడర్ అంటే చదివేవాడు, చదువునది, చదవబడేది, వాచకం ఇలా ఉన్నాయి అర్థాలు. వాటిని పెంచుకుంటూ పోతే, ఇ-చదివేవాడు (పుల్లింగం), ఇ-చదువునది (స్త్రీలింగం), ఇ-చదవబడేది (నపుంసకలింగం), ఇ-వాచకం (నపుంసకంలింగం) ఇలా భాషాభివృద్ధి చేసుకోవచ్చు. ఇ-చదువరి అంటే బాగుంటుంది కానీ పాఠకుడు అని అపార్థం చేసుకోవచ్చు కనక అది నిషిద్ధం. ఈవిధమ్మున చాలా చాలా ఆలోచించగా, "చదువుడు" అన్న కొత్తపదం, "వాడుకరి"లా, సృష్టించడమే ఉత్తమమూ, క్షేమమూ అనిపించింది. నిజానికిది కొత్తపదం కాదు. గ్రాంథికభాషలో చదువుడు, చదువుము అన్నవి మధ్యమపురుష గా వాడుకలో ఉన్నాయి కదా.

నేను నా నసాకేంతికబుద్ధితో బజారులోకి వచ్చిన సాంకేతికసంచయంమీద సదా ఓ కన్నేసి ఉంచుతాను. నాకు అందుబాటూ, వెసులుబాటూ అవగల వస్తువులమీద నిఘా ఇంకొంచెం పైస్థాయిలో ఉంటుంది. అలాటి వస్తుసముదాయంలో ఈ ఇ-చదువుడు ఒకటి. నేను బజారుకెళ్ళినప్పుడల్లా, అంటే కనీసం వారానికోసారి అక్కడ విద్యుత్ పరికరాలవిభాగాన్ని ఓమారు దర్శించుకుని ఆ లేబులలమీద సమాచారం చదువుకుని వచ్చేస్తాను, శనివారం శనివారం వెంకటేశ్వరుడిని దర్శించుకున్నట్టే. అవన్నీ అంతర్జాలంలో మరోమారు చూసుకుని తప్ప నాక్కావలసిన వస్తువులజోలికి పోను. ఈ ఇ-చదువుడు "చదువుడు", "చదువుడు" అని నన్ను పేరు పెట్టి మరీ పిలుస్తున్న భావన కలుగుతోంది కొంతకాలంగా. అంచేత కూడా "ఇ-చదువుడు" ఈ వస్తువుకి అన్వర్థనామధేయం అయిపోయింది. నేనే చేసేను.

ఈ ఇ-చదువుడు దాదాపు రెండేళ్ళగా కొనాలనుకుంటున్నాను. సుమారుగా నాకున్నపాటి సాంకేతిక పరిజ్ఞానం లేనివారు కూడా "ఇది వాడుతున్నాం"

అన్నతరవాత నాకు మరింత ఆవేశం పొంగుకొచ్చింది. తమకి తెలీనిదేముంది. మనం ఏదైనా కొనాలనుకోడానికి రెండు కారణాలుంటాయి. అందరికీ ఉందని ఒకటి, ఎవరికీ లేదని ఒకటీ కదా. సాధారణంగా నేను రెండో పద్ధతివేపే మొగ్గుతాను కానీ ఇప్పుడు మొదటి కారణమే నన్ను ఆవేశించింది అధికతరంగా.

యాభై ఏళ్ళక్రితం నాకు పరిచయమైన ఒకరు, తనకి అట్టే సాంకేతికపరిజ్ఞానం లేదని చెబుతూ (బహుశా నాకున్నపాటి కూడా లేనివారు), వాళ్లమ్మాయి తనకి ఐపాడొకటి ఇచ్చిందనీ, దానిలో తెలుగు సైటులు చూస్తున్నాననీ చెప్పేరు. దాంతో నాకు మరీ ఉక్కరోషం వచ్చేసింది. ఇంతమందికి ఉంది నాకు లేకపోతే ఎలా, ఆశ్చర్యం, అవమానం, అనుకుంటూ. నేను కూడా కొనితీరాలి అని తీర్మానించుకున్నాను. వాళ్లబ్బాయి "పైనెల్లో ఎమెజాన్ డాట్కాంవారు కిండిల్ ఫైర్ విడుదల చేస్తున్నారు, అది చూడండ"ని సలహా ఇచ్చేడు. అంచేత నవంబరువరకూ వేచి ఉండి, అది కొనీసేను.

కొనగానే, మొదట చూసింది తెలుగు పుస్తకాలు ఎలా చదవడం అని. వాళ్ళేమో పిడియఫ్ ఫార్మాట్లో ఉన్నవన్నీ చదవొచ్చన్నారు. అసలది చూసుకునే కొన్నాను. పైగా నాకు తెలిసిన ఒకరిద్దరు కూడా అదెంత చక్కగా, అనువుగా, తేలిగ్గా, అందంగా, హాయిగా ఉందో చెప్పేక నాకెందుకు సందేహాలొస్తాయి? మ్. వచ్చేయి అనతికాలంలోనే.

డియల్లై లో పుస్తకాలు బియం.పి.పిడియఫ్ అన్న తోకతో దిగుతాయి. అవి కిండిల్లోకి దింపుకుంటే, ముఖపత్రం మాత్రం చక్కగా తెలుగులో కనిపించింది కానీ మిగతా పుటలన్నీ నాచిన్నప్పుడు ఒకటోతరగతి నల్లరాయి పలకని తలపుకి తెచ్చేయి. ప్రతి పుటా ఒక నాపరాతి పలక అయి భాసించింది.

హడావుడిగా ఎమెజాన్‌వారి కిండిల్ ఫోరంలోనూ, ఖాతాదారుల సలహాదారులతోనూ వారంరోజులు కుస్తీ పట్టి తెలుసుకున్నది ఈ క్రొంగ్రొత్త మరియు పురోభివృద్ధిపూర్వకమైన కిండిల్ ఫైర్ తెలుగుఅక్షరాలని గుర్తించదని. ఈమాట నేను

అనడం లేదండీ. ఆ టెక్కు సపోర్టు మనిషి స్వయంగా నాతో చెప్పిన వాక్యం. అంచేత ఆ కిండిలు ఫైరుని తిరుగుటపాలో పుట్టింటికి పంపేయడం తప్ప నాకు గత్యంతరం కనిపించలేదు.

వాళ్లు, పాపం, నాకు సానుభూతి చెప్పి, ఆవస్తురాజాన్ని వెనక్కి తీసుకున్నారు. నాకు మాత్రం ఇ-చదువుడు లేక దిగులుతో అన్నం, నీళ్లూ సహించక, నీరసం వచ్చేయసాగింది. ఇంట్లో ఎవరూ లేరు కానీ ఉంటే నాకోసం వాళ్లు బెంగ పెట్టుకోవలసిన పరిస్థితి అన్నమాట.

ఇలా కొంతకాలం సాగేక, ఇలా కాదు, సరికొత్తవస్తువులు మనకి అచ్చిరావు అనుకుని ముందటితరం కిండిలు కొన్నాను. దీనిపేరు కిండిల్ టచ్. అంటే అది బజారులో కొత్తగా దిగుమతి అయినరోజుల్లో నాకు తెలిసినవాళ్ళు కొన్న శాల్తీ అన్నమాట.

ఇప్పుడేం కానున్నదో అన్న బెంగతో పోస్టులో వచ్చిన పెట్టె విప్పడానికి భయం వేసింది. రెండు రోజులపాటు దాన్ని అలాగే బల్లమీద ఉంచి అటూ ఇటూ తిరుగుతూ, దానివేపే చూస్తూ, ఆ పనీ ఈ పనీ చేసుకుంటూ గడిపేను. ఆ తరవాత మనసు చిక్కబట్టుకుని, గుండెబలం కూడ దీసుకుని, కానున్నది కాకమానదు అని గ్రహించి, పెట్టె తెరిచేను. నిజంగా ఆ క్షణంలో ఆహా, ఇంతకాలమూ నేను పడిన మనోవేదన అంతా అర్థరహితమే కదా అనిపించింది.

ఇనుమడించిన ఉత్సాహంతో, కడుపునిండా భోంచేసి, కిండిలు పట్టుక్కూర్చున్నాను. నామొదటి సమస్య ఇందులో స్క్రాటులు అడుకోడానికి వీలవునా, అవదా అని. దానికోసం నేను పడ్డ పాట్లు మరో చేటభారతం. అదెందుగ్గానీ, తెలుగు పుస్తకాలు కిండిలులో చదువుకోవాలన్నది నా ప్రథమ ముచ్చట. అంచేత హడావుడిగా DLI, తెలుగుపరిశోధన (teluguthesis.com), Archive.org సైటులలోంచి వీలయినన్ని పుస్తకాలు దింపేసుకున్నాను. అలా చేస్తుంటే నాకు అలనాటి లైబ్రేరియనుకళలు పడ్డట్టు అనిపించింది. అన్నట్టు చెప్పేనా, ఎమెజాను వాళ్ళయితే “ఎంతో చక్కగా

పుస్తకాలు క్షణాలమీద మీ కిండిలులోకి నేరుగా దింపేసుకోవచ్చు" అంటారు కానీ నిజంగా ఆసూత్రం వాళ్ళ సైటులో వాళ్ళు అమ్ముకుంటున్న పుస్తకాలకే వర్తిస్తుంది.

మనకి కావలసిన తెలుగు పుస్తకాలు ఇతర సైటులలోంచి దింపుకోడం అసాధ్యం అనను కానీ దానికో క్రతువు ఉంది. ముందు మన కంప్యూటరులోకి తెచ్చుకోవాలి. ఆ తరవాత, కిండిలులోకి పంపాలి. DLI అయితే చెప్పేను కదా, dli downloader అని మరో ప్రోగ్రాం అవసరం, కనీసం నా కంప్యూటరుకి. కొందరేమో అదేం అఖ్ఖర్లేదు, మాకు పుస్తకం చక్కగా కనిపిస్తోంది అంటున్నారు కానీ నాకు ఆ వివరాలు తెలీవు.

ఇంతకీ వీటిని కిండిలులోకి పంపిన తరవాత, చూస్తే, పుస్తకాలయితే కనిపిస్తున్నాయి కానీ నీ ఇ-చదువుడు చదవగలిగితే చదువు అని సవాలు చేస్తున్నట్టుంది. ఎలా అంటే – చీమలరాజ్యంలో చీమలు యూనికోడ్‌లో తెలుగులో ప్రచురించేయనుకోండి. సాపేక్షకంగా ఆ అక్షరాలపరిమాణం ఊహించుకోండి. కిండిలులో అక్షరాలు పెంచుకోడానికి వసతి ఉంది అంటున్నారు కానీ ఆ వసతి అన్ని పుస్తకాలకీ పనికిరావడం లేదు. కృష్ణశాస్త్రిగారి పుస్తకంలో అక్షరాలు బాగానే పెరుగుతున్నాయి కానీ మల్లాది వసుంధరగారి తంజావూరు పతనం మాత్రం చీమలరాజ్యంలో చీమతలకాయలంత అక్షరాలతో కనిపిస్తున్నాయి. ఇక్కడ కనిపిస్తున్నాయి అన్నపదం అనుచితం. మీదగ్గర కిండిల్ టచ్ అన్న వస్తురాజం ఉంటే, అందులో మల్లాది వసుంధరగారి తంజావూరు పతనం చదవడానికి ప్రయత్నించి చూడండి.

నా మరో అపోహ – కంప్యూటరులాగే ఇది కూడా తెరమీద అక్షరాలు LCD వెలుగులతో కనిపించి, రాత్రుళ్ళు పక్కమీద పడుకుని, వేరే దీపాలు పెట్టకుండా చదువుకోవచ్చు అనుకున్నాను. అది కూడా అపోహ అని తేలింది. ఇప్పుడు దీపపువెలుగునిచ్చే భూతద్దం కోసం చూస్తున్నాను. ఇలాటివి – అంటే పల్చగా కాయితంలా ఉండే భూతద్దాలు చాలాకాలం క్రితం చూసేను కానీ ఇప్పుడు వాటికి కాలదోషం పట్టినట్టుంది. ఎక్కడా కనిపించలేదు. అంతర్జాలంలో ఒకటి కనిపించింది

కానీ దానిధర ఇ-చదువుడుధరలో సగం ఉంది. అంటే నా ఇ-చదువుడు ఒకటిన్నరఇంతలు అవుతుందన్నమాట.

సరే, ఇంగ్లీషుపుస్తకాలు చూద్దాం అనిపించి, సంజయ్ గుప్తా రాసిన నవల Monday Mornings కొన్నాను. ఇంతకుముందు చాలా సార్లే చెప్పేను నేను చదవడం చాలా తగ్గిపోయిందనీ, అందులో ఇంగ్లీషు పుస్తకాలు అస్సలు చదవడం లేదనీ. మరి ఈ నవల ఎందుకు కొన్నానంటే అది టీవీలో పైలట్‌గా రాబోతోంది. ఇంకో కారణం కూడా ఉంది కానీ అది రహస్యం.

పోతే, ఇ-చదువుడుకి సంబంధించినంతవరకూ, ఆ ఆంగ్లపదాలు నా ఇ-చదువుడులో "చదువుడు, చదువుడు" అని అరుస్తున్నట్టు కనిపిస్తున్నాయి. ఆహా, ఈ ఇ-చదువుడుమూలంగా నాఇంగ్లీషు పుస్తకాలచదువు అభివృద్ధి పొందగలదనిపిస్తోంది కానీ ఇది ఎంతకాలం సాగునంటే, వేచి చూడవలెను.

ఇప్పుడు ఈ కచేరీ ఎందుకు పెట్టేనంటే, కిండిలు టచ్ గల ధీమంతులు నాసమస్యకి ఏమైనా పరిష్కారం చెప్పగలరని ఒకటీ, కొత్తగా కొనదలుచుకున్నవారు మరింత విస్తృతంగా పరిశోధనలు చేసి తమకి అనువైన వెర్షను కొనుక్కొనగలరని మరోటి.

అన్నట్టు మరి ఇప్పుడు నేను దీన్ని కూడా పుట్టింటికి తోలేస్తానా అని మీకెవరికైనా సందేహం కలుగుతుందేమో. లేదు. పంపను. అందరికీ ఉన్నప్పుడు నాకు లేకపోవడం చాలా చిన్నతనంగా అనిపిస్తోంది. ప్రస్తుతానికి, తలకింద పెట్టుకు పడుకుంటున్నాను. కాలక్రమంలో దాన్నేం చేస్తానో ఆ సమయం వచ్చినప్పుడు చెప్తాను.

000

(ఏప్రిలు, 9, 2012)

12. ప్రచారసాధన, విధానం

తొల్లి నారదులవారు శ్రీమహావిష్ణువును యథాశక్తి పొగిడి, "మహాప్రభూ, కలికాలంలో అమెరికాదేశములో మీసందేశమును ప్రచారము చేయుటకు సాధనములెవ్వి?" అని ప్రశ్నించెను.

అప్పుడు శ్రీమహావిష్ణువు కించిత్ విచారించినవాడయి, "నాయనా, మన కాలములోవలె జనులు జమ్మిచెట్టుకింద, దేవాలయ మండపములో కూడి చర్చ చేయరు. వారికి కలికాలములో పీసీలూ, టీవీలూ, ఐఫోనులూ ..వంటి ఇతరసాధనములు సమకూడును. వాటిద్వారా ప్రచారము జరుగును," అని శలవిచ్చెను.

నారదుడు ఆందోళితమనముతో, అర్ధనిమీలితనేత్రములతో, "అవి ఏమి స్వామీ? అవి ఎట్లుండును? వాటిని ఎట్లు ఉపయోగింతురు?" అని ప్రశ్నించెను.

అప్పుడు శ్రీమహావిష్ణువు ఇచ్చిన జవాబు నేను తిరిగి చెప్పనవసరం లేదు కదా. అమెరికాలో ఈమధ్య తపాలా ఆఫీసులకి కాలం చెల్లిపోయేలా కనిపిస్తోంది ఈ ఆధునిక ప్రచారసాధనాలమూలాన. అంచేత వాళ్లు ఆ ప్రచారసాధనాల్లోనే ఒకటి వినియోగించుకుంటూ మరోటి సూచిస్తున్నారు. అంటే టీవీలో బల్క్ మెయిలు అనబడే కాయితాలకట్టల ప్రచారం అన్నమాట. వ్యాపారస్థులు పోస్టుద్వారా ఇంటింటికీ ఫ్లైయర్లు పంపడంద్వారా సకలజనులకీ వారిసంగతి తెలిసి వారివ్యాపారం మూడింతలో తొమ్మిదింతలో కాగలదని. ఇందులో కిటుకు గ్రహించేరా? ఆ వ్యాపారాలమాట ఎలా ఉన్నా తపాలాఫీసుకి పని తగలడం తథ్యం.

మాఅపార్టుమెంటులన్నిటికీ తపాలాపెట్టెలస్థానం ఒకటుంది. అందరం అక్కడికెళ్ళి తెచ్చుకుంటాం మాఉత్తరాలూ, తదితర చెత్తాను. నిజానికి ఈ చెత్తరాలు ఇళ్ళదాకా తెచ్చుకునేవారు తక్కువే. ఆసంగతి మామేనేజ్మెంటువారికి తెలుసు కూడాను. అంచేత ఈ టపాలడబ్బాలపక్కనే ఓ చెత్తడబ్బా కూడా పెట్టేరు వాళ్ళు. మేం చాలామందిమి ఈ ప్రకటనలదొంతరలు మా పోస్టుడబ్బాలోంచి తీసి ఆ పక్కనే ఉన్న చెత్తడబ్బాలోకి గిరవాటేస్తాం అక్కడికక్కడే చెత్తభ్రమణం నిమిత్తం. వాటిని చెత్త మేనేజర్లు అంటే చెత్తని మేనేజి చేసేవారు పరిగ్రహించి పునరుద్ధరిస్తారు. చూసేరా, ఈవిధంగా మరిన్ని చెత్త ఉద్యోగాలు సృష్టించడం జరుగుతోందని ప్రభుత్వంవారు గర్వపడవచ్చునేమో కూడా.

నాబాధ ఏమిటంటే సమాజశ్రేయస్సు కోరే కొందరు “కాయితంవాడకం తగ్గించండి, తరుసంపదని సంరక్షించండి” అని మొత్తుకుంటుంటే, మరోపక్క మరికొందరు ఆ కాయితాలవాడకాన్ని హెచ్చించే సూత్రాలు వల్లిస్తున్నారు. లేకపోతే వారి ఉద్యోగాలు పోతాయిట. ఇదే ఎగదీస్తే బ్రహ్మహత్య, దిగదీస్తే గోహత్య అంటి. హా.

నేనిలా తరులకోసం బాధపడనా, పోస్టాఫీసువారి జీవనంకోసం బాధపడనా అని తికమక పడుతుంటే. ప్రత్యక్షమయేడు తారకం.

“మిమ్మల్ని కలుస్తానంటే తీసుకొచ్చేనండీ. ఈయన ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు, కథకుడు, పండితుడు, సాహిత్యచరిత్రకారుడు,” అంటూ మరొక పెద్దమనిషిని కూడా వెంటబెట్టుకొచ్చేడు.

“ఆహా,” అని రండి, రండి అంటూ మర్యాదగా ఆహ్వానించేను, కుర్చీలు చూపుతూ.

ఆ వెనకే సంధ్రాలు కూడా వచ్చింది. “పెద్ద సదూకున్న పండితులోరు వస్తన్నరంటే ఏటి సెప్తరో యిందాంవని వొచ్చిన,” అంది.

ఆయన కూడా ఎంతో మర్యాదగా మాయిద్దరికీ నమస్కారాలు చేసి, ఎదురుగా సోఫాలో కూర్చున్నారు. సావధానచిత్తులయి అన్న పదం నామనసులో మెదిలింది.

మామూలుగా నన్ను చూడ్డానికంటూ వచ్చేవారు తక్కువ. ఒకవేళ వస్తే, నారచనలేవో చదివుంటారనీ, వాటినిగురించి మాటాడతారనీ, కనీసం అదేమిటీ, ఇదేమిటీ అని ప్రశ్నిస్తారనీ అనుకుంటాం కదా. నేను ఎదురు చూస్తున్నాను వారేమంటారోనని.

"నేనో క్లాసిక్ రాసేనండీ," అన్నారాయన. భుజాన తగిలించుకొచ్చిన ఖద్దరుసంచీలోంచి ఓ కట్ట కాయితాలు తొంగి చూస్తున్నాయి.

నాకంటే ఓ దశాబ్దం పెద్దవారిలా కనిపిస్తున్నారు. ఆయనే క్లాసిక్కంటే కాదనడానికి నాకెన్ని గుండెలు!

"బాగుందండీ. సంతోషం, అభినందనలు," అన్నాను.

"దీన్ని పాఠకులదృష్టిలోకి ఎలా తేవడమా అని,... మీరేమైనా సలహాలు చెప్తారేమోనని .." అన్నాడు తారకం.

ఓ. ప్రచారంకోసం! ... నాప్రాణం క్షణకాలం ఉసూరుమంది. రెండోక్షణంలో తేరుకుని, "మీరు కవి, ప్రముఖ రచయిత, విమర్శకుడు, కథకుడు, పండితుడు, సాహిత్యచరిత్రకారుడు. మీకు నేను సలహా చెప్పడమేమిటండీ?" అన్నాను వినయంగా.

"అమ్మా, అలా అనకండి. బంగారు పళ్ళెరానికైనా గోడచేరుపు. మీరు మంచి విమర్శలు రాస్తున్నారని, మీ అభిప్రాయాలు చెప్తే బాగుంటుందనీ" అన్నారాయన అంతకంత వినయంగానూ.

కనీసం ఇంతవరకూ బండి బాగానే నడుస్తోంది. పరస్పర అభినందనసభ.

"క్లాసిక్కని మీరే అంటున్నారు కద. ప్రజలే దాన్ని వెతుక్కుంటూ వస్తారులెండి," అన్నాను ఆ కాయితాలకట్ట అందుకుంటూ.

"ఎంత క్లాసిక్కయినా మోసేవారుంటేనే మోక్షం కదమ్మా," అన్నారాయన.

ఆయనకీ కొంత అవగాహన ఉన్నట్టే ఉంది ఏ పుస్తకం ఎలా క్లాసిక్కవుతుందో అన్న విషయంలో.

"అదిగాత్తల్లీ, నీస్నేయితలకి సెప్పమంతన్నారాయన. గాపోతే ఆటొక్కుమీన నాలుగుముక్కలు గూడ రాయి," అంది సంధ్రాలు. ఆవులిస్తే పేగుల్లెక్కపెట్టేస్తుంది ఆవిడ.

ప్రముఖ రచయితగారు కాస్త ఇబ్బందిగా చూసేరు. "అంటే మీకు వీలయితేనే. మీరు నిర్మొహమాటంగా మీ అభిప్రాయాలు రాయండి," అన్నారు.

ఇది మరోబాధ. ఆయన అలా అన్నతరవాత కాస్త పొగడకపోతే బాగుండదు. ఇదొక లోపాయికారీ నియమం. ఆమాట ఎవరూ పైకి అనరు. పైగా, దానిమూలంగా నాకు "వచ్చే" లేక "పోయే" పరువు కూడా ఉంటుంది కదా.

"అసలు నాకు తెలీకే అడుగుతున్నా. పూర్వం మనదేశంలో అంటే ముప్ఫై, నలభైల్లో రాసిన పుస్తకాలకి విపరీతమైన ప్రాచుర్యం వచ్చింది. అదెలా జరిగిందండి?" అన్నాడు తారకం.

"అప్పట్లో రాసేవాళ్ళు తక్కువుండే వాళ్ళు. చదివేవాళ్లు కూడా కొంతవరకూ తక్కువేనేమో. పత్రికలద్వారానే ఎక్కువ ప్రచారం. ఇప్పట్లా సన్మానసభలూ, పుస్తకావిష్కరణ సభలూ కూడా తక్కువే. రాసి, ప్రచురించి, దేశంమీదకి వదిలెయ్యడమే."

"గుడ్డోడిసేతి రాయినాగ తగిల్తే తగుల్తాది, నేకపోతే నేదు," అంది సంధ్రాలు.

"అయితే రాసేవాళ్లూ, చదివేవాళ్లూ కూడా తక్కువే అయితే మరి ప్రచారం ఎలా?"

"ప్రచారం, ప్రచారం అంటూ ఎవరూ అంతగా గోలెట్టలేదనుకుంటా అప్పట్లో. సత్తా ఉంటే దానికదే నిలబడుతుంది. చదివినవారు తమకి నచ్చితే, ఇలాటివి మరొకరికి చెప్పొచ్చు. అది కూడా అవతలివారి అభిరుచికి తగును అనుకుంటేనే."

"మరి ఇప్పుడు పనికొచ్చే పద్ధతులు నాలుగు చెప్దురూ."

"పనికొచ్చే అంటే చెప్పలేను కానీ జరుగుతున్నది – అంతర్జాలంలో కనిపించిన సైటుల్లోనూ, బ్లాగుల్లోనూ ప్రచురించిన కథమీదో, వ్యాసంమీదో ఓ వ్యాఖ్య రాయడం ఓ పద్ధతి. లేదా మీపుస్తకంవివరాలు మాత్రం ఆవ్యాఖ్యలపెట్టెలోనే పెట్టేయడం, దొరికిన ఐడీలన్నిటికీ మెయిళ్ళంపేయడం. జాలసందేశం అనుకోండి. సభలకీ, సమావేశాలకీ హాజరయి, కాపీలు పంచిపెట్టడం."

"వాళ్ళందరూ చూస్తారంటారా?"

"ఆల్లకి ఇస్టంపైన ఇసీయం ఔవుతే సూత్తారు. నేదా, సెత్తబుట్లలోకి ఎట్టీస్తారు," అంది సంధ్రాలు నవ్వుతూ.

"అంతేనంటారా?"

"ఆ యమ్మ అట్నే సేస్తంది గంద,"

"అవునా?" అన్నాడు తారకం.

తారకం, అతనితో వచ్చిన కవీ ఎట్సెటరా తెల్లబోయి చూసేరు నావేపు.

"అది గాదు బాబు, ఆయమ్మవి చదవకండ, ఆరివి సదవమంటే ఆమెకి మాత్తరం ఉండదా నాయి ఈల్లు సదవనేదే అని."

నాక్కోపం వస్తోంది. ఈ సంధ్రాలు నాపరువు తీసేస్తోంది. "అది కాదు తారకం, మరి మీలాగే నాక్కూడా టైం ఉండాలి. నువ్వు రాసినవిషయంలో నాకు ఆసక్తి ఉండాలి ... ఇలా ఏవో ఆటంకాలనుకో. చదవకూడదని కాదు," అన్నాను విచారం వెలిబుచ్చుతూ.

"మీరేదో పెద్దవారనీ, తెలిసినవారనీ అడుగుతాం. మీకు ఇదొక్కటే వ్యాపకం కదా. టైం ఎందుకుండదండీ," అన్నాడు తారకం. అతనిచిరాకు స్పష్టంగానే తెలుస్తోంది. నాకు మరింత ఆశ్చర్యం.

"అన్నీ పారేయనులే. కొన్ని చదువుతాను. నిశ్చయంగా నారచనలంటే గౌరవం ఉన్నవారూ, నాస్నేహితులూ, నాకు ఆసక్తి ఉన్న విషయాలూ ... ఇలా ఎంపికలున్నాయి నాకు. అయినా నువ్వు ఇలా చిరాకు పడ్డం బాగులేదు. నీకథలు చదివేను కదా," అన్నాను.

"మరి నాబ్లాగులో మీరు ఒక్కసారి కూడా వ్యాఖ్య పెట్టలేదు. ప్రతిటపా పంపిస్తున్నాను."

"నీబ్లాగా? ఏ బ్లాగు? నాకు తెలీదే?"

"టెక్సనానంద ఎవరనుకున్నారు?"

హాతోస్మి!!

తారకంతో వచ్చిన కవిగారు తనపుస్తకం తరవాత పంపిస్తానని చెప్పి శలవు తీసుకున్నారు.

పోస్టాఫీసువాళ్ళ అభ్యర్థనా, పోస్టుబాక్సులపక్కనే ఉన్న చెత్తబుట్టా నాకళ్ళముందు మెదిలేయి.

000

(మే 26, 2012)

13. పండితశ్రీముఖము

కొంతకాలంక్రితం రాసేను నాకు ఆచార్యముఖం పడిందని ఇద్దరు స్నేహితులు అన్నారని. ఇప్పుడు మరో ఇద్దరు స్నేహితులు నాకు పండితశ్రీకళలు ఉన్నాయని నొక్కి వక్కాణిస్తున్నారు. నా "నాస్యేకడమీకాన్ని" అంగీకరించ నిరాకరిస్తున్నారు. అంచేత ఆనాడు ఆచార్యపదవి అంగీకరించినట్టే, ఈనాడు పండితశ్రీముఖము కూడా ఒప్పేసుకోవలసి వస్తోంది.

గొప్పతనంగురించి ఒక ప్రతీతి ఉంది మీరూ వినే ఉంటారు. కొందరు జన్మతః గొప్పతనం కలిగి ఉంటారు. కొందరు తమకి అనువైన రంగంలో కృషి చేసి గొప్పవారవుతారు. కొందరిమీద గొప్పదనం రుద్దబడుతుంది. అలాగే పాండిత్యం కూడాను. కొందరు సహజసిద్ధంగా పుట్టడమే పండితులుగా పుడతారు. కొందరు తమ తమ రంగాల్లో అవిరళంగా అవిరళంగా కృషి చేసి పండిత్యం సంపాదించుకుంటారు. కొందరిమీద పాండిత్యం రుద్దబడుతుంది. మరోరకం కూడా ఉంది లెండి. అది కేవలం పండితులం అనిపించుకోడానికి మాత్రమే చేసే కృషి. అంటే దృష్టి రంగంమీద కాక పండితులు అనిపించుకోడంమీద మాత్రమే ఉంటుంి వారికి. అది ప్రస్తుతానికి వాయిదా వేద్దాం. కనీసం నేను ఆ నాలుగోజాతిలో చేరడం ఇష్టంలేకే పండితురాలని కానని చెప్పుకుంటూ వస్తున్నాను.

ఇంకా నేను పండితురాలిని కానని ఎందుకు అంటూ వచ్చేనో కూడా చెప్తాను. ఈ మధ్య పుస్తకాలు చదువుతున్నానని చెప్పేను కదా. నిడుదవోలు వెంకటరావుగారూ, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారూ, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారూ, జి. వి.

కృష్ణరావుగారూ – ఇలా లబ్ధప్రతిష్ఠులయిన పండితులు రాసిన పుస్తకాలూ, వారి ప్రతిభావిశేషాలగురించి రాసిన పుస్తకాలూ చదివేక, పండితులంటే వీరూ అనిపించింది. వాళ్ళు చదివిన అనేకానేక వేదాంతగ్రంథాలూ, కావ్యాలూ, ప్రబంధాలూ, పాశ్చాత్యసాహిత్యం చూసేను. చదువుకున్నాం అంటే అదీ, పాండిత్యం అంటే అంత చదువుకున్న తరవాత వచ్చేది అని అర్థం అయింది. వాళ్లతో నా చదువు పోలిస్తే, వీధిబళ్లో చదివిన వానాకాలం చదువు శూన్యం అనే చెప్పాలి అలా గట్టిగా ఓ ప్రబంధమైనా చదవని నేను పండితురాలిని అని ఎలా చెప్పుకోను? చెప్తే మీరూరుకుంటారా? మీలాటివారు నవ్విపోరా? నీదీ ఓ చదువేనా అని హేళన చేయరా?

ఇంతకీ నేను పండితురాలినే అని ఇద్దరు మిత్రులు నొక్కి వక్కాణించేక, కనీసం కొంచెమైనా కృషి చేసి కనీసం ఆ పేరు దరిదాపులకైనా చేరగలిగితే బాగుండు అన్న దరూహ కలిగింది. అంటే వేదాలూ, ఉపనిషత్తులూ, శాస్త్రాలూ, పురాణాలూ, ప్రబంధాలూ – ఇలాటివన్నీ చదవాలి. వాటివరకూ చేరేముందు, అంతకంటె కింద ఉన్నమెట్టుమీద అడుగు పెడదాం అని పూర్తిగా కాకపోయినా సగం సగం గ్రాంథికభాషలో ఉన్న పుస్తకాలు చదివితే, కొంత భాషైనా పరిచయమవుతుందని నిర్ణయించుకున్నాను.

వెనక భండారు అచ్చమాంబగారి కథలూ, కనుపర్తి వరలక్ష్మమ్మగారి వసుమతి, విశ్వామిత్ర లాటివి చదివి ఉన్నాను కదా. వాటిలో భాష అర్థం కాలేదంటున్నవాళ్ళు ఇప్పుడు ఉన్నారు కనక నేను చూపువాసి మెరుగే అనుకోవచ్చు. ఇది నిజము కానిచో పాఠకులు అవశ్యము మన్నింతురు గాక.

ప్రస్తుతం మల్లాది వసుంధరగారి **తంజావూరు పతనం** పదిరోజులక్రితం మొదలు పెట్టి మొన్ననే పూర్తి చేసేను. నాకు సరదాగానే ఉంది. మొదటి విషయం సుదీర్ఘ

సమాసాలు – శరద్రాకాకళాధరస్నిగ్ధసుధాంశుమాల, అస్తమయోన్ముఖభానుబింబసౌందర్యరాగకిరణచ్ఛటాపాళి లాటివి. ఈపుస్తకంలో పదాలు కొంతవరకూ విడదీసి ఉన్నాయి కానీ కొన్నిపుస్తకాల్లో అంతా ఒకే పదంలా కనిపిస్తుంది ఎక్కడా విరామం అన్నది లేకుండా. నిజానికి వ్యాకరణరీత్యా అదే సరైన పద్ధతి కూడాను. ఎందుకంటే కిరణచ్చటావళి (కిరణాలగుంపు)కి మిగతాదంతా విశేషణం. ఇలాటిసందర్భాల్లో నాసరదా ఏమిటంటే, ఏ అక్షరంతో ఒక విశేషణం సమాప్తమవుతుందో చూసుకోడం. ఒకక్షరం, రెండక్షరాలు, మూడక్షరాలూ – ఇలా వరసగా కూడబలుక్కుంటూ చూస్తాను ఎక్కడో అక్కడ అర్థవంతంగా కనిపించేవరకూ. అది మెదడుతో కుస్తీ అన్నమాట.

అన్నట్టు ఇక్కడ మరోమాట కూడా చెప్పాలి. నాకీమధ్య తెలుగుభాష మీద మక్కువ మిక్కిలి అయిపోవుటచేత వీలయినంతవరకూ తెలుగే వాడాలని నిశ్చయించుకున్నాను. అంటే మాటకి మాట తెలుగు అనువాదం కాదు కానీ (cow dust time, performed karma లాగ) ఏ సందర్భం గానీ అస్సలు ఇంగ్లీషు రానివాళ్ళు చెప్పవలసి వస్తే ఎలా చెప్తారు అని ఆలోచిస్తే వచ్చే మాటల్లో అన్నమాట. అంచేత మెదడుతో కుస్తీ అన్నాను. ఆమధ్య ఎక్కడో విన్నాను వయసు పై బడుతున్నప్పు మెదడుని పదును పెట్టడానికి crossword puzzlesలాంటివి పనికొస్తాయని. గ్రాంథికబాషలో ఉన్న పుస్తకాలకి కూడా అలాటి ఉపయోగం ఉందని నానమ్మకం.

రెండోది వర్ణనలు. సాధారణంగా కథల్లో వర్ణనలకి ప్రాధాన్యం ఉంటుంది. పాత్రలనీ, పరిసరాలనీ వర్ణించడంవల్ల పాఠకుడికి ఆ ప్రదేశాలూ, పాత్రలూ చక్కగా బోధపడి, కథలో లీనమవడానికి సాయపడతాయి. కనీసం ఇది ఈనాటి విమర్శకుల అభిప్రాయం. వెనకటికథల్లో వర్ణనలు చూస్తే ఆ యా కవుల లేదా రచయితలపాండిత్యం ప్రకటించడానికి మాత్రమే అని కూడా అనిపించవచ్చు.

తంజావూరుపతనంలో మొదటి అయిదు పేజీలలో రచయిత్రి సహ్యాజనదీ, ఆ నదీతీరంలో తోట, ఆ తోటలో పెద్దిదాసు ఉంటున్న ఆరామం వర్ణిస్తారు. అందులో పదచ్ఛేదం చేసుకోవాల్సిన అవసరం రాలేదు కానీ ఆ తరు, లతా గుల్మాదుల పేరులు చూసి గుమ్మయిపోయేను. అవన్నీ కథలో చొప్పించడానికి ముందసలు తెలియాలి కదా. ఆతరవాత మంచి కవిహృదయం కూడా అయిఉండాలి అంతగా వాటిలో మమేకమయిపోయి వాటిని వర్ణించడానికి. అవన్నీ నాకిప్పుడు గుర్తు లేవు కానీ ఎప్పుడేనా రాయవలసివస్తే, ఆ పుస్తకం తీసి అవన్నీ కాపీ చేసేస్తాను మక్కికి మక్కీ!

ఈనాటి కథల్లో ఇలాటి వర్ణనలు అట్టే చూడం. నాకు తెలిసి, ఆ సంప్రదాయాన్ని కొంతవరకూ తమకథల్లో పెట్టినవాళ్లు మధురాంతకం రాజారాంగారూ, కాళీపట్నం రామారావుగారు. మధురాంతకం రాజారాంగారి కథ **జీవనప్రహసనం** చూడండి. ఓ చిన్నపలెటూరిని చిత్రించడానికి రెండు పేజీలు పట్టింది ఆయనకి. అక్షరాలా అది బొమ్మ గీయడమే!

అలాగే పాత్రలు కూడా. వసుంధరగారు ప్రతిపాత్రనీ, నాట్యగత్తెలనీ, వర్ణించినతీరు ముచ్చటగా ఉంటుంది. కన్నులకి గట్టినట్టు అనొచ్చు కానీ ఆ నర్తకీమణులు ధరించిన ఆభరణాలూ, కాసె పోసి చీరె కట్టినతీరూ – వాటి అసలు రూపులేమిటో తెలిస్తే కదా వాటిని ఊహించుకోగలగడం.

విజయరాఘవ నాయకు లిరువురు యువతులు కైదండయొసఁగ నంతః పురాభిముఖులై వెడలినారు. అచట నొక కాంత బంగరుతంబుగ నిండుగఁ బన్నీరునించి దానితో వారి పాదములఁ గడిగినది. ఒక ముదిత పాదములతడి యొత్తినది. ఒక యువతి కాళంజిఁబట్టుకొని నిలిచినది. ఒక సకియ చలువ పన్నీరు నించిన చికిలిబంగరుగిండి మహారాజుచేతి కందిచ్చినది. ఆయన ప్రసూన పరిమళమిళిత మధురోదకముల ముమ్మారు పుక్కిలించెను. అధరము దాపడచే నొత్తుకొనెను. అటుపై నిందిరా మందిరమున రాజిల్లు రాజ్యేందిరకుఁ గేలు మొగిచి నమస్కరించెను. రాణు లాయన కెదురుగ నిలిచి తమకుఁ బరిచారిక లందిచ్చు నవరత్న నీరాజనము లొసంగిరి. పట్టమహిషి రాలేదు.

నిలుపుటద్ద మొకసుందరి చేతఁబట్టి నిలిచినది. స్త్రీలు కడాని తట్టలు పట్టుకొని నిలుచుండగనే రాజు కొలువు శృంగార పుటాభరణములను సడలించెను. సరిగంచు చలువలఁ గట్టెను. చిన్నారియొంట్లు, శ్రీరామతాళి, సన్నవజ్రముల చేసరులు ధరించెను. అప్పుడు సింగపు మొగములతో నొప్పు చేరుళ్లచే వెలయు విశాలమగు భోజనశాలకు వచ్చెను. ధవళశంఖములు, తాళములు మ్రోగినవి.

అంచేత, ఆ వర్ణన చదివి ఓహో ఇలాటివేవో ఉండేవి కాబోలు అనుకుని సంతోషించాలిసిందే. అయితే వాటి వివరాలన్నీ సేకరించడానికి వసుంధరగారు ఎంత శ్రమ పడ్డారో తలుచుకున్నప్పుడు మాత్రం నేను ఆ స్థాయికి చేరుకోడానికి చాలా చాలా కాలము కాదు జన్మలు పట్టునని తోచుచున్నది.

అలాగే విజవరాఘువనాయకుని భోజనకార్యక్రమం వర్ణించడానికి నాలుగు పేజీలు పట్టింది. ఆయన స్నానానికి పరిచారికలు ఒకొకరు పీఠం అమర్చడం దగ్గర్నుంచి, సుగంధద్రవ్యాల మైపూతలూ, అడుగులకి మడుగులొత్తడం ...వంటివి చదువుతుంటే కళ్ళు తిరిగేయి.

ఇహ అక్కడ అమర్చిన వంటకాలు – అప్పడాలూ, నువుపొడి వంటి నాకు తెలిసిన వంటకాలతోపాటు “వడియములు వపకలిపి వండినపొడికూర”, “క్రొందునుకలుచేసి క్రొవ్విన పేటకందనకాయ దక్రమంబున గడిగి, జంబీరసార సేచనము చేసి, గంబూర

కస్తూరులు కలిపి … ” లాటి ఏనాడు కనివిని ఎరుగని భక్ష్యాలు మూడు పేజీలుంది. వాటిల్లో పదోవంతు రుచి చూడ్డానికి కూడా చాలదు చిన్ని నా కుక్షి!

వసుంధరగారిదే మరో నవల కూడా చదివేను. నవలపేరు **పాటలి.** మొదటిది చారిత్రకనవల అయితే ఇది చారిత్ర్యకకథా, ప్రేమకథా కూడా. ఇందులో కథానాయిక పాటలి బ్రాహ్మణయువతి. తండ్రి గ్రామణి అనగా గ్రామాధికారిట. ఆయన తన తమ్ముడిని గ్రామసంరక్షణకి నియమిస్తాడు. గ్రామరక్షణకోసం మరి ఆయనకి క్షాత్రం కూడా రావాలి కదా. ఆయన పాటలిని చేరదీసి క్షాత్రవిద్యలు కూడా నేర్పుతాడు. కథ గౌతమీపుత్ర శాతవాహనుడికీ మహారాష్ట్రులకీ మధ్య జరిగిన యుద్ధంచుట్టూ అల్లినా పాటలీ, శాతవాహనుడికొలువులో గూఢచారి అయిన పురందరుడూ – వీరి ప్రేమకథ. ఇందులో పాటలి శక్తిసామర్థ్యాలు చిత్రించినవిధానంలో అద్భుతమైన పాండిత్యప్రకర్ష తెల్లమవుతుంది.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే పాండిత్యం అంటే అది. పండితులంటే వారు. మరి నాలాటివారం ఏం చేస్తాం అంటే అవి చదివి అందులోవి కాపీ కొట్టి రెండవశ్రేణి రచయితలుగా స్థిరపడాలి. లేదా వారిలాగే కృషి చేసి అలాటి పాండిత్యం సంపాదించాలి. మరి వారందరూ చాలా చిన్నతనంలోనే మొదలు పెట్టేరు కదా. మరి నేనిప్పుడు, ముక్కాల్వాసి బతుకు ముగిసేక మొదలు పెడుతున్నాను కదా. అంచేత మీరందరూ నాయందు రవంత కటాక్షము కలిగి ఉండాలని మనవి చేసుకుంటున్నాను. మీరు ఆశించిన, లేదా అనుకుంటున్న స్థాయికి కలికాలం నాలుగోపాదం దాటకుండానే చేరుకొనుటకు కృషి చేస్తున్నాను. ప్రస్తుతం మనం ఉన్నది కలికాలం ప్రథమపాదం కనక నాధ్యేయం సాధ్యమేనని నా దృఢనమ్మకము.

000

(జూన్ 10, 2012)

14. చిత్తశుద్ధి అచ్చిరాని వేళ!

ఈ ఊసుపోక ధార శతమానం చేరుకున్న శుభసందర్భంలో చిత్తశుద్ధితో చెప్పుకోవలసినవిశేషం ఒకటి కనిపించింది. అది చిత్తశుద్ధి. ఎందుకంటే మనకి చిన్నప్పట్నించీ నేర్పే నీతిపాఠాల్లో మొదటిది "నిజం చెప్పు" అనే కదా. ఇలా "నిజం చెప్పు, నిజం చెప్పు" అంటూ నిప్పులాటి నిజాలు నిత్యా చెప్పకపోతే కోప్పడేవాళ్లే ఎక్కువ మనకి.

నిజానికి ఇజములవలెనే నిజాలకి కూడా అనేక ఛాయలు - నిజం, అసలు నిజం, నిజంలా కనిపించే నిజం, నిజమేనేమో అనిపించే నిజం, నిజమే కాబోలనిపించే నిజం, నిజానిజాల్లో నిజం … ఇలా.

అయితే అంతే నిజం మరోటుంది. మనని "నిజం చెప్పు, నిజం చెప్పం"టూ చంపుకు తినేసేవారు కూడా మనకీ పొరుగువారికీ చెప్పేవి నిక్కచ్చిగా "సంపూర్ణనిజాలు, కేవలం నిజాలు, నిజం తప్ప మరోటి కాని నిజాలు" కావు, కావు, కావు అన్న నిజం. అర్ధనిజాలూ, అంతంతమాత్రం నిజాలూ చెప్పి తప్పించుకు తిరగని ధన్యులు లేరు ఈ భువిలో అని నా దృఢనమ్మకం. ఎంతటి మహానుభావులైనా సరే నిజమైన నిజము చెప్పుట అన్నది కల్ల. ఏవేళ గానీ రవంత కంత ఉంచుకుంటారు తాము చెప్పే నిజాల్లో. "సత్య" హరిశ్చంద్రుడిగా ఖ్యాతి గడించిన హరిశ్చంద్రమహరాజు కొడుకుకోసం తపస్సు చేసి, కొడుకు పుడితే, ఆ కొడుకునే ఇంద్రుడికి బలి ఇస్తానని వాగ్దానం చేసేట్ట. కొడుకు కావాలని తపస్సు చేసి, ఆ కొడుకుని బలి చేయడంలో న్యాయం ఏమిటో నాకర్థం కాలేదనుకోండి. అది వేరే సంగతి. తీరా కొడుకు పుట్టేక, బలిచ్చేడా? లేదు. మాటలు రానీ, అక్షరాభ్యాసం కానీ, ఉపనయనం కానీ … అంటూ జరుపులు

పెట్టుకుంటూ వచ్చేడు. అంటే మాటలొచ్చినతరవాత బలివ్వలేదు. అక్కడికది అబద్ధమే కదా. ధర్మరాజు సంగతి సరే సరి. జగమెరిగిన సత్యం! మరి అలాటి మహానుభావులే మాటల్లో మెలికలు పెట్టి తప్పించుకున్నప్పుడు, మనలాటి సామాన్యులమాట వేరే చెప్పాలా? "నేనలా అన్లేదు, అది కాదు నేనన్నది, నా అభిప్రాయం అది కాదు," అని చెప్పుకు తప్పుకోడం ఈనాటి నీతి - ఇదొక్కటే నిక్కచ్చిగా సంపూర్ణ నిజం, నిజము తప్ప మరొకటి కాని నిజము.

ఇలా మాటల్ని అష్టవంకరలు తిప్పడానికి కారణాలు అనేకం. "పాపం, ఎదటివారిని నొప్పించడంపెందుకు" అనో నిజం చెప్తే తమకే చిన్నతనమనో నిజం చెప్పరు కొందరు. నిజం చెప్పలేరు కొందరు, అంటే అది వారి పుట్టుకలో లోపం. కదాచితుగా నివురు గప్పిననిప్పులా, పంచదార అద్దుకున్న చేదుమాత్రలా, చెప్పబడేదొటీ, అంతరాంతరాల అణిగిమణిగి దాగున్నది మరోటీ కావడం కూడా ప్రకృతిసహజమే.

తరిచి చూస్తే మీ జీవితాల్లో కూడా ఇలాటి సందర్భాలు కనీసం ఒక్కటైనా వచ్చుంటాయి. చిన్నవిషయమే తీసుకుందాం. ఆయన తెచ్చిన పచ్చచీరె కట్టుకుని వచ్చి, "బాగున్నానా?" అంటుంది ఇల్లాలు. "అతిలోకసుందరిలా ఉన్నావు" అంటాడాయన. నిజానికి ఆయన ఆ పచ్చచీరె కొన్నది పక్కింటి సరోజో, ఎదురింటి విమలో కట్టుకుంటే చూసి ముచ్చట పడి కొన్నది. ఆమాట ఆవిడకి చెప్పగలడా ఆయన? లేడనే అనుకుంటాను. ఆ పచ్చచీరెలో అ చిన్నది అందంగా కనిపించింది కానీ తన అర్ధాంగి ధరించినప్పుడు అలాటి వికారాలు కలగడంలేదు ఆయనకి. ఆమాట ఆవిడకి చెప్పగలడా ఆయన? చెప్తే ఎలాగుంటుంది, "అచ్చు సరోజలా లేక విమలలా ఉన్నావు," అన్నా అది సంపూర్ణ నిజం కాదు. "ఏదో అనుకున్నాను కానీ నిన్న కట్టుకున్న నీలం చీరెలోనే ఎంతో అందంగా ఉన్నావు," అంటాడాయన డొంకతిరుగుడుగా. ఇది సగం నిజం కావచ్చు. అలాగే ఆవిడ కూడా మామిడికాయ పచ్చడి తన చిన్నప్పుడు మేనబావ ఎంతో ఇష్టంగా తినేవాడని పెళ్ళవగానే భర్తకి

మామిడికాయ పచ్చడి చేసి పెట్టొచ్చు. ఆయనకి మామిడికాయ మరో సుందరికి జ్ఞాపకచిహ్నం కావచ్చు. ఇల్లాలు మామిడికాయ పచ్చడి చేస్తే ఉగాదిపచ్చడిలా తీపీ, చేదూ. ... ఆమాట ఆవిడకి చెప్పలేడు. అంచేత "నాకు మామిడికాయ పడదు. ఇంకెప్పుడూ చెయ్యకు," అంటూ ఆవిడకి అన్యాపదేశంగా చెప్పడం జరుగుతుంది.

ఇలా అన్యాపదేశాలకి పెట్టింది పేరు ఆంగ్లేయసంస్కారం. రచయితలందరికీ అనుభవమైన ఉదాహరణే చెప్పుకుందాం. మీకథ మరో గొప్పరచయితకి చూపిస్తారు, అభిప్రాయం చెప్పమని. ఓ గొప్పరచయితకి నూటికి తొంభైతొమ్మిది సందర్భాల్లో నచ్చదు. మరి ఆమాట ఆయన చెప్తారా? చెప్పరు. అసలు మీరు తీసుకున్న అంశం, అది ఆవిష్కరించిన తీరూ వదిలేసి, అక్షరదోషాలున్నాయంటారు. అన్వయదోషాలున్నాయంటారు, అన్వయదోషాలంటే అర్థం తెలిసో తెలీకో. ఇంకా మార్జినులమీద కూడా వ్యాఖ్యానించవచ్చు. లేదా, ఒకే ఒకముక్కలోనో, అరముక్కలోనో ఆహా బాగుంది అనేసి ఊరుకోవచ్చు. ఇదంతా నిజమైనా కాకపోయినా మీకు కావలసింది ఆ నిజం కాదు కదా. కథ మలిచినతీరు ముఖ్యం కదా. ఆవిషయం వాళ్లు మాటాడకపోవడానికి కారణం – 1. నిజంగా కథ చదవలేదు. 2. చదివేరు కానీ తమకి నచ్చలేదు. 3. కథాంశం తమకి అగమ్యగోచరం – వీటన్నిటికీ ఒకటే అర్థం, "నేను నిజం చెప్పలేను."

బ్రిటిష్ పార్లమెంటులో అబద్ధం అన్నమాట సమ్మతం కాదు. దాన్ని unparliamentary అంటారు. ఒకసారి మన క్రిష్ణమీనన్ ఏదో సందర్భంలో అది "white lie" అన్నాట్ట. వెంటనే పక్కనున్నవారెవరో lie అనరాదు అని వారికి గల అభ్యంతరం తెలియజేసేరు. క్రిష్ణ మీనన్ "నేను lie అనలేదు. white lie అన్నాను" అని సమాధానం ఇచ్చేరుట. చూసారా, "అశ్వత్థామ ..." అన్నలాటిదే ఇదీను.

ఇవి కాక మరోరకం నిజం ఉంది. అసలు నేను ఈ ఊ.వో. మొదలు పెట్టింది ఇది చెప్పడానికే. మనకి నిజం చెప్పాలని ఎంత ఆతురతగా ఉన్నా, నిజం చెప్పనివ్వరు సిస్టావధానులు. "సిస్టమునననుసరించి మాకిది సమ్మతము కాదు" అని జవాబిస్తారు.

నా నిజ పుట్టినరోజు తెలుసుకుని సకల జనులకు విదితం చేయదలుచుకున్న సందర్భంలో జరిగిన ఉదంతం ఇది. తారీకు కాదు, సంవత్సరంవిషయంలో కలిగింది నాకు ఈ జ్ఞానోదయం.

చాలాకాలం నేను మన రచయితల పుట్టిన సంవత్సరాలు వేరు వేరు పుస్తకాల్లో, వ్యాసాల్లో వేరు వేరుగా ఉన్నప్పుడు రచయితలు నిజాలు చెప్పడం లేదు అనే అనుకుంటూ వచ్చేను. నాదాకా వచ్చేక నాకు తెలిసొచ్చింది అలా రెండు మూడు జననసంవత్సరాలు ప్రచురించడం ఎలా జరుగుతుందో, హీహీహీ. నామటుకు నేను ఎంతో చిత్తశుద్ధితో ప్రవర్తిస్తాను ఇలాటివిషయాల్లో. ఇలా ప్రవర్తించబోతే చావు తప్పి కన్ను లొట్టపోయినవైనం ఈ కథ.

ఈ సందర్భంలోనే మరొక హెచ్చరిక. ప్రస్తుతం ఊపిరితో ఉన్నరచయితలు వ్రాతమూలకంగా, చట్టసమ్మతమైన కాయితంమీద తమ జననవివరాలు పుట్టించి ఆర్కైవు చేస్తే భావితరాలకి ఉపయోగపడుతుందని నా నిశ్చితాభిప్రాయం.

మీకు తెలుసు కదా మనకి birth certificates లేవు. కొందరు జాతకాలు రాయిస్తారు కానీ పురుడు పోసిన డాక్టరుగారు మాత్రం రాసివ్వలేదు కనీసం నాతరంలో. మనకి పుట్టినరోజులు అంటే పెద్దగాలివానకి టోర్లో పడ్డాడు, గోదావరివంతెన కూలిపోయినప్పుడు లేచి నిల్చున్నాడు – ఇలా మనకి ప్రకృతిసిద్ధమైన కితాబులే.

ఈమధ్య అమెరికాలో ప్రెసిడెంటుగారి బర్త్ సర్టిఫికేటుగురించి జరుగున్న రగడ చూసింతరవాత, ఇంకా నయం, నేను ప్రెసిడెంటుగిరీకి పోటీ చేయబోలేదని చాలా సంతోషించేను.

ఇంక అసలు కథకి వచ్చేస్తాను. అసలు నేను పుట్టడమే ఇంట్లో పుట్టేను. ఆస్పత్రికెళ్ళడానికీ, డాక్టర్లసేవలందుకోడానికీ టైము లేకపోయిందిట. తెల్లారి పదిగంటలవేళ మా అమ్మ నొప్పులొస్తున్నాయి అందిట. మంత్రసానికి కబురు పెట్టేరు కానీ ఆవిడ వచ్చేలోపున నాజననం అయిపోయింది వంటమనిషిసాయంతో. ఇప్పుడు ఆ వంటావిడని సాక్ష్యం చెప్పమనడానికి ఆవిడ ఎక్కడున్నారో తెలీదు. మ్.

నాతరంలో చాలామందికిలాగే నా స్కూలు కవిలెలో 1938 అని ఉంది. నా పుట్టినరోజు అడిగిన చోటల్లా అదే రాస్తూ వస్తున్నాను. ఇది ఇలా ఉండగా, నేను ఒకసారి మాఊరు వెళ్లినప్పుడు పాతకాయితాలు తీసి చూస్తుంటే, మాతాతగారు (మాతామహులు) మానాన్నగారికి రాసిన పోస్టుకార్డు నాకళ్లబడింది. అందులో అచ్చతెలుగులో ఫలానా తిథి, వార నక్షత్రాలతో ద్వితీయ పుత్రికాజననం అని ఉంది. ఆ కార్డుమీద ఉన్న తేదీ 1937! అలా నేను పుట్టిన నిజం సంవత్సరం నాకు నిజంగా తెలిసిందన్నమాట. నేనేమో అమెరికాలో ఉన్నాను కదా. ఇక్కడ తెల్లారి లేస్తే, ఎక్కడికెళ్ళినా, ఏ కాయితమ్ముక్కమీద ఏం గిలకాల్సొచ్చినా పుట్టినతేదీ అడుగుతారు. దానిమీద దాఖలా చూపమంటారు. ఇది నా సత్యసంధత నిరూపించుకోవాల్సిన సమయం. తప్పుడు పుట్టినరోజులు చెప్పేవాళ్లు కోకొల్లలని నాకు తెలుసు, ముఖ్యంగా ఉద్యోగాలకి అర్జీ పెట్టుకున్నప్పుడు. కానీ నాకా అవసరం లేదు కదా. హాహా.

నేను బుద్ధిగా social security officeకి వెళ్లి, నిజంగా నాకు ఒక ఏడు ఎక్కువుంది అని చెప్పేను. మరి నీ birth certificate ఏదీ అని అడిగేరు వాళ్ళు. నాదగ్గర అలాటిదేమీ లేదనీ, మాతాతగారు రాసిన కార్డుముక్క ఉందనీ చెప్పి చూపించేను. వాళ్లు నవ్వుతారనుకున్నాను కానీ నవ్వలేదు. ఎంతో సీరియస్‌గా ఆ కార్డు తీసుకుని, పరీక్షగా చూసి, సరే, మా కవిలె మార్చి, నీకు కొత్త social security card పంపిస్తాం అన్నారు.

ఆ తరవాత మరి మిగతా కార్డులు - డ్రైవర్స్ లైసెన్సు లాటివి - కూడా మార్చాలి కదా. అదుగో, అక్కడొచ్చింది తంటా. Department of transportation వాళ్లు పురాతన పోస్టుకార్డుని appreciate చెయ్యలేదు. నీ బర్త్ సర్టిఫికేటు చూపించాల్సిందే అన్నారు. మాకలాటివి లేవు మహా ప్రభో అని ఎంత మొత్తుకున్నా ఒప్పుకోం కాక ఒప్పుకోం అన్నారు. పోనీ, "సోషల్ సెక్యూరిటీ రికార్డులు చూడండి" అంటే "అది మాపని కాదు" అన్నారు. అలా నాకు రెండు పుట్టిన సంవత్సరాలు వచ్చేయి. ఇది పదేళ్లకిందటి మాట.

ఈమధ్య నాకు ఆస్పత్రిదర్శనాలు అవసరమైనప్పుడు చిక్కొచ్చింది. యస్సెస్ కార్డుప్రకారం చూపిన సంవత్సరం, డ్రైవర్స్ లైసెన్సుమీదున్న సంవత్సరం తేడా! "అది తరవాత సరి చేస్తాను, ప్రస్తుతానికి 1937 వాడుకోండి" అన్నాను ఆస్పత్రివారితో. "ప్రస్తుతానికి చూస్తాం. కానీ అవి సరి చేయండి వీలయినంత త్వరగా" అన్నారు వారు కూడా సామరస్యమనస్కులై.

అంచేత, ఇప్పుడు మళ్ళీ యస్సెస్ ఆఫీసుకి వెళ్లేను కాలమానం 37నించి 38కి మార్చమని. అక్కడి మనిషి నేనందించిన కాయితాలన్నీ అటూ ఇటూ తిప్పి చూసి, కంప్యూటరువేపు చూసి, "ఇలా చేస్తే నీకెంత ఖర్చవుతుందో తెలుసా?" అన్నాడు, అదేలెండి మరోసారి నా బర్త్ సర్టిఫికేటు చూపించమని అడిగిన తరవాతే.

"ఎంతవుతుందేమిటి?" అన్నాను, నా స్తోమతుకి మించకపోతే అచ్చుకోడానికి మనసులోనే సిద్ధమవుతూ.

"ఇలా మారిస్తే, ప్రభుత్వంవారు నీకిస్తున్న పింఛనులో తేడా వస్తుంది. అంటే నీకు ఏడాదిపాటు ఎక్కువ ఇచ్చేం అన్నమాట."

"అయితే నేను మార్చను. అలాగే వదిలేస్తాను."

“అదే మంచిపద్ధతి. ఆస్పత్రికీ, మందులకీ మాత్రం 37 వాడుకో. మిగతా సందర్భాల్లో 38 అని చెప్పుకో,” అన్నాడతను.

నాకయితే ఎగిరి గెంతేయలనిపించింది ఆ క్షణంలో. “నువ్వు ఇప్పుడు అబద్ధం చెప్పినట్టు ఋజువయింది. దాన్ని చట్టప్రకారం పెర్జురీ అంటారు,” అంటూ అతను కానీ చట్టమంత్రాలు చదివేడంటే నేను మట్టి కొట్టుకుపోయేవాల్సిందే కదా.

అంతే కాదు. నేను స్వయంగా వాళ్ళఆపీసుకి వెళ్లేను కనక ఇలా జరిగింది. నిజానికి నా అర్జీ పోస్టులో కూడా పంపొచ్చు అన్నారు. నిజంగా నేను పోస్టులో పంపి ఉంటే ఏమైఉండును? తలుచుకోడానికి భయమేస్తోంది. ఈ పరమసత్యాలన్నీ నాకిప్పుడు తెలిసొచ్చేయి. నాసత్యసంధతలో మార్పులఅవసరం కూడా నాకిప్పుడే అవగతమైంది!!

000

(జూన్ 21, 2012)

15. నా సాంకేతికజీవనములో ముప్పాతిక ముగిసిందా?

గత వారాంతం ఆస్టిను వెళ్లేను కల్పనతో రెండ్రోజులు సరదాగా గడపడానికి. ఆస్టినాపురవిశేషాలు తరవాత రాస్తాను.

అక్కడ మేం చేసిన విడియోమూలంగా ఇక్కడ గీక్ స్క్వాడ్ అన్న నామధేయంతో చెలామణీ అవుతున్న సాంకేతికనిపుణుల నైపుణ్యం మాత్రమే ఈరోజు ఇక్కడికబుర్లు.

నేను ఆస్టినునించి తిరిగి రాగానే ఎంతో ఉత్సాహంగా నా లాపుటాపుకీ విడియో కెమెరాకీ బంధం కలిపేను డివిడి చెక్కడానికి. నేననుకున్నట్టు విండోసేడు కూడా నాఅంత హుషారులగానూ" నేను సిద్ధం" అంటుందనుకున్నాను కానీ అది బిక్కమొహం పెట్టింది ఈ సాప్టువేరేమిటో నాకర్థం కాడం లేదంటూ. నాకు వెంటనే అర్థమయిపోయింది - నా విడియో కెమేరా వయసు అయిదో ఆరో ఉంటుంది. లాపుటాపుకి ఏడాది తిరగలేదింకా, అంటే నేను కొని. నిజానికి విండోసేడు వచ్చి మూడేళ్లనుకుంటా. చెప్పేను కదా సాంకేతికం మాయావటువులా క్షణక్షణం వృద్ధి పొందుతోంది. ప్రతితరం వెనకటితరాన్ని వెనక్కి, ఇంకా ఇంకా వెనక్కి తోసేస్తోంది.

ఇహ నా వేట మొదలయింది. కొత్త డ్రైవరుకోసం.

కొత్త డ్రైవరుకోసం నెట్టులో వెతికితే, సరిగ్గా నాకున్న మోడలే కామ్ కార్డరూ, కంప్యూటరూ ఉన్నవారూ, నాలాగే ఇదే అవస్థ పడుతున్నవారూ ఇంకా ఉన్నారని అర్థమయింది. నాకు తోడున్నారన్నమాట అని ఆనందించాలో, అయ్యో దీనికింక బతుకులేదని విచారించాలో తెలీక, కొంతకాలం బాధ పడి, నెట్లో కనిపించిన అనేక సలహాలు పాటించి. కంప్యూటరు ఉక్కిరి బిక్కిరి అయిపోయినప్పుడల్లా, సేద దీర్చి, మళ్ళీ మరో driver దింపుకుని ప్రతిష్టించి, పనికిరాదని తెలుసుకుని, దాన్ని

తొలగించి ... ఇలా రెండు రోజులు గడిపేను. ఇంక నాకొత్త లాపుటాపు ఈ పనికి పనికిరాదని సంపూర్ణంగా అర్థం చేసుకుని, పాత లాపుటాపు తీసేను.

నాపాత లాపుటాపులో సౌఖ్యం విండోసెక్స్పి ఉంది. ప్రస్తుతానికి ప్రింటరుకీ, స్కానరుకీ అది వాడుతూ వస్తున్నాను. ఎందుకంటే విండోసేడు వాటిని కూడా ఆదుకోడంలేదు.

పాత లాపుటాపు సూక్ష్మంగా ఎక్స్ పీ అందాం. ఈ ఎక్స్ పీ తో మేలో విడియో చేసి బ్లాగులో పెట్టేను కదా. కానీ ఈసారి అది కూడా గునుస్తోంది ఎంచేతో. సరేనని సిస్టం రెస్టోరు డిస్కులు తీసి రెస్టోరు మొదలు పెట్టేను. ఎన్నిసార్లు చేసినా, రెస్టోరయినట్టే అయి, రెస్టోరు సరిగ్గా అవలేదు, మళ్ళీ చెయ్యి అంటుంది. నాలుగు సుట్లయేక, ఇహ నావల్ల కాదంటూ కూలిపోయింది.

ఇంక నేను కూడా ఏం చేస్తాం వాసుదేవుడంతటివాడికే తప్పలేదు అనుకుంటూ, ఈ డబ్బా, డవాలీలన్నీ (లాపుటాపూ, కేబులూ, డిస్కులూ ...) మూటగట్టుకుని షాపుకి బయల్దేరేను.

ఇక్కడ ఒక షాపులో - అదే నేను లాపుటాపు కొన్న షాపులో - గీకులనబడే ఓ చిన్న గుంపు ఉంటారు. వాళ్ళు చిక్కులు విప్పడంలో అతిరథులూ, మహారథులూనుట. కనీసం వాళ్ళకి వాళ్లు అలా అనుకుంటారు. హుమ్, “అతి తెలివి”.

ఇలా అంటున్నానని మీకు కోపం రావచ్చు కానీ గత వారం రోజుల్లోనూ నేను పడ్డ అవస్థలు మీరు పడితే మీకూ తెలుస్తుంది.

ఇంతకీ జరిగిన కథ - మొదట మాయింటిపక్కనే ఉన్న షాపుకి వెళ్ళేను. అక్కడ వాళ్ళు అట్టే సమయం వృథా చెయ్యకుండా, ఈ రెంటికీ పొత్తు కుదరదు, కొత్త కెమెరా కొనుక్కోండి అని చెప్పేసేరు.

సరే, ఇంటికొచ్చేసి, మళ్ళీ కొన్ని ప్రయోగాలు చేసి, ఈ షాపులో గీకులు అట్టే తెలివైనవాళ్ళలా లేరు అనుకుని మరో షాపుకి వెళ్ళేను. నిజానికి నేను లాపుటాపు కొన్నది అక్కడే. అంచేత అక్కడ కాస్త నయం అనిపించింది. ఆశ చావదు కదా మరి.

అక్కడ ముందు ఒకతను వచ్చి, సంగతి సందర్భాలు కనుక్కుని, నాకు తెలీదు, అతను చూస్తాడు అన్నాడు మరొకతన్ని చూపించి. ఆ మరొకతను మరొక కస్టమరుకి సేవ చేస్తున్నాడు కనక నేను కొంచెంసేపు వేచి ఉండాలన్నాడు. సరేనన్నాను. ఇలాటి సందర్భాల్లో నాకు ఎంతో ఓపికా, సహనం ఉంటాయి. అంచేత, ఓ వెర్రినవ్వు నవ్వి కూచున్నాను నాలుగో క్లాసు బుద్ధిమంతుడిలా.

ఇంతలో మరొకతను వచ్చి, “ఏమయింది?” అన్నాడు. మళ్లీ ఓపిగ్గా నా చిక్కు వివరించేను. అతను నా కెమెరా అటూ ఇటూ తిప్పి చూసి, ఏవో కబుర్లు చెప్పి, వెళ్ళిపోయేడు. ఆ తరవాత నాకు నిజమైన సేవ చేయగలతను వచ్చి … సరే లెండి, .. అదంతా ఎందుగ్గానీ ఎవరూ ఏమీ చెయ్యలేరని తేలిపోయింది.

ఉసూరుమనుకుంటూ ఇంటికొచ్చి, కెమెరా మరోసారి చూద్దాం అని ఆన్ చేసేను.

చెప్తే నమ్మరు, చూపించడానికి, ఋజువూ, సాక్ష్యాలతో, నా టెక్నాలజీ పని చెయ్యడం లేదు.

జరిగిందేమిటంటే - ఆ మధ్యలో వచ్చి కెమెరా అటూ ఇటూ తిప్పేడన్నానే అతను రికార్డ్ బటన్ నొక్కేసేడు నాతో మాటాడుతూ. మొత్తం టేపంతా తుడిచిపెట్టుకుపోయింది, హుష్ కాకీ అన్నంత తేలిగ్గా. ఆ మహా నిపుణుడు ఎప్పటికైనా ఆపి ఉండడా అని గంటసేపు మొత్తం టేపంతా ప్లే చేసి చూసేను. మొదట్లో అతను నాతో మాటాడిన రెండు నిముషాలూ రికార్డయి ఉంది! ఆ తరవాత అంతా గాఢాంధకారం.

చెప్పొద్దూ, నాకు మనిషికి రావాల్సినంత కోపం వచ్చేసింది. లేదండీ, ఇప్పుడు నాకు ఇందాకా చెప్పిన ఓపికా, సహనం లేవు. ... దుర్మార్గుడా అనుకున్నాను. కెమెరా చేత పట్టడం రానివాడికి కంప్యూటరుషాపులో కస్టమరు సర్వీసు ఉద్యోగం ఎలా వచ్చిందో నాకు అర్థం కాలేదు. ఇలాటప్పుడేనండీ నేననడం ఈ సాంకేతికనిపుణల నైపుణ్యానికి నా నైపుణ్యం ఏమీ తీసుపోదని.

ఆ తరవాత గుర్తొచ్చింది కల్పనకి చెప్పాలని. చాలాసేపు ఆలోచించేను ఇప్పుడే చెప్పనా, రేపు చెప్పనా అని. ఎంచేతంటే తను ఇప్పుడు పనిలో ఉంటుంది. ఇంత హృదయవిదారకమైన విషయం చెప్పడానికి సుముహూర్తం అంటూ ఉంటుందా, తలుచుకున్నప్పుడే సుముహూర్తమా. ఇప్పుడే చెప్పేస్తే. తను పనిలో ఉంటుంది కనక అట్టే మథన పడదేమో, అలా అయితే తెల్లారేక మరి బాద పడదు అనుకుని, మెయిలిచ్చేను "మన చర్చ మాసిపోయిుంద"ని.

కల్పన వెంటనే, "పోన్లెద్దురూ. అదేమంత పెద్ద విషయం. మనం ఆడియో కూడా చేసేం కదా. అది ఉంది కదా," అని తిరుగుటపా పెట్టింది. తను అంత తేలిగ్గా తీసుకున్నందుకు నామనసు తేలిక పడింది. హమ్మయ్య అనుకున్నాను. మళ్ళీ నా ఓపికా, సహనం రెస్టోరయేయి. కానీ ...

నాకు నా టెక్నాలజీ పని చెయ్యకపోతే మరోపని తోచదు. అవుసరం ఉన్నా లేకున్నా అవన్నీ సక్రమంగా ఉండాలి. అవి నాకు ఆరో, ఏడో , ఎనిమిదో ప్రాణాలు. అంచేత, నా ఎక్స్ పీ, కెమెరా తీసుకుని మళ్ళీ ఆ షాపుకే వెళ్ళి వాళ్ళ గీకు చేసిన ఘనకార్యం చూపించేను మేనేజరుకి. నిజానికీ ఆ విద్వాంసుడి కంఠస్వరం వినిపించేను అనాలి. ఆయన "నీటేపు పునరుద్ధరించలేను కానీ నీ లాపుటాపు పని చేసేలా చూస్తాను, తీసుకురమ్మ"న్నాడు.

"నేను కొత్తది తేలేదు, పాత లాపుటాపులో సిస్టం రెస్టోరు చేసి ఇవ్వండి" అన్నాను.

"ఇదీ చేస్తాం, అదీ చేస్తాం, వెళ్ళి ఆ కొత్త లాపుటాపు కూడా తీసుకురండి" అన్నాడు.

నేను ఎంతో సంతోషంతో ఇంటికొచ్చి, రెండో లాపుటాపు కూడా తీసుకుని మళ్ళీ షాపుకెళ్ళేను. ఇలా సాతానిశవంలా రోజంతా తిరుగుతూ గడిపేనన్నమాట. ఇది నిన్నటి సంగతి.

మరి ఇప్పుడు రెండు లాపుటాపులూ పని చేస్తున్నాయా అంటే, లేదు. పాత లా.టా. రెండేసి నిముషాలకోమారు రీబూటు అవుతోంది. కొత్త లాపుటాపు విడియో కెమెరాని ఒల్లనంటే ఒల్లనంటోంది.

ఇప్పుడు, అంటే ఎక్స్ పీ పని చెయ్యకపోవడంవ ల్ల, నా ప్రింటరూ, స్కానరూ, విడియో కెమేరా నిరుపయోగం అయిపోయాయన్నమాట. అంటే, నా సాంకేతికజీవనంలో మూడొంతులు హళ్ళికి హళ్ళి, సున్నకి సున్న. ఇది తలుచుకుంటే నాకు మా అమ్మ పోయినరోజు జ్ఞాపకం వస్తోంది. నాకేలండరు వయసు తలుచుకుంటే నాకు వృద్ధాప్యం వచ్చినట్టు అనిపించదు కానీ ఈ సాంకేతికడబ్బాలన్నీ పోపులడబ్బాలుగా మారిపోతుంటే మాత్రం నాకు వయసు మళ్లీపోయిందనే అనిపిస్తోంది.

కంప్యూటరు షాపుల్లో కస్టమరు సర్వీసుమీద గౌరవం తగ్గుతోంది.

నేనిలా అంటున్నందుకు సాంకేతిక నిపుణులు నామీద కోపం తెచ్చుకుంటే నేను చెయ్యగలిగిందేమీ లేదు. మీరే నాబాధ అర్థం చేసుకోవాలంతే!!

ఈ ఊసుపోక 101 కావడంలో కూడా ఒక అందం ఉంది. ఇక్కడ గీకులకి ఇది 101. హీ.హీ.

000

(జులై 24, 2012)

16. ముంగిట మల్లెలు

చీకటితోనే లేచి వరండాలోకి వెళ్లేను అలవాటు ప్రకారం చుక్కలెక్కడున్నాయో, చందమామెక్కడున్నాడో చూడ్డానికి. నిర్ధారణగా తెలీడంలేదు కానీ కృష్ణపక్షంలో చంద్రుడు కళలు తరుగుతూ ఎడమనించి కుడికి జరుగుతూ చీకటి పడుతున్నవేళ కనిపిస్తున్నాడు. బహుళపక్షంలో కుడినించి ఎడమకి జరుగుతూ నాలుగోఝామున దర్శనమిస్తాడు. ఇదేదో మీరే కనిపెట్టినంత కొత్తగా చెప్తారేమిటి అని మీరు అడగొచ్చు కానీ అమెరికా వచ్చేక నేనీఇంటికి వచ్చేవరకూ చందమామలూ, చుక్కలూ గమనించలేదు. నిజానికి నేనిక్కడికి వచ్చేకే తొలిసారి తోకచుక్కలు రాలుతుంటే చూసేను. రూపాయిబిళ్ళంత తాబేలు పిల్లని చూసేను. నదిఒడ్డున చేపలు పట్టడం నేర్చుకుంటున్న పిల్లలు, తల్లిబాతువెంట తిరిగే పిల్లబాతులూ, పొద్దువాలే వేళ జలయంత్రాలు ఎగసి విరజిమ్ముతున్న నీటిధారల్లో హరివిల్లులు ... ఇవేవీ నేను కనిపెట్టినవి కావు, కానీ వీటిని చూస్తుంటే జీవితంలో ఎంత మరిచిపోయేనో ఇప్పుడు తెలుస్తోంది.

మూడువారాలక్రిందట ఆస్టిను వెళ్ళినప్పుడు కల్పన నాకో మల్లెమొక్క బహూకరించింది. ఇప్పుడు బహుమానాలెందుకూ అంటారా. ఏమో, తననే అడగండి. ఇంతకీ ఇవాళ తెల్లవారుఝామునే లేచి, తలుపు తీసేసరికి నేలమీద రాలి ఉన్న మల్లెపూలు చూసి గుమ్మయిపోయేను.

ఇలా నేలమీద వాడినపూలు కనిపించడం ఎప్పుడో నాచిన్నప్పుడు విశాఖపట్నంలో మా పెరట్లోనే - అప్పట్లో అవి పారిజాతాలు. మళ్ళీ ఇవాళ చూస్తున్నాను. ఇవి మల్లెలు. ప్రాణం లేచొచ్చింది అంటే అతిశయోక్తి కాదు.

నేను ఆస్టిను వెళ్ళబోయేముందు అక్కడ చూసేవి చాలా ఉన్నాయని చాలామందే చెప్పేరు. ఎక్కడికేనా వెళ్తే అక్కడ ప్రముఖ విహారస్థలాలు చూడ్డం ఆచారం కదా. గుడికెళ్ళినంత నిష్ఠతో బజార్లంట తిరిగేవారున్నారు. నేనూ, కల్పనా ఎక్కడికంటే ఎక్కడికి అని అక్కడున్న 264 ఆకర్షణీయ ప్రదేశాలగురించి సుదీర్ఘంగా చర్చించుకు ఆఖరికి పిట్టల్నీ, పువ్వుల్నీ చూడ్డానికి బయల్దేరేం.

మొదట పిట్టలకోసం చూసేం. ఎండ మండిపోతోంది. ఎక్కడ చూసినా పక్షి జాడ లేదు. మేం సరైన ప్రదేశంలో ఉన్నామో లేదో తెలుసుకోడానికి కూడా కొంత టైం పట్టింది. ఆ దారినే కారులో వస్తున్న మరో విజిటరులని ఆపి అడిగితే, "మీరున్నది సరైన ప్రదేశమే కానీ సరైన సమయం కాదు. రెణ్ణెల్లకిందట రావలసింది. అయినా ఫరవాలేదు, అలా వెళ్ళి చూడండి, ఏదో ఓ పక్షి కనిపించకపోదు" అన్నారు. సరే, సరైన ప్రదేశంలోనే ఉన్నాం కదా అని సంతసించి, ముందుకి సాగేం. మామూలుగా ఏ ఇంటిముందైనా కనిపించే పిట్టలు ఓ నాలుగు కనిపించేయి. ఆ తరవాత గోరింటపువ్వుల్లాటి పువ్వులు కనిపించేయి.

టైము చూస్తే పన్నెండయినా అవలేదు. సరే ఇప్పుడే ఇంటికెళ్ళడం ఎందుకని, అదేదో బొటానికల్ గార్డెను చూద్దాం అని అక్కడికి వెళ్ళేం. అక్కడ మాకు కనిపించినవి -

సీతాకోక చిలుక బారలు చాచి తీరిగ్గా సేదదీరుతున్నదొకటీ, ఆకులందున అణిగి మణిగి ఆడుతున్నదొకటీ. అంతకంటే విచిత్రమైనవి Origami కాయితపు బొమ్మలు. కత్తెరలూ, తుమ్మజిగురూ లేకుండా కేవలం కాయితం మడతలు పెడుతూ చెయ్యగలిగిన ఆ బొమ్మలు భలే ఉన్నాయి. అక్కడున్నవన్నీ Robert J. Lang చేసినవి. ఆయన ఇవి చెయ్యడానికి మొదట ఇలా గీతలు గీసుకుంటారుట.

ఈ దేశసంచారం పూర్తి చేసుకుని ఇంటికొచ్చేం. మరోగంటకి కాంపుకెళ్ళిన వాళ్ళబ్బాయి ఇంటికొచ్చేడు. మామూలుగా ఆ వయసుపిల్లలు పెద్దవాళ్లతో మాటాడరు కానీ చిన్ను మాత్రం చక్కగా మాటాడేడు. వారంరోజులకేంపులో తను

పట్టిన ఒక పౌను చేప, తనస్నేహితుడు పట్టిన 80 పౌనులచేప, చేపల్లో రకాలూ - ఆరోజు నాకు చేపలవేటగురించి చాలా విషయాలు తెలిసేయి. నేను ఇన్నాళ్ళూ "చేపలు పట్టడం స్పోర్టు ఏమిటి, నీళ్ళలో గేలం వేసి చూస్తూ కూర్చుంటారు" అనుకునేదాన్ని. కానీ పదమూడేళ్ళ చిన్ను అంత సరదాగా ఆ విద్యగురించి చెప్తుంటే, ఆ చేపలబొమ్మలు చూపిస్తుంటే, ఓహో చేపలు పట్టడానికి ఇంత కథా, కమామీషూ ఉందన్నమాట అనుకోకుండా ఉండలేకపోయేను.

నాకు అంతకంటే సరదా అనిపించిన మరో విషయం - వాళ్ళిద్దరి సంభాషణలు. కల్పన తెలుగులో మాటాడుతుంటే చిన్ను ఇంగ్లీషులో జవాబులు చెప్పడం. అంటే కల్పన మాటాడ్డంమూలంగా చిన్నుకి తెలుగు వినే అవకాశం కలుగుతోంది. అదీ నాకు నచ్చింది. నిజమే కదా మనం పిల్లలు తెలుగు మాటాడ్డం లేదంటాం కానీ దానికి కావలసిన వాతావరణం కల్పించడం మర్చిపోతాం. వాళ్లు తెలుగులో ఉపన్యాసాలు ఇవ్వక్కర్లేదు కనీసం ఆదివారం, రేపు సాయంత్రం, వంకాయకూరలాటి మాటలయినా తెలుసుకోవాలంటే పెద్దలు కనీసం ఆ నాలుగు తెలుగుముక్కలయినా ఇంట్లో వాడుతుంటేనే కదా. లేకపోతే తెలుగులో ఆమాటలు లేవనుకోగల్రు కూడా పిల్లలు. ముంగిట్లో మల్లెలూ, అంగిట్లో తెలుగు అని పాట కట్టబోతున్నాను. :))

సరే, నేనూ, కల్పనా కలిసి టేపులసంగతి ముందే చెప్పేసేను కదా.

చివరిమాటగా, ఆ మల్లెపూలు నన్ను వెనక్కి తీసుకెళ్లినతరవాత, ఆచంట జానకిరామ్ గారు జ్ఞాపకం వచ్చేరు. నేను తిరపతిలో ఉన్నప్పుడు ఆయన మాయింటికి వస్తుండేవారు. ఆ సంగతి మరొక టపాలో.

000

(జులై 29, 2012)

17. అరాచకీయాలు!

మీరు రిపబ్లికనా? అని అడిగింది రెండురోజులక్రితం ఓ స్నేహితురాలు అమెరికాలో రాజకీయాలగురించి మాటాడుతూ.

ఆ మాట వినగానే నాకు భగ్గుమంది. కోపం ఆ అమ్మాయిమీద కాదు. ఈనాడు ఎన్నికలపేరున అమెరికాలో జరుగుతున్న వీరవిహారం, వైర స్వైర విహారంమీద. అవేవీ చెప్పుకు మురిసిపోయేవి కావు. అంటే ఈ టపాలో హాస్యం లేదు, వ్యంగ్యం లేదు. అనునిత్యం చూస్తున్న వాక్ హింసతోనూ, గోడమీద పిల్లివాటం వాదాలతోనూ నాకు కలుగుతున్న వ్యథ మాత్రమే. నేను విన్న, ఇంతవరకూ వింటున్న గాలికబుర్లలో ఏ ఒక్కరూ నిజంగా ఎదుటిమనిషి మేలు కోరి చెప్తున్నమాటల్లా కనిపించలేదు ఒఠ్ఠి నినాదాలే తప్ప.

నేను చిన్నప్పట్నించీ రాజకీయాలకి దూరమే. నాచిన్నప్పుడు ఒకసారి కాబోలు మానాన్నగారితో చిన్న సంభాషణ జరిగింది. ఆయన కాంగ్రెస్ పక్షం అనుకుంటా. కాకినాడలో జరిగిన అఖిలబారత కాంగ్రెస్ మహాసభకి నడిచి వెళ్ళేరని మాఅమ్మ చెప్పినట్టు గుర్తు. నేను యూనివర్సిటీలో చదువుతున్నరోజుల్లో, అంటే 50వ దశకం చివరిదశలో అనుకుంటా నెహ్రూ అవలంబించిన ఏదో విధానం ప్రజలకి నచ్చలేదు. దేశంలో ఉధృతంగా అలజడులు చెలరేగేయి. ఆసమయంలో అన్నాను, "ప్రజలే కదా ఆయన్ని ఎన్నుకున్నది, వాళ్ళఇష్టాయిష్టాలు పాటించక్కర్లేదా నెహ్రూ?" అని.

దానికి మానాన్నగారి సమాధానం, "నువ్వు మాకు నాయకత్వం వహించు అన్నతరవాత, ఆయనకి తోచినట్టు ఆయన చేస్తాడు కానీ వీళ్ళందరిమాటలూ

వింటాడా?" అని. ఇవే మాటలు కాదనుకోండి, సుమారుగా ఇదే అర్థం వచ్చేమాట చెప్పినట్టు గుర్తు. ఈనాటి రాజకీయాలు చూస్తుంటే ఆయనమాటే నిజం అనిపిస్తోంది!

నాకు సాహిత్యంలో వాదాలమీద నమ్మకం లేనట్టే, ఎన్నికల్లో ఇచ్చే వాగ్దానాలమీద కూడా నమ్మకం లేదు. అరిగిపోయిన రికార్డులా వాళ్లమాటే వాళ్ళు వల్లించుకుంటూ పోతారు కానీ మనం అడిగినమాటకి జవాబు చెప్పరు. నిస్సిగ్గుగా ఎదటివారిగురించి అబద్ధాలు చెప్పడానికి సంకోచించరు. అంచేత నేను చేసేదేం లేదని తీర్మానించుకుని రాజకీయాలకి దూరంగా, నా సొంతబుర్రకి చేరువగా ఉంటూ వస్తున్నాను.

దాదాపు నలభై ఏళ్ళగా లేని స్ఫూర్తి ఈసారి ఎన్నికల కోలాహలంలో వాళ్లు బులిబుచ్చికబుర్ల మూలాన, ముఖ్యంగా రిపబ్లికనులు ఆడవాళ్ళగురించి అంటున్న మాటలు విన్న తరవాత జడభరతుడిలాటి నాలో కూడా చలనం కలిగింది. అది చెప్పుకు గర్వపడదగిన చలనం కాదు!

ఇంట్లో టీవీ, లాపుటాపూ నా ఇష్టసఖి అని చాలాసార్లే చెప్పేను కదా. గత ఆరునెలలుగా టీవీ తెరిచి ఏ ఛానెలు చూసినా ఆ రాజకీయనినాదాలు తప్పడం లేదు. ఇన్నాళ్లూ ఖాళీగా ఉంచుకున్న నాబుర్ర వీళ్ళ కాకిగోలతో భ్రష్టు పట్టిపోతోంది.

దీనికి నాందీ ప్రస్తావన మనవి చేసుకుంటాను మొదట. ఎంత కాదనుకున్నా కొంత బయటిప్రపంచంతో సంబంధం ఉంది కనక, కొందరు అమెరికన్ మిత్రులు ఏర్పడ్డారు కనక, నాకు కొన్ని అభిప్రాయాలు ఏర్పడ్డాయి అమెరికాలోని ఈ రెండు ప్రముఖ రాజకీయపక్షాలగురించి.

రిపబ్లికనులకి పెట్టుబడిదారీవిధానంమీద మాచెడ్డ నమ్మకం. అందులో ప్రధానభాగం, వాళ్ళు చెప్పే సూత్రం, పని చేస్తే ఫలం, ఉచితలంచి కోరడం హేయం, ఇంకా మాటాడితే నేరం అని. ఇది వినడానికీ చెప్పుకోడానికీ ఎంతో సొంపుగా ఉంది. నేను కూడా నమ్ముతాను - దేశమంటే మనుషులనీ, ఒట్టిమాటలు కట్టిపెట్టి గట్టి మేల్

తలపెట్టాలనీ, అంటే అర్థం ప్రతి ఒక్కరూ కష్టించి పని చేయాలనీ. నేనూ ఒప్పుకుంటాను ఇది.

డెమొక్రటులేం అంటారంటే, దేశ సౌభాగ్యానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్న మాట నిజమే అయినా, అలా పాటుపడలేని జనాలనీ - అంటే పిల్లలు, ముసలీ ముతకా, వికలాంగులూ, అనారోగ్యంతో బాధ పడేవాళ్లూ, అనేకరకాల హింసలకి గురయి సహాయం పొందవలసినవాళ్ళూ - వీళ్ళని కూడా ఆదుకోవాలంటారు. ఇది కూడా వినడానికి సొంపుగా ఉంది.

చెప్పేను కదా బుర్ర ఖాళీగా ఉంటే ఎవరేం పెడితే అదే తీసుకుంటుంది. కానీ ఇప్పుడు అలా తీసుకోవాలనిపించడం లేదు. ఎందుకంటే నాకున్న అణాపరక పింఛను డబ్బులకి ఎసరు అయేలా ఉంది. ప్రాణంమీదకొస్తే ఆస్పత్రి ఖర్చులకి దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడేలా ఉంది.

ఇంకా ఇలా కనిపిస్తున్నాయి వార్తలు చూస్తుంటే - పెట్టుబడి అంటే డబ్బుతో పని. బాగా డబ్బున్నవాళ్లు రాళ్లూ, ఫైళ్లూ మోయరు. తమకున్న డబ్బుతో వాల్‌స్ట్రీట్‌లో జూదమాడి తమఆస్తిని మరింత వృద్ధి చేసుకుంటారు. అందులో తప్పు లేదు కానీ బేంకులో ఉన్న నాడబ్బుకి నెలకి అక్షరాలా ఒక సెంటు జమ అవుతోంది వడ్డీరూపంలో. హాస్యం కాదు, నిజంగానే. చూసారా, ఇదన్నమాట డబ్బున్నవాళ్ల డబ్బుకీ, నాడబ్బుకీ రాగల ప్రతిఫలంలో తేడా.

ఇప్పుడు నాకు కడుపెందుకు మండుతోందో చెప్తాను. వ్యక్తి స్వేచ్ఛకీ, నాగరికతకీ అమెరికా పెట్టింది పేరు కదా. అసలు వ్యక్తి స్వాతంత్ర్యం అమెరికాయే కనిపెట్టి, యావత్ ప్రపంచానికి మార్గదర్శకులయేరన్నట్టు చాలామంది మాటాడ్డం విన్నాను. దగ్గినా తుమ్మినా క్షమాపణలు కోరే దేశం ఇది. మరి ఇంత నాగరికత అభివృద్ధి సాధించిన దేశంలో ఆడవాళ్లనిగురించి అంత హీనంగా ఎలా మాటాడగలుగుతున్నారు అని నా

ప్రశ్న. ఇక్కడ మొత్తం అమెరికా రాజకీయాలన్నీ చర్చకి పెట్టబోవడం లేదు నేను. కానీ కొందరు ఎంత జుగుప్సాకరంగా మాటాడుతున్నారో ఒకటి, రెండు ఉదాహరణలిస్తాను.

ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలలో రిపబ్లికను గవర్నర్లు తయారు చేసిన చట్టాలప్రకారం ఎబార్షను నేరం. ఒకవేళ ఆడవాళ్ళు ఎబార్షను కావాలనుకుంటే వారు పరమనీచంగా అనిపించే మరియు వైద్యరీత్యా అవసరం లేని కొన్ని ప్రొసీజర్లకి సిద్ధపడాలి. ఒకొకచోట ఉద్యోగస్థులయితే వారి యజమాని అనుమతి కూడా కోరాలిట! స్వేచ్ఛమాట అలా ఉంచి, ఈ మధ్య సెనేట్‌లో ఈ విషయం చర్చకి వస్తే, రిపబ్లికనులకమిటీలో స్త్రీలు లేరు. అందరూ మొగాళ్లే. డెమొక్రటులు ఒక అమ్మాయికి అవకాశం ఇచ్చేరు. ఆ అమ్మాయిపేరు Sandra Fluke. దాంతో కొందరు రిపబ్లికనులకి మాచెడ్డ కోపం వచ్చేసింది. ఆ అమ్మాయి చర్చించింది మొత్తం ఆడవాళ్లకి రాగల వివిధ రోగాలూ, వాటికి అవసరమైన చికిత్సలగురించే అయినా, దాన్ని కేవలం సెక్స్ కి సంబంధించిన సమస్యగానే గుర్తించి, ఓ రేడియో హోస్ట్ ఆ అమ్మాయిని స్లట్ అని, తనకి సెక్స్ విడియో పంపమని తాఖీదు ఇచ్చేడు. మరొక రిపబ్లికను కాళ్ళమధ్య ఆస్పిరిన్ పెట్టుకుంటే పోయేదానికి ఇంత గొడవేమిటి అన్నాడు. నాప్రశ్న - హక్కులమాట పక్కన పెట్టినా, సాటి మనిషిగురించి ఇంత జుగుప్సాకరంగా ఎలా మాటాడగలరనే, అదీ బాహాటంగా. వీళ్ళంతా బోలెడు చదువుకుని బహిరంగసభల్లో పెద్ద పెద్ద ఉపన్యాసాలిచ్చేవాళ్లూ, చట్టనిర్మాతలూ అయితే, సామాన్యులగతి ఎలా ఉంటుందో? అది తలుచుకుంటే నాకు భయం వేయదా? డెమొక్రటులు ఏం చేస్తారో నాకు తెలీదు కానీ కనీసం వీళ్ళు ఆడవాళ్ళగురించి ఇంత హేయంగా మాటాడ్డం వినలేదు నేను.

ఎబార్షను వల్ల నరకానికి పోతామో లేదో నాకు తెలీదు కానీ ఇక్కడ ఇప్పుడు అంటే ఈ లోకంలో బతికుండగా, ఈ ఎబార్షనులు నేరం అంటే, మరి అలా బలవంతాన పుట్టిన పిల్లలగతి ఏమవుతుంది? పిల్లలు పుట్టగానే పనిలోకి వెళ్ళలేరు. తల్లి పనిలోకి వెళ్తే, పిల్లని చూసుకుసేవాళ్ళు కావాలి. పబ్లిక్ ఛైల్డ్ కేర్ కూడా లేదు. ... ఇలా

అనేకరకాల సమస్యలు తలెత్తుతాయి కదా. ఈ విషయం అనేక కోణాల్లోంచి, చర్చించి, పరిశీలించి, మానవత్వంతో కూడిన సమాధానాలు వెతకండి అనీ సాండ్రా అడిగింది. దానికీ ఆ అమ్మాయిని అంత హీనంగా తూలనాడడం!

ఇది చూసి, మీరు నేనేదో స్త్రీవాదం మొదలు పెడుతున్నానకండి. ఇది ఒక్క స్త్రీలమాటే కాదు, ఇనప్పెట్టెల్లో ఇబ్బడిముబ్బడిగా మూలుగుతున్న ధనం లేనివారి అందరిమాటా మాటాడుతున్నాను. రేప్పొద్దున్న నా సోషల్ సెక్యూరిటీకి సెక్యూరిటీ లేకుండా పోవచ్చు! ఈ వైద్యచికిత్సలు కావలసింది నాలాటి మధ్యతరగతి, కింది తరగతి జనాలకే. డబ్బున్నవాళ్ళు ఇక్కడ కాకపోతే ఏ లండనో స్విట్జర్లాండో వెళ్ళి తమ అవసరాలు తీర్చుకుని వచ్చేస్తారు.

రిపబ్లికనులు అందరూ ఇలాగే మాటాడరు. వాళ్ళలో కొంతమంది ఎబార్షనుకి వ్యతిరేకం కాదు. అలాగే డెమొక్రటులలో కూడా భ్రూణహత్య మహా పాతకం అని నమ్మేవాళ్లు ఉన్నారు. ఎటొచ్చీ, వీళ్ళు ఆడవాళ్ళ ఈ పరిస్థితిగురించి ఇంత హీనంగా మాటాడుతున్నట్టు లేదు. కనీసం నాకెక్కడా వినిపించలేదు. అంచేత, నేననేది చర్చల్లో కనీస సభ్యత పాటించాలి కదా అని. సాటి మనిషిని గౌరవించడం నాగరికత అయితే, ఆడవాళ్లు ఆ కోవకి చెందరా?

ఇక్కడ నేను వెలిబుచ్చిన అభిప్రాయాలన్నీ మీలో కొందరికి ఆమోదకరం కాకపోవచ్చు. ఆహ్లాదకరం కాకపోవచ్చు చాలామందికి. కానీ రోజూ వార్తలు వింటుంటే నాకు కనిపించిందీ, వినిపించిందీ ఇంతే.

ఖాళీ బుర్ర కథలో ఈవిషయమే చెప్పడానికి ప్రయత్నించేను. అంటే బుర్ర ఖాళీగా ఉంచుకోడం చాలా కష్టం, కష్టతరం. మనం దాన్ని ఖాళీగా ఉంచితే ఇదుగో పైన చెప్పినలాటి డొల్లకబుర్లు మన బుర్రలోకి వచ్చేస్తాయి. మన బుర్రలని మనమే సముచిత జ్ఞానంతో నింపుకోవాలి. అప్పుడు పైన చెప్పిన రేడియో హోస్టు మాటాడినట్టు మాటాడం, మాటాడలేం.

ఒక్కమాటలో అమెరికాలో ఈనాటి ఎన్నికల్లో ఆడవాళ్ళూ, డబ్బు లేనివాళ్ళూ మనుషులు అన్నట్టు మాటాడ్డం లేదు. వారి అవసరాలు అవసరాలు కావని ఈ అభ్యర్థులు చెప్పకయే చెప్తున్న అభిప్రాయంలా కనిపిస్తోంది.

000

44 మిలియన్లమంది దరిద్రులు, 17 మిలియన్లమంది పిల్లలకి తిండి లేదు, 46 మిలియన్ అమెరికనులకి హెల్త్ ఇన్స్యూరెన్సు కొనగల స్తోమతు లేదు. ఏన్ రామ్నీకి గల ఏదో యమ్మెస్ జబ్బుకి డ్రెసాజి గుర్రం ఉపశమనం కలిగిస్తుందిట. దాన్ని పోషించడానికి ఏడాదికి 77 వేల డాలర్లు ఖర్చు అవుతుందిట. అదే రోగంతో బాధ పడే అనేకమంది సామాన్యులకి డ్రెసాజి గుర్రాలు అక్కర్లేదు కనీసవైద్య సౌకర్యాలు కల్పించమని కోరడంలో తప్పేముంది? పని చేసి సంపాదించుకోండి అంటున్నారు. అందరికీ, బాగా చదువుకున్నవారికి కూడా తమ విద్యాస్థాయికి తగిన ఉద్యోగాలు దొరకవు. అందరూ మిలియన్లు సంపాదించలేరు. అది నాకు అనుభవపూర్వకంగా తెలిసింది. అంచేత డబ్బు లేనివారందరినీ సోమరిపోతులే అనడం న్యాయం కాదు.

మరో విషయం - రిపబ్లికను అభ్యర్థులు ఎన్నికలయింతరవాత తాము దేశాన్ని ఎలా ఉద్ధరించగలరన్న విషయం ఎన్నికలయింతరవాతే చెప్తారుట. నామటుకు నాకు ఇది సిసలు వ్యాపారలక్షణంలా కనిపిస్తోంది. అంటే దేశాన్ని కూడా పెద్ద కంపెనీలా నడపడం అన్నమాట. ఇందులో చిన్నచక్రాల యోగక్షేమాలగురించిన ప్రస్తావన ఉన్నట్టు లేదు మరి.

000

(సెప్టెంబరు 11, 2012)

18. మందపత్రాలు

అంతర్జాలంలో కొన్ని ఐడీలు పోగుచేసి ఓ గుంపు తయారు చేసుకుని ఆ గుంపుకి మూకఉమ్మడిగా ఉత్తరాలు పంపడం మామూలే. ఈవిషయంమీద నేను ఓ టపా రాయాలని చాలా కాలంగా అనుకుంటున్నా. వీటికి నేను పెట్టుకున్న పేరు మందపత్రాలు, మందకి పంపే పత్రం అనే అర్థంలో. రెండు రోజులక్రితం నాకొచ్చిన మందపత్రంతో ఆ ఆలోచనకి సమయం ఆసన్నమయింది ఇవాళ.

నేను చాలా కాలంగా రాయాలనుకున్న కారణం నాకు ఈ మందపత్రాలు చికాగ్గా కలిగిస్తాయి. ఇవి చూసినప్పుడల్లా వీళ్ళు నిజంగా నన్నొక మనిషిలా చూడ్డంలేదు అనిపిస్తుంది. వీటిలో నిజంగా మీరూ నేనూ మాటాడుకున్నట్టుండదు. ఆత్మీయతలూ, కనీసమర్యాదలూ కనిపించవు. డియర్ అంటూనో, రెస్పెక్టెడ్ సర్స్, మేడమ్స్ అని మొదలు పెట్టినా ఏమండీ, బావున్నారా అన్నట్టుండదు. ప్చ్. ఏం చేస్తాం. ఇది కలికాలం. ఇక్కడ మర్యాదలు ఇట్లే ఉండును అని సరిపెట్టుకుందాం. కానీ వాటికి సంబంధించిన మరి కొన్ని మర్యాదలు కూడా తెలుసుకోవాలి ఈ మందకబుర్లు అంపేముందు.

ఈ మందకబురు సాధారణంగా తాము చేస్తున్న ఏదో సామాజికసేవో, మరోరకం కృషో పదిమందికీ తెలియడానికీ, ఆ పదిమందీ వీలయితే సాయం చెయ్యడానికీను. మన గుమ్మంలోనూ, వీధుల్లోనూ కనిపించే కరపత్రాల్లాటివే. అంతవరకూ బాగానే ఉంది.

ఎటొచ్చీ ఈ ఐడీలు ఏ పెట్టెలో పెట్టాలి అన్నది చాలామందికి తెలిసినట్టు లేదు. To అన్న పెట్టెలోకి తమరికి తోచిన చిరునామాలన్నీ ఎక్కించేస్తే, ఆ జాబితాలో ఉన్నవారందరికీ మీరు ఆ ఐడీలన్నీ పంచిపెట్టేస్తున్నట్టే. అది చట్టవిరుద్ధం. మీరు నా

అనుమతి లేకుండా నా ఐడి అంతమందికి పంచిపెట్టేరు అన్నమాట. అలా అందుకున్న ప్రతి ఒక్కరూ మళ్ళీ అది ఉపయోగించుకుని మరిన్ని కబుర్లు నామొహాన కొడతారు.

రెండో బాధ, ఉప్పూ కారం తినే ప్రతిమనిషికీ ఏదో ఓ అభిప్రాయం ఉంటుంది. వారు ఆ అభిప్రాయం రిప్లై కొట్టొచ్చు. ఎటొచ్చీ మీరు అడిగిందొకటీ వారు చెప్పేది మరోటి అయితే రామక్కా అంటే తామరాకా అన్నట్టు, అది కూడా అంతమందికీ పంచిపెట్టబడుతుంది.

నిన్న నాకొచ్చిన కబురు - ఎవరో ఒకాయన కథలమీద పరిశోధన చేస్తున్నాననీ, తమ కథలు పంపమనీ ఓ మందపత్రం పెట్టేడు. ఎవరెవరికి అన్నది నేను మొదటి రోజు చూడలేదు కానీ దానిమీద మరికొందరి ఉత్తరాలు వచ్చేక, ఓహో, ఇది చాలామందికి అంపిన మందమెయిలు అని అర్థమయింది.

వాళ్లు రాసినలాటి ఆలోచనలు నాక్కూడా కలిగేయి. ఈ పత్రం తెలుగులో రాయక ఇంగ్లీషులో ఎందుకు రాసేరు, ఒక్కొక్క రచయితనీ విడిగా అడక్కుండా, ఇలా మందమెయిలు పెట్టడమేమిటి - ఇలా. కానీ నేను నా ఆలోచనలు ఆ పత్రరచయితకి ఎందుకు తెలియజేయలేదంటే, ఎందుకొచ్చినవగొడవలెద్దూ అని. పైగా సాధారణంగా పరిశోధన తొలిపాదంలో ఇలాగే సాగుతుంది. కనిపించిన ప్రతివారినీ, కనిపించిన ప్రతిచోటా అడగడమే. కొంత సమాచారం సేకరించుకున్న తరవాత, వాటిని కాస్త పరిశీలించి చూసినతరవాత ఒకొక రచయితని విడివిడిగా సంప్రదించడం జరుగుతుంది. ఇలా ఆలోచిస్తూ, చెత్తబుట్టతలపులు కట్టిపెట్టి, నా తెలుగు తూలిక చూడమని జవాబిచ్చి ఊరుకున్నాను. ఒక వాక్యం. అంతే.

కానీ కొంతమంది అంత తేలిగ్గా పోనివ్వలేదు. ఆ విజ్ఞాపన తెలుగులో లేదని ఒకరు, ఇంగ్లీషులో బోలెడు తప్పులున్నాయని మరొకరు, అసలు రచయితలని ఎలా అడగాలో "పద్ధతులు" బోధించేవారొకరూ ... ఇలా అవన్నీ చూసింతరవాత, నేను కేవలం నాకథలగురించి మాత్రమే జవాబు ఇచ్చి, నా అజ్ఞానం ప్రదర్శించుకున్నానేమో

అనిపించింది నాకు. చూసేరా, ఈ వీరి కబుర్లమూలంగా నా తెలివితేటలమీద నాకు నమ్మకం పోయింది. ఆత్మన్యూనతాభావము ఏర్పడింది! హతవిధీ!

ఇంతకీ నేను చెప్పేది, ఈ మందపత్రాలు అంపుతున్నప్పుడు కనీసం మీరు గుర్తు పెట్టుకోవలసినవి -

1. To అన్న పెట్టెలో మీపేరే పెట్టుకోండి. మిగతా ఐడీలు అక్కడ చేర్చకండి.

2. BCC (blind carbon copy) లో మిగతా ఐడీలు పెట్టండి.

3. రిప్లై అని జబాబు ఇస్తున్నప్పుడు ప్రత్యేకించి, reply all అన్నది ఉపయోగించవద్దని మనవి చేసుకోండి.

ఈ నియమాలు పాటిస్తే, మీరు కొన్నిరకాల జాలబాధలు తప్పించుకోగలరు.

అన్నిటికంటే ముఖ్యం ఈ వసతిని పొదుపుగా వాడుకోండి. చాలామందికి ఈ మందకబుర్లు ఆనందదాయకం కాదు. అవి 99 శాతం చెత్తబుట్టకి దఖలు అయిపోతాయి :))

000

(సెప్టెంబరు 23, 2012)

19. అతిరహస్యము అను కొండమీద గోల

చాలాకాలం క్రితం ఏదో ఇంగ్లీషు పత్రికలో ఒక పిట్టకథ చదివేను. ఇద్దరు స్నేహితులు ఉంటారు. అందులో ఒకతనికి నీ, నా తేడా లేకుండా అందిరి ఉత్తరాలూ చదవడం అలవాటు. ఒకరోజు ఆ మొదటాయన ఉత్తరం రాసుకుంటుంటే, వెనక నిలబడి చదవడం మొదలు పెట్టేడు. అది మొదటివాడు గ్రహించేడు. ఆ మిత్రసత్తముడికి బుద్ధి చెప్పదలుచుకుని, తలొంచుకుని మాటాడకుండా రాసుకుంటూ పోయేడు. చివరలో, “ఇంకో రహస్యం చెప్పాలి నీకు కానీ ఓ బుద్ధిలేని పెధవ నావెనక నిల్చుని ఈ ఉత్తరం చదువుతున్నాడు. అంచేత ఇప్పుడు రాయలేను,” అని ముగించేడు. ఆతరవాత ఆ స్నేహితుడు బుద్ధి తెచ్చుకుని ఇలా ఉత్తరాలు చదవడం మానీసేడు అని ఆ కథలో చదివినట్టు జ్ఞాపకం కానీ నాకైతే నమ్మాలని లేదు. మీరూ వినే ఉంటారు కదా పుట్టుకతో వచ్చిన బుద్ధులు … … హీహీ.

ఇంతకీ ఈ privacy అనబడు రహస్యం పాశ్చాత్యులకి పుట్టిన బుద్ధి అనుకుంటా. మనకి ప్రైవేసి అన్నపదమే లేదు. అయితే ఎక్కడ privacy ఉండునో అక్కడ piracy కూడా ఉండును. దాచుకుంటేసే కదా దోపిడీ చెయ్యవలసిన అవసరం. దాపుడు లేకపోతే దోపిడీ కూడా లేదు. అప్పుడంతా దొరతనమే.

అమెరికాలో సోషల్ సెక్యూరిటి నెంబరు అని ఒకటుంది. అది బ్రహ్మరహస్యం అనీ, జాగ్రత్తగా దాచుకోమనీ ఎవరికీ ఇవ్వద్దనీ … ఇలా చాలా చాలా చెప్తారు. తీరా చూస్తే, తెల్లారి లేస్తే, ఎన్ని చోట్ల ఈ నెంబరు అడుగుతారో లెక్క లేదు. ఫోనుకంపెనీ, అప్పులకార్డు, బాంకు, ప్రతి షాపువాడూ ఇచ్చే కార్డు, దానికోసం మనం నింపవలసిన ఫారాలూ – అందరికీ కావాలి మన యస్సెన్. బేంకుకి ఫోను చేసి నా ఖాతగురించి

అడగాలంటే నీ యస్సెస్ నెంబరు చెప్పు అంటారు నేను నేనే అని నిరూపించుకోడానికి. మరి అవతలివాణ్ణి నేనెలా నమ్మడం అని అడగడానికి లేదు. ఒకటి, మనం వాళ్ళని పిలిచేం కానీ వాళ్ళు మనని పిలవలేదు. అలా పిలిచి అడిగేవాళ్ళు కూడా ఉన్నారనుకోండి. అది మరో కత. ఇంతకీ ఇలా కనీసం నెలకోసారయినా ఎక్కడో అక్కడ మన యస్సెస్సెన్ చెప్పుకు పోతుంటే ఇంక దానికి రహస్యం ఏమిటి, ఇదే కొండమీద గోలంటే. నామటుకు నాకు ఒక్కటే సుళువు కనిపించింది. ఇంతమందిదగ్గర నానెంబరుంది కనక, నేను మరిచిపోతే వాళ్ళని అడగొచ్చేమో అని. హాహ్. లేదులెండి. మళ్ళీ రహస్యం అడ్డొస్తుంది వాళ్ళకి మన నెంబరు మనకి చెప్పడానికి. ఖర్మ. ఇంకా సినిమాలవాళ్ళూ, రాజకీయాల్లో వాళ్లూ అయితే మరి చెప్పక్ఖర్లేదు కదా వాళ్ళ ప్రైవేసి నేతిబీరకాయలో నేతివాసనపాటి కూడా ఉండదు.

మన సంస్కృతిలో అదే పూర్వకాలంలో రహస్యాల్లేవు హాయిగా. "ఎవరికీ చెప్పకేం, నీక్కనక చెప్తున్నాను," "నీకు మాత్రమే చెప్తున్నా," అని రహస్యం చెప్తే, "అమ్మతోడు ఎవరికీ చెప్పను," అంటూ అవతలిమనిషి మాట ఇచ్చేక, ఇలాటి మాట ఇచ్చిపుచ్చుకోడాలు అనేకం అయేక కూజా ఆ రహస్యం తెల్లారేసరికి ఊరంతా పొక్కిపోతుంది పొగమంచులా. None of your business అన్న వాక్యానికి తెలుగు సమానార్థకం లేదనుకుంటా. "నాఊసు నీకెందుకూ" అనొచ్చు కానీ నాకు మాత్రం ఆ రెండు వాక్యాలూ ఒక్కలా ధ్వనించవు).

మనకి రహస్యాలు లేకపోడానికి ఒక కారణం స్థలాభావం కావచ్చు. రెండుగదుల కొంపల్లో పదిమంది ఉన్నప్పుడు బట్టలు మార్చుకోడానికే నానా అవస్థ అయేచోట రహస్యాలకి ఆస్కారం ఎక్కడ? మాటామంతీ, కొట్టుకోడాలూ, అతిరహస్యం బట్టబయలు, లేదా కొండమీద గోలేమిటంటే ... లాటి సామెతలు ఇలాగే వచ్చేయి. ఎవరూ వాటిని గట్టిగా పట్టించుకోరు. అన్ని హాస్యాల్లాగే అది మరో వేళాకోళం.

సాంకేతికం విజృంభించేక, ముఖాముఖీ మాటాడుకోడం తగ్గిపోయింది కదా. ఒకే గదిలో ఉన్నా ఐఫోనుల్లో texting చేసుకుంటారు. లాపుటాపులో చాటు చేసుకుంటారు. వాటికి పాస్వర్డులుంటాయి కనక మరెవరికీ తెలీదు. హాహాహా. ఈ పాస్వర్డు సంత నాకెంత నవ్వొస్తుందో చెప్పలేను.

ఈ సైటులూ, బ్లాగులూ వచ్చేక రిజిస్టరు చేసుకోమనడం, లాగినవమనడం … ఒక సరదా అయిపోయింది చాలామందికి. అది కూడా నాకయితే వేళాకోళంగానే అనిపిస్తుంది అవసరం ఉన్నా లేకపోయినా ఈ లాగినులు. నేను చూసే సైటులు తక్కువే. అయినా నాకిప్పటికి ఓ డజనున్నర పాస్వర్డులు ఉన్నాయి. మరి అదే పనిగా జాలవిహారం చేసేవారికి ఎన్ని ఉంటాయో. అవన్నీ వాళ్ళెలా గుర్తు పెట్టుకుంటారో … నాకు ఎప్పుడూ సందేహమే. అవన్నీ గుర్తు పెట్టుకోడానికి ఓ చిన్న పుస్తకం, మళ్ళీ ఆ పుస్తకానికి తాళాలూ, ఆ తాళం పారేసుకోకుండా దానికి మరో చిన్న పెట్టె, … ఇలా అనంతంగా సాగిపోవచ్చు ఈ రహస్యనాటకాలు కదా.

ఈమధ్య కొన్ని బ్లాగుల్లో వ్యాఖ్య రాయడానికి ఉన్న తంతు చూడండి. మొదట ఏ ఐడి వినియోగించుకుంటున్నామో వారికి మనవి చేసుకోవాలి. ఆ తరవాత, వ్యాఖ్య రాసి మునుజూపు చేసుకోవాలి. కొన్ని చోట్ల మరేదో కోడు కూడా టైపు చెయ్యాలి. కొన్ని కోడులు నాలుగేళ్ళపిల్లాడు కూడా తిరిగి రాయగలిగేలా ఉంటే, కొన్ని ఎన్నిమార్లు టైపు చేసినా సరిగ్గా లేదంటూ సణుగుతాయి. నేను చాలాసార్లు దణ్ణం పెట్టేశాను నాతరం కాదని.

ఇంతా చేస్తే అందులో బ్రహ్మరహస్యాలేమీ లేవు. మరి ఇవన్నీ ఎందుకంటే ఆ సైటుదారులు కొత్తగా నేర్చుకున్న విద్య అనుకోవాలి. కొత్తబిచ్చగాడు పొద్దెరగడని. లేదా, “మేం చెయ్యగలం కనక” అంటారేమో కూడా తెలీదు. నిజానికి ఈ పాస్వర్డులు తలుచుకుంటే నాకు మానాయనమ్మ చెప్పే సామెత గుర్తొస్తోంది. “కొబ్బరిచెట్టుకి

మడిబట్ట కట్టినట్ట"ని. నేనింకా ప్రయత్నించలేదు కానీ ఈ పాస్వర్డులు నిజానికి మన పొడుపుకథలకి విడుపులాగే చాలా చాలా తేలికట, కొబ్బరిచెట్టుకి కట్టిన మడిబట్టకంటే ఓ చూపువాసి మాత్రం మేలేమో.

ఆమధ్య ఒకావిడ వాళ్ళమ్మాయి మెయిళ్ళు చూస్తానంది ఏదో మాటలసందర్భంలో. నేను ఆశ్యర్యంగా చూసేను అవిడవేపు. "ఏం నువ్వు చూడవా మీఅమ్మాయి మెయిళ్లు?" అంది నాకంటే ఆశ్చర్యపోతూ.

"లేద"న్నాను.

"ఏముంది చూస్తే తప్పేమిటి? ఏం రహస్యాలుంటాయి మనలో మనకి," అందావిడ మళ్లీ.

"చూడ్డానికి మాత్రం ఏముంది. నాకు తెలియాల్సిందేదేనా ఉంటే తనే చెప్తుంది కదా," అన్నాన్నేను.

అమెరికాలో ఎంతో కాలంగా ఉంటున్న ఆవిడ, ఇక్కడే పుట్టి పెరిగిన ఆ అమ్మాయికి రహస్యాలు లేకుండా ఉండడం నాకు ఆశ్యర్యంగానే ఉంది. అంటే రహస్యాలు ఉన్నాయా లేవా అని కాదు. ఎవరిబతుకులు వాళ్ళవి అన్న తేడా వచ్చేక, మరి ఎవరిగౌరవాలు వారు నిలుపుకోవాలి కదా. పైన చెప్పినకతకంటే ఘోరం పిల్లలేం చేస్తున్నారో అన్న భయం అన్న కారణంతో వాళ్ల మెయిళ్ళు చూడ్డం. అవునండీ ఇది కూడా చేస్తున్నారు. నాకు ఇది మరీ వింతగా ఉంటుంది. ఎందుకంటే, ఈ దొంగచదువుల్లో మరోభయం ఏమిటంటే ఆ పిల్లలకి తమ దొంగచేష్టలు తెలిసిపోతాయేమోనన్న భయం, వాళ్ళు హన్నా నాఉత్తరాలు చూసేవా అని నిలదీస్తే ఏం చెప్పాలన్న బెరుకు, వాళ్ళరహస్యాలు తెలిసినతరవాత ఏం చెయ్యలేం కదా అన్న ఏడుపు, ... ఎందుకొచ్చిన సంత, ఎందుకింత అవస్థ? అనన్నమాట నాకు హాచ్చెర్యమ్. . హుమ్. ఏమిటో, నాకీ మనుషులు అర్థం కారు. ప్చ్.

000

(అక్టోబరు 17, 2012.)

20. పాదరక్షలూ, ఈతిబాధలూ

నిన్న ఒక వార్త – కొలరెడోలో ఓ నాలుగేళ్ళమ్మాయి కారులో వాళ్లమ్మతో బజారుకి వెళ్తుంటే ఏడవడం మొదలటెట్టింది, I am tired of Obama and Romney అంటూ, రేడియోలో వస్తున్న ఆ ఇద్దరి ప్రకటనలు భరించలేక. బహుశా, ఇంట్లో టీవీలో కూడా అవే చూస్తుండడంవల్ల ఆపిల్లకి ఏడుపొచ్చి ఉండొచ్చు. నిజానికి చాలామంది పెద్దలకి కూడా అలాగే ఉంది. ఇతర వ్యాపారస్థులు మళ్ళీ మా సమయం మాకెప్పుడొస్తుందా అని ఎదురు చూస్తూన్నారేమో కూడా. ఇంతకీ ఈ ఎన్నికలసంరంభానికీ నా పాదరక్షలకీ ఏమిటి సంబంధం అంటే – చెప్తాను.

నా జోళ్ళఘోషగురించి రాసి రెండేళ్ళయినట్టుంది, అవి మళ్ళీ ఇప్పుడు మార్చవలసిన అవుసరం ఏర్పడింది. అప్పట్లాగ మంచు కురవకపోయినా, అప్పుడు కొన్న జోళ్ళు అరిగిపోయేయి కనక ఇప్పుడు మరో జతకోసం వేట. వేట అని ఎందుకంటున్నానంటే, మూడు రోజులపాటు ముప్పై మైళ్ళ పరిధిలో ఉన్న జోళ్ళ షాపులన్నీ, లేదా నాకు నచ్చినవి దొరుకుతాయనుకున్న షాపులన్నీ తిరిగేను. అసలు మొదట నేను పూర్వం కొన్న షాపుకే వెళ్ళేను అక్కడ కొనుక్కొచ్చేస్తే ఇట్టే పనయిపోతుందని. ఊహు, లేదు. ఈనాటి వ్యాపారసరళిలో పదికాలాలపాటు మన్నేవి చెయ్యకపోవడమే కాక పది కాలాలపాటు ఏ వస్తువూ బజారులో ఉండడానికి వీల్లేదు. ఇప్పుడు ఎక్కడ చూసినా డిజైనరు జోళ్ళే. రెండో మూడో జతలు స్నీకర్సు కనిపించినా అవి నాకు నప్పలేదు. అయితే రెండు సైజులు పెద్ద, కాకపోతే రెండు సైజులు చిన్న. పైగా నాకు ఓ పాదం కాస్త వంకర అంచేత నాకు వైడ్ కావాలి. అవి

కనిపించడం మరీ కష్టమయింది. ఏ షాపులో అడిగినా, అవి ఇప్పుడు అట్టే రావడం లేదుట, ఓ సైజు పెద్దది తీసుకోమన్నారు. ఇంకోవిషయం కూడా కనిపెట్టేను. ఇదివరకు షాపులో పనివాళ్ళు చాలామంది ఉండేవాళ్ళు. ద్వారం దగ్గరే పలకరించి, ఎలాటి జోళ్ళు కావాలో, ఎంత ధరలో కావాలో … ఇలా ఆనూ పానూ కనుక్కుని, చక్కగా పీటేసి, కూచోపెట్టి, సుమారుగా మనకి పనికొస్తాయనుకునే జతలు నాలుగు తెచ్చి కాలికి తొడిగి చూపేవారు కదా. … ఆరోజులు పోయేయి. ఇప్పుడు దుకాణంలో అడుగెట్టగానే ఏమూలనుంచో హాయని ఓ పలుకు వినిపిస్తుంది. తరవాత మనకేం కావాలో మననే చూసుకోమనీ, అవసరమైతే పిలవమనీ చెప్తుంది ఆ గొంతు. అంటే నాకా భోగం లేకుండా పోయిందే అని విచారిస్తున్నాననుకునేరు. అదేం లేదండి. ఇది తీసుకో, ఇది నీకు బాగుంది అంటూ ఊదరపెట్టేసే అమ్మకందారు కన్నా నాకు ఇదే ఎక్కువ ఇష్టం. ఇంతకీ, నాకు కావల్సిన స్నీకర్లు ఏ షాపులోనూ లేవు. ఎంత పెద్ద షాపయితే అంత ఎక్కువగా ఉన్నవి డిజనైరు షూలే. నైకీ లాటి స్నీకర్లే అమ్మే దుకాణంలో కూడా నాకేం కనిపించలేదు. అక్కడున్నవాటి పోకులూ, రంగులూ చూసి ఝుడుసుకున్నాను. చాలా నిస్పృహ వచ్చేసింది. రెండున్నర రోజులు చుట్టుపట్ల ముప్ఫైమైళ్ళపరిధిలో ఆరు దుకాణాలు తిరిగేను.

మంచు లేదు కనక ఆకుచెప్పులతో తిరిగితే పోలే అని కూడా అనిపించింది. కానీ చాలా దూరం – అదే ఒళ్ళు కొవ్వెక్కిపోకుండా దారిలో ఉంచడానికి – ఆకుచెప్పులతో నడవడం కష్టం కదా. ఏమిటో, ఇక్కడికొచ్చేక ఇన్ని రకాల జోళ్ళు అంటూ కొంచెంసేపు కారులోనే కూర్చుని విచారించేను కూడా. తాతగారికాలంలో –మీలో కొందరికైనా జ్ఞాపకం ఉండే ఉంటుంది. ఒక్క జత వీధిచివర గోనెసంచీ పరుచుకు కూర్చున్న గోడారిచేత కుట్టిస్తే .. ఎంత కాలం మన్నేదో! మీలో కొందరైనా కథల్లో చదివే ఉంటారు చెప్పులజత కతలు. ఉంగరం తెగిపోతే ఉంగరం, మడమ అరిగిపోతే మడమ – పాపం ఆ గోడారి మళ్ళీ అతికించి ఇచ్చేవాడు. అలా ముక్కలు ముక్కలు

మార్చుకుంటూ వచ్చి, ఆఖరికి మార్చడానికి ఏమీ మిగలకుండా పోయినప్పుడే మరో జత కుట్టించుకోడం.

అమెరికాలో జోళ్ళకల్చరని ఒకటుందసలు. ఆడవాళ్ళజోళ్ళనీ, మగవాళ్ళ టైలనీ మెచ్చుకోడం ఓ అనవాయితీట. మొదట్లో, మొదట్లో ఏమిటిలెండి నాకు ఇప్పటికీ సరిగ్గా అర్థం కాదు ఇదేం మర్యాదో. మాటాడ్డానికేమీ లేకపోతేనూ, మాటాడుతున్న విషయం ఇష్టం లేకపోతేనూ జోళ్ళనీ, టైలనీ మెచ్చుకోడం ఓ దారి. పని గట్టుకుని మీ షూ నైసూ, టై నైసూ అంటూ కేవలం అవతలిమనిషిని మురిపించడానికే మెచ్చుకోడం మాత్రం నాకు తమాషాగానే ఉంది.

ఆ పిల్ల బాధ ఆ పిల్లది. నాబాధ నాది. నాక్కూడా నిజానికి ఈ అభ్యర్థుల వరస అర్థం కావడం లేదు. నేను ఏపార్టీకి చెందనని ఇదివరకోసారి మనవి చేసుకున్నాననుకుంటా. కానీ liesలో white lies వేరయినట్టుగానే, బుకాయింపులలో రామ్నీ బుకాయింపు వేరుగా కనిపిస్తోంది. నిజానికి రామ్నీ గంభీరంగా బుకాయిస్తే, Ryan పసిమోముతో బుకాయిస్తున్నాడు. కిందటివారం రయన్ ఏదో soup kitchen గిన్నెలు కడుగుతున్నట్టు నటిస్తూ ఫొటో తీయించుకుని తన సేవాతత్పరతని ప్రకటించుకుంటే, ఈవారం రామ్నీ Sandyhook బాధితులకోసం ఓ అయిదువేలు ఖర్చు పెట్టి భోజనసామగ్రి కొని, తన సేవాతత్పరత సీను సృష్టించేడు. మరి వీళ్ళు ఇంత బాహాటంగా తమ నటనలు ప్రదర్శిస్తున్నా, దేశంలో దాదాపు సగంమంది ఓటర్లు ఆయనకి మద్దతు ఇస్తున్నారు. ఎన్నికలు ముగియకముందే ఇంత బాహాటంగా, నిస్సంకోచంగా నటనలు అయితే రేపు వీళ్ళు గద్దె ఎక్కినతరవాత ఎలా ప్రవర్తిస్తారు? తమ వాగ్దానాలు ఎలా నిలబెట్టుకుంటారు? అసలు ఏ వాగ్దానాలు నిలబెట్టుకుంటారు? ఈ ప్రశ్న ఎందుకంటే చాలా రకాల వాగ్దానాలు చేసేరు కదా. విస్కాన్సిన్ గవర్నరు రెండోసారి ఎన్నిక అయినతరవాత, నా పింఛనులో పది శాతం కోత పడింది. ఆయన ఎన్నికకీ, నా పింఛనులో కోతకీ

సంబంధం ఉందో లేదో నాకు తెలీదు. కానీ ముందు ముందు పరిస్థితులు ఎలా తగలడతాయో అన్న బెంగ మాత్రం పెరిగిపోతోంది ఇతోధికంగా.

ఇప్పుడు జోళ్ళకథకి వస్తాను. పూర్వకాలంలో తెలుగుదేశంలో చెప్పుకునే పిట్టకథ – ఒకాయన బజారుకెళ్ళి ఓ జత తీసుకున్నాడు. ఆ షాపు యజమాని, “అవి మీకు చిన్నవండీ. కరుస్తాయి. దానికంటే కొంచెం పెద్ద సైజు తీసుకోండి,” అని సలహా ఇచ్చేడు.

ఆయన, “లేదు నాయనా, ఇవే ఇయ్యి. ఇంట్లో అవస్థలు మరిచిపోగలను ఈ బాధతో,” అని సమాధానం ఇచ్చేట్ట.

నేను నాకు కావలసిన సైజులో వైడ్ దొరక్క, నేను మామూలుగా కొనే సైజుకన్నా ఒకటిన్నర సైజు పెద్దది తీసుకున్నాను. అది కూడా పాదానికి చుట్టుకుపోతోంది సంపెంగకొమ్మకి చుట్టుకున్న పాములా. అంతకంటే పెద్దది కొంటే, నడక తడబడి బోర్లా పడతాను. మిగతా కథ మీకే వొదిలిపెడతాను.

మీరు ఇక్కడినుంచి తరలిపోయేముందు, బాబ్బాబు, కనీసం నాజోళ్ళు మెచ్చుకుందురూ!!!!!



000

(అక్టోబరు 17, 2012)

21. ప్రకటనలమీద యుద్ధం ప్రకటిస్తున్నా

హమ్మయ్య ఎన్నికలమేళా ముగిసింది అనుకోడానికి లేదు. టీవీలూ, రేడియోలూ, కంప్యూటర్లూ ప్రకటనలకి కేటాయించిన సమయం అలాగే ఉంది. అంటే ఇది వరకు 20, 30 క్షణాలలో ముగిసే ప్రకటనలు ఇప్పుడు ఒకటిన్నర నిముషాలవరకూ సాగేయి. ఇదివరకు ఒకో విడత 3, 4 నిముషాలు అయితే ఇప్పుడు 5, 6 నిముషాలవరకూ వదల్డం లేదు. "ఫలానావాడు దుష్టుడూ, దుర్మార్గుడూ కనక మీఓటు నాకే" పోరు, ఈ వస్తువు మీకు అత్యంత అవుసరం, అది లేనిబతుకు వృథా, వృథా," కాకపోతే "ఈమందు మీ ఆరోగ్యానికి అత్యంత అవుసరం," అంటూ హోరు పెడుతున్నాయి.

అసలు ప్రకటన అన్న పదానికి నిగూఢార్థం ఏమైనా ఉందేమోనని అనుమానం వచ్చింది నాకు. నిఘంటువులు చూసేను. గూగుల్ చేసేను. అబ్బో, చాలానే ఉంది చదవాల్సింది. ఆ లింకులన్నీ ఇక్కడ నేనివ్వబోను మీరంతా నాకంటే సెర్చినిష్ణాతులే కదా. పైగా నేను ప్రకటిస్తున్న యుద్ధం ఈ ప్రకటనలు నా సమయాన్ని చాలా చాలా వ్యర్థం చేస్తున్నాయి అనే. మరి అలాటప్పుడు నేను కూడా మితం పాటించాలి కదా.

ఇంతకీ, నాకు అర్థమయినంతవరకూ, ఏ ఒక్కరితోనో అంటే ఇష్టసఖితోనో, వేడుకచెలికానితోనో, అమ్మతోనో, బాబుతోనో చెప్తే అది రహస్యం. నలుగురు మిత్రులతో కూచుని కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు చెప్తే, అది కబుర్లకిందకి వస్తుంది. సకలజనులకూ దండోరా వేస్తేనూ కరపత్రాలరూపంలో, కంఠఘోషరూపంలో తెలియజేస్తే అది ప్రకటన. అంటే ఫలానావాడికోసం అని కాక, గుడ్డివాడి చేతిరాయిలాటిది అన్నమాట. ఈరోజుల్లో టీవీలో, రేడియోలో, దిన, వార, పక్ష,

మాసపత్రికలలో, సంవత్సరానికోమారు ప్రచురించే సంవత్సరీకాల సంచికలలో వినిపించేవీ, కనిపించేవీ ఈ కోవలోకి వస్తాయి. ఇంకా ఐపాడు, ఐఫోనూ, ఆండ్రాయిడూలాటి వాటిలో కూడా ఈ ప్రకటనలు వస్తున్నాయనుకుంటా కానీ నాకు వాటితో ప్రత్యక్ష పరిచయం లేదు.

ఇంతకీ, నేనిక్కడ ప్రత్యేకించి చర్చించబోయేది ఈ మూడోతరగతి ప్రకటనలు. ఇది పూర్వం దండోరా రూపంలో సాగేది అన్నాను కదా. అంటే ఏవిషయమైనా సకల జనులకూ తెలియపరచవలనంటే గ్రామబారికి లేక తలారి డప్పు వాయించుకుంటూ ఇదీ విషయం అని చెప్పుకుంటూ పోయేవాడు. ఇప్పటికీ చిన్న పల్లెల్లో పెళ్ళిళ్ళూ, పండుగలకీ వేరే పిలుపులు, పెళ్ళిపత్రికలూ లేవు, ఫలానావారింట్లో పెళ్ళి, అందరూ భోజనాలకి రండహో అని దండోరా వేయడమే అని ఈమధ్య ఒకాయన నాతో అన్నాడు. అతనివయసు ముప్పైలోపే కనక అతనిచిన్నప్పుడు అంటే పాతికేళ్ళకిందట అనుకుంటున్నాను.

పోతే, వ్యాపారాలకి సంబంధించినంతవరకూ ఆచార్య జి.యన్. రెడ్డిగారి తెలుగు నిఘంటువులో ఇలా ఉంది -

> సంస్కృత విశేష్యము. [వాణిజ్యశాస్త్రము] సరకులకు సంబంధించిన సమాచారము అనుభోక్తులకు ఇష్టమగురీతిని వారికి అందచేసి వారి ప్రోత్సాహమును చూరగొనుట.

పరీక్షగా చూడండి. “అనుభోక్తులకు”, అంటే మనకి, అందజేసి, “వారి” అంటే “మన” ప్రోత్సాహమును చూరగొనుట అంట.

మరి ఈరోజుల్లో ఈ వాణిజ్యప్రకటనలు ఇలా ఉంటున్నాయా లేదా అని పరిశీలించుట ఈ టపా ధ్యేయము. నాకు అమెరికాసరళి మాత్రమే పరిచయం కానీ అమెరికాఆచారాలన్నీ మనదేశంలో కూడా ఫక్తుగా అమలు అయిపోతున్నాయి కనక అక్కడా ఇలాగే ఉందనుకుని రాస్తున్నా.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న శతసహస్ర మాధ్యమాలలో ప్రకటనలు వస్తున్నాయి కదా. అంటే ఒక వార పత్రికలో ఒకసారి చూడ్డం, ఆకాశవాణిలో పదిసార్లు వినడం కాదు. అందుబాటులో ఉన్న అన్ని మాధ్యమాలద్వారా మూకఉమ్మడిగా మనమీద ముప్పై వేపులనించీ దాడి అన్నమాట. వాళ్ళకయితే, "మేం ఫలానావారిని దృష్టిలో పెట్టుకుని చెప్తున్నాం" అనే నమ్మకం కానీ అది అవసరం లేని ప్రజలు వేలసంఖ్యలో ఉన్నారని వాళ్ళు అనుకోరో, అది వారిఖర్మ అనుకుంటారో నాకు తెలీదు. మామూలుగా బిజినెస్ పాఠశాలలో ప్రాథమిక సూత్రం ఒకటుంది. అదేమిటంటే, ఒక లక్ష కరపత్రాలు పంచి పెడితే, వాటిలో పెయ్యోవంతు మొదటివాక్యం అంటే శీర్షిక చూడొచ్చు. వారిలో పెయ్యోవంతు సగం కరపత్రం చదవొచ్చు. వారిలో పెయ్యోవంతు తరవాత చూద్దాంలే అని పక్కన పెట్టుకోవచ్చు. అంటే కొన్ని లక్షల కరపత్రాలు పంచిపెడితే పదిమంది కొనేవాళ్ళు దొరకొచ్చు. మిగతావారందరూ, ఎందుకొచ్చినసంత అని విసుక్కోవచ్చు. హుమ్.

ఇప్పుడు ఈ టీవీలాటి మాధ్యమాలొచ్చేక, వ్యాపారులు "ఆహో, ఒహో, కొన్ని కోట్లమంది మొహాలమీదకి ఒక్కసారిగా విసిరేయొచ్చు," అనుకుంటూ మురిసిపోతున్నారు కానీ పైలెక్కలప్రకారం అంతకంత చిరాకు పడేవారు కూడా ఉన్నారని గమనించరో, పట్టించుకోరో నాకు తెలీదు. టెలిమార్కెటర్లక్లాసులో చెప్తారు అవతలివారు ఎంత విసుక్కున్నా పట్టించుకోకండి అని. అదన్నమాట వారి మౌలికసూత్రం. నామటుకు నాకు మాత్రం ఇది ఏదో రకం "దుర్మార్గం" అనే అనిపిస్తుంది.

పంచభక్ష్యపరమాన్నాలూ, నవకాయరుచులూ కాకపోవచ్చు కానీ నేను ఎంతో ఇష్టంగా వండుకున్న మెంతివంకాయ కూరా, కరివేపాకు పొడీ కంచంలో పెట్టుకుని చవులూరా తిందాం అని కూర్చున్నప్పుడు అజీర్తి, కడుపునొప్పులూ, వాటికి సంబంధించిన ఇతర విశేషాలు వినాలనిపించదు. చేతిలో ముద్ద నోటిదాకా రాదు. లేదా, మరెక్కడో తిండికి మలమల మాడిపోతున్న పసివాళ్ళమొహాలు చూస్తూంటే, నేనేదో ఎవరికో ద్రోహం

చేస్తున్నానేమో అన్న భయం కూడా కలుగుతుంది. అలాటప్పుడే, నేను టీవీ చూసే సమయం తగ్గించవలసిందన్న స్పృహ కూడా కలుగుతుంది. చూసేరా, వీటివల్ల లాభం. నాకు చాలా ఇష్టమైన షో కూడా ఈ ప్రకటనలు వచ్చినప్పుడు టీవీ కట్టేయడం బహు తేలిక. శ్మశానవైరాగ్యంలాటిదన్న మాట.

మరో సౌకర్యం, కాఫీ పెట్టుకోడం, బట్టలుతుక్కోడం, ఇరుగూపొరుగుతో చిన్న బాతాఖానీ కూడా సాధ్యం. ఈ ప్రకటనదారులు దుర్మార్గం ఇలాగే కొనసాగితే, బహుశా వీధిచివర దుకాణంలో ఒకట్రెండు వస్తువులు కొనుక్కొచ్చేయడానికి కూడా సమయం దొరకొచ్చు!! ఇలా ప్రకటనలసమయం నేను వేరే కార్యక్రమాలకి వెచ్చించడం ఒక ఎత్తు. అంతకంటే ముఖ్యాతి ముఖ్యం ఈ ప్రకటనలతో నన్ను నలువేపులనుంచి మహోదగ్రభీకరంగా చుట్టుముట్టేవారి వస్తువులు కొనను!! అంటే నేను కూడా అదే స్థాయిలో నా నిరసన తెలియజేస్తున్నాను.

సరే, ఇక్కడికిది ఆపేస్తాను. లేకపోతే, ఇది కూడా 5, 6 నిముషాల ప్రకటనలలా అనిపించగలదు.

000

(నవంబరు 16, 2012)

22. ఇ-పుస్తకప్రచురణలో మరో మలుపు

ఆగస్టు 2012లో ఇ-పుస్తకప్రచురణ వివరాలు రాసేక అక్కడికి ఆ నోది ముగిసిందనే అనుకున్నాను కానీ సాంకేతికాభివృద్ధి మహోధృతంగా ముంచుకొచ్చేస్తుంటే, అభివృద్ధి చెందేస్తుంటే, పుస్తకాన్ని జాలలోకంలోకి వదలడంలో గల ఇతర గొడవలు కూడా తెలిసొస్తున్నాయి. ఇలాటివి రచయితలకి సరదాగా ఉంటాయి కనకనూ, బ్లాగరులందరూ రచయితలే కనకనూ, ఇవి అనేకమందికి అనేకకారణాలవల్ల ఆసక్తికరంగా ఉంటాయని ఇక్కడ రాస్తున్నాను. ఇది ప్రధానంగా కాపీరైటుకి సంబంధించిన అంశం.

ఇ-పుస్తక ప్రచురణ సంగతి - అచ్చుతప్పులు ఉంటే మనపాఠకులు క్షమించరు కనక పదే పదే ముప్పైసార్లు తప్పుల్లేకుండా చూసుకుని, ఏదో ఓ ఇ-ప్రచురణకర్తని ఎంచుకుని, వారికోరికమేరకు వారు చెప్పినపద్ధతిలో మనకథలనో, వ్యాసాలనో, కవితలనో ఓచోట చేర్చి, వాటికి ఓ పుస్తకరూపం కల్పించి ప్రచురిస్తాం అని చెప్పుకున్నాం కదా పూర్వం. ఎంత లేదన్నా మూడు నాలుగువారాల పని అన్నమాట, మొదట్లో మనం ఇవన్నీ రాసినప్పుడు వెచ్చించినసమయం కాక. ఇంత పాటు ఎందుకు పడతాం? మనపుస్తకాలు పదిమందో ముప్పైమందో నిజంగా కొని చదువుతారనే కదా. ఇలా పాఠకులమీదే ఉంటాయి మనకళ్లూ, ఆశలూనూ. ఇదంతా అయింతరవాత ఎన్ని కాపీలు అమ్ముడుపోయేయని అడక్కండి మరి. నావరకు ఇదంతా నిష్కామకర్మ కిందే లెక్క. అయినా అప్పుడప్పుడు చిరాకు కలిగించే సంఘటనలు కూడా తటస్థపడతాయి. కాపీరైటు సంగతి అలాటిదే.

మామూలుగా మనదేశంలో కాపీరైటు హక్కులంటే నవ్వుతారు, నవ్విపోతారు. ఎందుకంటే, సర్వస్వామ్యసంకలితము అని వెనకటిరోజుల్లోనూ, రచయితవో ప్రచురణకర్తవో హక్కులనో, కాపీరైటాయెను అనో ప్రతి పుస్తకంమీదా, బ్లాగుల్లో ప్రతి టపాకిందా రాసినా, వాటివిలువ గడ్డిపోచకి కొరగాదు. అయినా మన కథో కమామీషో మరోచోట చూసేం అని మరెవరో చెప్పినప్పుడో లేదా మనమే సెర్చింజనులో వెతుక్కుంటే కనిపించినప్పుడో, అయ్యో వీళ్ళు మనకోమాట చెప్పి ఉంటే వారి పరువూ, మనపరువూ కూడా దక్కేది కదా అనిపించకపోదు. మళ్లీ నావరకే, నాపుస్తకాలు ఎవరూ కొనరు. అంటే కిందటేడు కొందరు కొన్నారు లెండి కానీ ఎందుక్కొన్నారంరా బాబూ అని విచారించేరేమో . లేదులెండి, హాస్యానికి అంటున్నా.

ఇంతకీ, నేను ఈమధ్య రెండు పుస్తకాలు సొంత ప్రచురణకింద ఇ-పుస్తకాలుగా ప్రచురించినసంగతి తెలుసు కద. నిజానికి ఇవి లెక్కకి సొంతప్రచురణే అయినా, వీటిని ఇ-పొత్తముగా తీరిచి దిద్ది బజారులో పెట్టడానికి KDP (Kindle Direct Publishing) సహాయం చేసేరు. మా ఒప్పందం ప్రకారం నేను ఆ పుస్తకాలు మరెక్కడా అమ్మకానికి పెట్టరాదు.

ఈ నాటకం ఎలా సాగిందంటే కెడిపివారు నాపుస్తకం కొబొ.కాంలో అమ్మకానికి ఉందని చూసేరు. వెంటనే నాకు తాఖీదు పంపేరు, “మనకి ఒప్పందం ఉంది కదా, నువ్వెలా వారికి కూడా ఇచ్చేవు?” అని.

నేను ఉలికిపడి, తేరుకుని, హడావుడిగా కొబొ.కాంకి మెయిలిచ్చేను, “మీరు నాపుస్తకం నా అనుమతి లేకుండా మీసైటులో అమ్మరాదు. వెంటనే తొలగించవలసింది,” అంటూ.

వారు వెంటనే జవాబయితే ఇచ్చేరు కానీ అది మామూలుగా అన్ని వ్యాపారటపాలలాగే boilerplate reply అనబడే రోకంటిపాట జవాబు, “మీమెయిలందింది. చూస్తాం,” అంటూ.

"చూస్తాం కాదు, మీరు చేస్తున్నది కాపీరైటు చట్టంప్రకారం నేరం కనక ముందు నాపుస్తకం తొలగించి, తరవాత కబుర్లు చెప్పండి," అని మళ్లీ గట్టిగా మరో మెయిలిచ్చేను. ఎందుకంటే ఇవతల నన్ను ఎమెజానువారు కంగాళీ చేస్తున్నారు. అన్నట్టు చెప్పేనా, కెడిపి పుస్తకాలు ఎమెజాన్.కాంలో అమ్మకానికి పెడతారు.

ఆ వెంటనే నాకు మరో సందేహం వచ్చి, కొబోలో ఇంకా నాపుస్తకాలేం ఉన్నాయా అని చూస్తే, మరొకటి కూడా కనిపించింది. అప్పుడు మళ్ళీ వారికి మెయిలిచ్చేను ఇలా మీరు నాపుస్తకాలన్నీ మీసైటులో పెట్టేయాలనుకుంటే చెప్పండి, మనం మరో ఒప్పందం చేసుకుందాం, ఆ అమ్మకాలలో నావంతు నాకిచ్చేయండి అని.

అప్పుడు చక్కగా ఒక నిజమనిషి సమాధానం ఇచ్చేరు, తాము నాపుస్తకాలు ఆర్కైవ్.ఆర్గ్ నించి, వారి అనుమతితో తీసుకున్నామనీ, కావలిస్తే వారినే అడగమని.

ఆర్కైవ్.ఆర్గ్ మీలో చాలామంది వినే ఉంటారు. లక్షలకొద్దీ పుస్తకాలు కేవలం సాహిత్యాన్ని ప్రజలకి ఉచితంగా అందించే సదుద్దేశంతో చేపట్టిన కార్యక్రమం. ఇది నిజంగా నిష్కామకర్మే. ఆ కార్యకర్తలకి శ్రమే కానీ ఆర్థికలాభం లేదు. అంచేత నేను మర్యాదగా వారిని అడిగేను ఏమిటి సంగతి అని.

వారు కూడా మర్యాదగానే జవాబిచ్చేరు, "కాపీరైటు (Creative Commons License agreement) హక్కులు తప్పకుండా గౌరవిస్తాం. కాపీరైటు హక్కులు లేనివి మాత్రమే, అది కూడా ఉచితంగా పంచిపెట్టడానికి మాత్రమే ఇతర సైటులకి అనుమతి ఇస్తాం," అని.

అంటే కొబో.కాం వారు నిజంగా తమకీ ఆర్కైవ్.కాం కీ మధ్య గల ఒప్పందాన్ని పాటించలేదు. అదన్నమాట కథ. ఇదంతా నేనెందుకు చెబుతున్నానంటే, మీరు ఆర్కైవ్.ఆర్గ్ కానీ మరొక సైటులో కానీ ఉచితంగా పుస్తకాలు పాఠకులకి అందించినా, అవి ఉచితమే కదా అని ఇతర సైటులవారు గానీ పాఠకులుగానీ తమ సైటులో

అమ్మకాలకి పెట్టుకోడానికి వారికి హక్కులు లేవు. నిజానికి ఉచితంగా తమ సైటులో ఇచ్చేస్తున్నట్టు నటించడం మరొక వ్యాపారసరళికిందకే వస్తుంది. తస్మాత్ జాగ్రత్త!!

అరవైయేళ్ళక్రితమే భమిడిపాటి కామేశ్వరరావుగారు పుస్తకప్రచురణలో సాధకబాధకాలు వివరించేరు 1944లో రాసిన ఒక వ్యాసంలో. అలాగే 1941లో తెలుగువాళ్ళు పెట్టిన ఇంగ్లీషుబడిలో తెలుగుమేష్టరుగారి స్థానంగురించి రాసేరు. ఈ రెండూ కాలానికి నిలిచిన వ్యాసాలు, చవులూరించే రచనలు. పాతావకాయలా పాత చింతకాయపచ్చడిలా అలరించగల రసవత్తరరచనలు. 70 ఏళ్ళ దాటిపోయినా ఇవాళే రాసేరేమో అనిపించేంత తాజా నిజాలు ఉన్నాయి ఆ వ్యాసాల్లో. ఇవి చదివితే మనం మన ఆలోచనల్లో, ఆచరణలో ఎంత ముందుకు పోయేమో కూడా తెలుస్తుంది!! తేడా చెప్పాలంటే సిగ్గు పడాల్సినసంగతులే కానీ గొప్పకి పోయేవి లేవు. “అదేంటండీ అలా అంటారూ, ఎంత అభివృద్ధి, ఎంత అది చేసేం, ఎంత ఇది చేసేం …” అంటూ కొండవీడు చేంతాడంత నిడివి జాబితా చదివేవాళ్ళుండొచ్చు, కానీ నామటుకు నాకు సమాజం అంటే మనుషులు. ”మనుషులు” అంటే మానవీయవిలువలని పాటించేవారూ, పరిరక్షించేవారూ అని విస్తృతార్థం. మానవీయవిలువలంటే ఎదటిమనిషినీ, వారి హక్కులనీ కూడా మిమ్మల్నీ మీహక్కులనీ చూసుకున్నంత గౌరవంగానూ చూడ్డమే. అంతర్జాలంలో కనిపించిన రచనలు ఉచితం అంటే మీ వినోదంకోసం అంటే మీరు చదువుకునేవరకే అని గ్రహించాలి.

ooo

(జనవరి 28, 2013)

23. బ్రతికియున్న సుఖములు బడయవచ్చు

... వచ్చునేమో కానీ, ఆ సుఖాలేమిటి, ఎలా వస్తాయి, ఎప్పుడు మనం సుఖంగా ఉన్నాం అనుకుంటాం, అనుకోగలం, ఏది సుఖం, ఏది సుఖం కాదు ... ఇలా ఆలోచించేస్తున్నానీమధ్య జోరుగా. దానికి కారణం లేకపోలేదు.

ఆమధ్య నాకూ తూలిక.నెట్ సైటుకీ కూడా చావు తప్పి కన్ను లొట్ట పోయినంతపనై, బతుకు జీవుడా అని కాళ్ళు చాపుక్కూచున్నప్పుడన్నమాట జీవితంగురించి ప్రగాఢమయిన సందేహాలు పుట్టుకురాసాగేయి. బ్రతికియున్న సుఖములు బడయవచ్చు, మాధవా, మరలనిమ్ము మన రథమ్ము, బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు ... లాటి పద్యపాదాలూ, జాతీయాలూ నాకళ్ళముందు నటనలు సాగించేయి. అసలు జీవితము అనగా నేమి, జీవించుట యనగా నేమి? ఎప్పుడు ఎవరిని చూస్తే, “ఆహా, అదీ జీవితం,” “జీవితం అంటే అలా ఉండాలి అనిపిస్తుంది?” లాటి ప్రశ్నలు కూడా నన్ను నేనే వేసేసుకుని జవాబులకోసం దిక్కులు చూస్తున్నాను. వెబ్ సైటయితే ఓ కొలిక్కి వచ్చే లక్షణాలు కనిపిస్తున్నాయి కానీ బతుకుతెరగులు మాత్రం ఇంకా గందరగోళంగానే ఉన్నాయి.

ఇదిలా ఉండగానే రెండు రోజులకిందట, ఇంకా టీవీలో Newtown హత్యాకాండమీద వార్తలు పచ్చిగా ఉండగానే, బోస్టనులో రెండు బాంబులు పేలడం, అదీ ఆరకముందే టెక్సస్ లో మరేదో ఘోరప్రమాదం ఇలా బోలెడు ఘోరాలు జరిగిపోతూంటే నాపరిస్థితి మరింత గడ్డుసమస్య అయిపోయింది.

సరే, సందేహాలు కలిగినప్పుడు కాయితమ్మీద రాసుకుంటే, జవాబులు వాటివెంటే వచ్చేస్తాయి మన ప్రయత్నం లేకుండా అని నాకు నేనే ఓ సిద్ధాంతం తయారు చేసేసుకుని, లాపుటాపు ఒడిలో వేసుక్కూచున్నాను.

నాకు చేతనయిన ఒక్క విద్యా, ఏదో రాసుకుంటూ పోడమే కదా అనే అనుకున్నాను కానీ సాగడం లేదు. గణాంకాలు చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. అలా దిగులు పడుతూ, అనాలోచితంగానే తెలుగుతూలిక డాష్ బోర్డు చూస్తే, రెండురోజులకిందట హఠాత్తుగా పది పదిహేనుమంది ఇటొచ్చినట్టు అర్థమయింది. ఇదేమి చోద్యము, ఏమిటీ పాఠకపెల్లువ, ఎచటినిండి ఏతెంచే ఈ పాఠకప్రవాహం, ఊరక రారు మహాత్ములు (ఈమధ్య విశ్వనాథ సత్యనారాయణగారి నవలలు చదువుతున్నానులెండి) అనుకుంటూ, చోపుదారులెవరో చూసుకుని, వరూధిని అని తెలుసుకుని, varudhini.blogspot.no వేపు వెళ్ళి చూస్తే, అక్కడ నాటపాకి లింకుంది. (ధన్యవాదములు, జిలేబీగారూ!). అంతే కాదు, మీరూ చూసేరు కదా, కాపీ కొట్టమని వారు సకలజనులనూ బతిమాలుకుంటున్నారు, ఆ టపా.

ఆహో, పండె నానోములు అని సావిత్రిలా (ఆకాలం ప్రేక్షకురాలినే కానీ సావిత్రి అంతటిమనిషిని కాను కనక) ఊహల్లోనే నాట్యమాడుతూ, ఆలస్యమేల, ఓ మంచి టపా చూసి కాపీ కొట్టి పెట్టేసుకుంటే పోయే అని నిర్ణయానికొచ్చేసేను త్వరితగతిని. హతోస్మి, ఆ తరవాతే వచ్చేయి తంటాలన్నీ.

కాపీ చేయుట కూడా ఒక విద్యే. అరవైనాలుగు కళల్లో అపహరణము కూడా ఒక విద్య అని బుధవరుల వాక్కు కదా. కాపీలు కొట్టడం దొంగతనమా? కాదా? అనిన అది సందర్భమునుబట్టి చెప్పుకొనవలె. పరీక్షల్లో అయితే గోప్యముగా నుంచడమే క్షేమము కనుక అది ఒకరకము. అంతర్జాలములో ఒకయింటిలో రాతను మరొకరు తమయింటికి చేరేసుకుంటే, అది మరియొక రకము. (ఇక్కడ **–కొను ప్రత్యయము** అవశ్యము. ఎందుచేత అంటే మీకు నచ్చిన, మీరు మెచ్చిన, మీకనులఎదటకొచ్చిన

రాతను మీరు మీ యింటిలోనికి మాత్రమే చేరేసుకొనగలరు కానీ నాయింటిలోనో మరొకరి యింటిలోనో పెట్టరు పెట్టలేరు కదా.). ఎందుకంటే ఇక్కడ మీరు బహాటంగా ఉన్న ఒక రాతని మళ్లీ బాహాటంగా రచయితపేరు మాత్రము మార్చి పెట్టుకుంటున్నారు కనక. ఇలా అన్ని రకాలా బాహాటం అయిపోతుంది. ఇలా వాదిస్తూ, అసలిది దొంగతనం కాదని కూడా వాదించొచ్చేమో ... సరేలెండి. అది మరోసారి చూద్దాం.

ఇంతకీ నాకు అనతికాలములోనే అర్థమయింది కాపీ కొట్టడం మాత్రం ఆషామాషీ కాదని. దానికి కూడా దమ్ములుండాలి. ఎంతో చాకచక్యం ఉండాలి. టపా ఒకటి నచ్చితే చాలదు. నాకు ఆలోచిస్తున్నకొద్దీ తల తిరిగిపోతోంది. అసలు ఎంచుకోడమే కష్టంగా ఉంది. ఏ బ్లాగు చూసినా, ఏ టపా చూసినా ఇది బాగుంది, ఇదీ బాగుంది, అమ్మో ఇది కూడా బాగుంది, అమ్మోమ్మో ఇదెంత బాగుందో, అయ్యో ఇది చాలా బాగుంది, ఇది కాపీ కొట్టని జన్మ జన్మే కాదు ... ఇలా చూస్తూ గాభరా పడిపోతున్నానే కానీ ఏదీ అన్నది తెగడం లేదు.

పోనీ వరూధినిగారే కదా "బాబ్బాబూ" అంటూ బతిమాలుతున్నారు అనుకున్నా కానీ ఆబ్లాగులో వ్యాఖ్యలు చూసేక, నాకు నీరసం వచ్చేసింది. చాలామందికి అది ఆవిడటపా అని తెలిసిపోయింది కదా. వాళ్ళందరూ వచ్చి నామీద పడితే, పులుసులోకి ఎముక లేకుండా చితక్కొట్టేస్తారేమో ...

పోనీ, అక్కడక్కడ మాటలు తీసేసీ, కొత్తవి పెట్టేసీ పెట్టేసుకుందాం. ఎవరేనా అడిగితే, ఇదుగో చూడండంటూ ఎక్కడెక్కడ వేరుగా ఉందో చూపించి దబాయించొచ్చు అనుకున్నా. అప్పుడూ భయమే. అలా దబాయించడంకోసమే ఇలా మార్చేరు అంటూ కొరుక్కు తినేస్తారేమో ...

నాకిప్పుడు మరో ఆలోచన కూడా వస్తోంది. ఇది కూడా దబాయింపు సరుకే. "అమ్మా, లేకు అయ్యా, బాష ఏ ఒక్కరి సొమ్మూ కాదు. నేను వాడిన ప్రతిపదం నిఘంటువులో

ఉంది. ఆవిడ లేక ఆయన కూడా ఆ నిఘంటువులోంచే పదాలు తీసుకుని ఉండవచ్చు. అంచేత ఇది నేను అపహరించేనని మీరు నిరూపించలేరు. అంతే కాదు. కొన్ని కోట్ల జనాబా గల ఈదేశంలో ఏ ఇద్దరికో ముగ్గురికో ఒకే రకమైన ఆలోచనలు రావని మీరెందుకనుకుంటారు? ఎలా నిరూపిస్తారు? అంతెందుకు, ఒక ఉదాహరణ చెప్తాను. మీరు ఎవరితోనైనా మాటాడుతున్నప్పుడు, ఎవరైనా "అరే, నేనూ అలాగే అనుకుంటున్నాను" అనడం వినలేదా? అంటే ఏమిటీ? ఇద్దరికీ ఒకే రకమైన ఆలోచనలు వేరువేరుగా వేరువేరు సమయాల్లో గానీ వేరు వేరు సందర్భాల్లో గానీ వచ్చి ఉంటాయి అనే కదా." ఇలా వాదించి వారి నోరు నొక్కేయొచ్చు. ... కానీ నాకు మాటకారితనం కొంచెం తక్కువే. అంచేత ఇది కూడా సాగదనిపించింది.

ఈ సుప్రసిద్ధబ్లాగరులతో మనం నెగ్గలేం, నలుగురిదృష్టి పడని ఓ కొత్తబ్లాగు ఉందేమో, అందులోనూ ఎవరికీ అంతగా పట్టని విషయం అయితే మరీ మంచిది అనుకున్నా ... మూడుపూటలు వెతికితే కనిపించింది ఓ టపా. ఎవరో యాహూ గుంపు పేజీలో తనపేరుమీద పెట్టుకున్నాడు. అయ్యో రాతా, అది నా రాతే! నేను తూలిక.నెట్ లో పెట్టిన వ్యాసం. అది కాపీ కొట్టి నాబ్లాగులో పెట్టనా అని ఆలోచిస్తున్నా, హుమ్. ఇంత బతుకూ బతికి ఇంటెనక చచ్చినట్టు (అదేలెండి, రచయితగా మాట.)

లేదా, వరూధినిగారూ, (లేదా ఇంకెవరైనా సరే), మీరు దీనిమీద మరో టపా రాస్తే, నేను దానిమీద మళ్ళీ ... రాసుకుంటూ పోదాం. ఏమంటారు?

000

(ఏప్రిల్ 18, 2013)

24. సమకాలీనమూ, సర్వకాలీనమూ

సాహిత్యం ఎప్పుడు ఎలా సర్వకాలీనమవుతుంది? సర్వకాలీనము తప్పనిసరిగా కావాలా?

అనేకానేకమంది, అంటే వేనవేలూ, లక్షలూ, కోట్లమంది ఒక పుస్తకం చదివితే, దాన్నిగురించి మాటాడితే, దానిమీద సమీక్షలపరంపర రాస్తే, ఆ రచయితని వేనోళ్ళ పొగిడితే అది అంతకంత ప్రాచుర్యం పొంది, సర్వకాలీనమయిపోతుందా? ఇంకో ప్రశ్న – పదిమంది నోటా నానుతూ ప్రబలిపోయే సాహిత్యమే ఆదరించదగిన, ఆస్వాదించదగిన ఉత్తమసాహిత్యమా?

మరి పాఠకులు మరిచిపోతున్న సాహిత్యంమాటేమిటి? నిన్నా మొన్నటివరకూ భండారు అచ్చమాంబగారి సాహిత్యసేవ ఎవరిదృష్టికీ ఆనలేదు. కనుపర్తి వరలక్ష్మమ్మగారిజీవితం ఎప్పుడు అంతమయిందో వాళ్ళకుటుంబంలోవారికే సరిగా తెలీదు! ఇహ ఆవిడ చేసిన సేవ సంగతి ఎంతమందికి తెలుస్తుంది? అలాగే, జి.వి. కృష్ణారావు, పూసపాటి కృష్ణంరాజు, కొడవటిగంటి – లేదండీ – కుటుంబరావు కాదు, ఆయనతమ్ముడు కృష్ణమూర్తి, నిడుదవోలు వెంకటరావు - ఇలా ఎందరో చెప్పుకోదగ్గ రచయితలగురించి ఈనాడు చాలామంది చెప్పుకోడం లేదు. అంతకంటే బాధాకరం – నేను తూలికలో ఇలా మరుగున పడిపోతున్నవారికథలు అనువదించి పెడితే, వాటికి ఆదరణ తక్కువే. కాళీపట్నం రామారావు, కొడవటి కుటుంబరావు, ముళ్ళపూడి వెంకటరమణ – ఈ పేర్లకున్నగిరాకీ అంతమంచి కథలూ రాసిన మరి కొందరికి లేదు. అంటే నేను పాఠకులముందు ఉంచి ఈ కథలు కూడా చూడండి అంటే చూసేవారు తక్కువే. ఇది చూస్తే నాకు బాధగానే ఉంటోంది మరి.

"ఏ గతి రచియించి రేని సమకాలము వారలు **మెచ్చరు** గదా?" అని చామకూర వెంకటకవి నీరసపడిపోయి నాలుగువందల సంవత్సరాలకి పైనే అయింది. నిజానికి ఆయనకాలంలో ఎవరేం అనుకున్నారో నాకు తెలీదు కానీ ప్రస్తుతం ఆయనపేరు కొందరైనా – అటువంటి సాహిత్యప్రక్రియ ఆస్వాదించగలవారు, ఆసక్తిగలవారు ఆగ్రంథంగురించి చెప్పుకుంటూనే ఉన్నా, తక్కువే అని చెప్పుకోకతప్పదు. అంటే ఈనాటి పత్రికలూ, బ్లాగులూ, ఇతరమీడియాలలో **విజయవిలాసం, మనుచరిత్రలాటి** ప్రబంధాలమీద చర్చలు తక్కువే. చలం, కుటుంబరావు, విశ్వనాథ సత్యనారాయణ – వీరిరచనలు కూడా గుంపులుగుంపులుగా జనాలు పడీ పడీ చదవడంలేదు. మరి ఏవి సర్వకాలీనం? ఏలా సర్వకాలీనం అయేయి?

ఈరోజు ఏ సినిమానటి అదీ హిందీ సినిమానటి గురించి ఓ నాలుగు ముక్కలు రాసినా, ఆ నాలుగు ముక్కలకీ తగిలే చూపుల్లో సగం కూడా రావు పైన చెప్పినరచయితలగురించీ, వారి పుస్తకాలగురించి రాస్తే. మరోలా చెప్పాలంటే పాప్ సంస్కృతిగా పేరు తెచ్చుకుంటున్న రచనలు, కనీసం అన్ని రచనలూ సార్వజనీనం అనుకున్నా, తాత్కాలికం కూడానేమో అని అనిపిస్తోంది నాకు. ఇవాళ్టివిషయాలకి ఇవాళ ఆదరణ ఎక్కువ. న్యాయమే కూడాను. కానీ సాహిత్యపరంగా అవి సర్వకాలీనం అవాలంటే, వాటికి అంతకంటే మరేదో బలం కూడా ఉండాలి. ఆ బలం మౌలికమైన మానవీయవిలువలు ఆవిష్కరించడంద్వారా వస్తుందనుకుంటా. ఏకాలంలోనూ ఏదేశంలోనూ ఆదరించగల విలువలయితేనే తరతరాలా వాటికి ఆదరణ ఉంటుంది.

ఉదాహరణకి మన సాహిత్యంలో ఏవి సర్వకాలీనం అయేయి అంటే రామాయణం, మహా భారతం, భగవద్గీతలాటివే. వీటిల్లో కూడా ఎప్పటికప్పుడు కొత్తవ్యాఖ్యానాలతో, కొత్తకోణాలు ప్రతిపాదిస్తూ పాఠకులకి అందిస్తున్నారు రచయితలు. వాల్మీకి రామాయం చదివేవారికంటే విశ్వనాథ సత్యనారాయణగారి కల్పవృక్షమో, రంగనాయకమ్మ విషవృక్షమో చదివేవారే ఎక్కువ కాడానికి ఎక్కువ అవకాశం ఉంది

కదా. ఎందుకంటే, వాటికి ఈనాటి వేలాది పాఠకులని ఆకర్షించే లక్షణాలు ఉన్నాయి. వేరు వేరు కాలాల్లో వేరు వేరు కవులు అందుకే వాటిని తిరగరాసేరు, తమ సమకాలికుల అభిరుచులకీ, ఆచారాలకీ అనుగుణంగా, తమ సమకాలీకులు అర్థం చేసుకోగల అలంకారాల, పదవిన్యాసాలతో. కల్పవృక్షానికి బలం విశ్వనాథ సత్యనారాయణగారి శైలి, ఆవిష్కరించిన తీరూ అయితే విషవృక్షానికి వచ్చిన ఖ్యాతి ఆ రచయిత్రి సాంఘికదృక్పథం. అలాగే లత రామాయణం కూడాను. మరి వీటిలో ఏది కాలానికి నిలుస్తుంది అంటే, సుమారుగా నాఅభిప్రాయం, కల్పవృక్షమేనని. దానికి కూడా కారణం చెప్తాను. కొన్నివేల కాకపోతే కొన్ని వందలసంవత్సరాలుగా ప్రజానీకం ఆదరిస్తున్న విలువలు, సంప్రదాయాలూ గౌరవిస్తుంది కల్పవృక్షం. విషవృక్షం ఒక రాజకీయసిద్ధాంతాన్ని ఆశ్రయించినది. రాజకీయనినాదాలచరిత్ర చూస్తే, ఏ రాజకీయసిద్ధాంతమూ కూడా కాలానికి నిలవలేదన్నది స్పష్టమే. సిద్ధాంతాలు మేధకి సంబంధించినవి. ఆచరణలో పెట్టినప్పుడు కానీ ఆ సిద్ధాంతాల్లో ఉన్న లోపాలూ, అవకతవకలూ బయలుపడవు. మార్క్సిజం, కాపిటలిజం, సోషలిజం – ఏదో సమయంలో కంఠసోషలుగానే భాసించడం జరుగుతోంది. తెల్లారి లేస్తే, ఈరోజు తిండి ఎలా వస్తుందనుకుంటూ మనుగడ సాగించేవారికి ఈ సిద్ధాంతాలు నీటిమీద రాతలు. ఇండియాలో రాచరికాలూ, తరవాత కంపెనీయుగం, ఆ తరవాత సోషలిజం, అమెరికాలో కాపిటలిజం – ఏదీ సామాన్యులకి చేసిన మేలేమి లేదు గట్టిగా ఆలోచించి చూస్తే. హుమ్. శాఖాచంక్రమణం అయిపోయింది. క్షమించాలి.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే సాహిత్యంలోనూ అంతే. ఒక పుస్తకం సామాన్యజనం ఆదరించే సాహిత్యం అనిపించుకోడానికి సాగే తతంగం ఎలా ఉంటోందో చూస్తున్నాం కదా.

సరదాకి మరోసారి మననం చేసుకుందాం. ఒక మేధావో, నాఅంత మేధావి మరి లేడు అనుకునేవారు ఓ పుస్తకం పుచ్చుకు, “ఇంత గొప్ప పుస్తకం మును రాలేదు,

మున్ముందు రాబోదు, నభూతో నభవిష్యతి" అంటూ ఎలుగెత్తి చాటుతారు. మరో సాహిత్యప్రియుడు వెంటనే భారీఎత్తున ఓ సభ ఏర్పాటు చేసి, ఆ రచయితకి కాశ్మీరుశాలువ కప్పుతాడు. "ఛట్, వారు ఒక శాలువ కప్పితే మనం దుశ్శాలువలు రెండు కప్పుదాం," అంటూ మరో సాహిత్యసేవకుడు హడావుడిగా హైదరాబాదు వెళ్ళి మరో మహా సభ ఏర్పాటు చేసి దుశ్శాలువలు కప్పుతాడు. ఆ రచయిత నాసాహిత్యప్రస్థానం అని వ్యాసం రాస్తాడు. దుశ్శాలువతోపాటు ఓ లక్షిద్దాం అని లక్షించి లక్షిచ్చేస్తారు డాలర్లు రూపాయలరూపంలో అమెరికాసాహిత్యసంఘంవారు. పత్రికలన్నీ ఫలానా రచయితని విచ్చు లక్షతో అమెరికా సాహితీవేత్తలు సత్కరించేరని ఘోషిస్తాయి మూకుమ్మడిగా. బ్లాగ్ మిత్రులూ, వారిమిత్రులూ యథాశక్తి వ్యాసాలు రాసేస్తారు ఆరచయిత సామర్థ్యాన్ని వేయినోళ్ళ పొగడుతూ. ఆవెంటనే వారి శత్రువులూ, ఆ శత్రువులమిత్రులూ రచయితనీ, రచయితని పొగడుతున్న వారినీ తెగడుతూ మరిన్ని వ్యాసాలు రాసేస్తారు తెగడుతూ. ఈ సాహిత్యహోమం హోరు చూసి, అమెరికాలో ప్రముఖ సాహిత్యసంఘం ఒకటి రచయితకి జీవితసాఫల్యపురస్కారం ప్రకటించేస్తుంది. దాంతో మరో సాహితీవేత్త ఆ రచయితకి సాహిత్య ఎకాడమీ ఎవార్డు ఇచ్చితీరాలని ప్రతిపాదిస్తారు. ఇహ పైమెట్టు జ్ఞానపీఠమే కదా. ఇలా రాసినందుకు కొందరికి కోపం రావచ్చు కానీ నాకు శాలువలు కప్పినవారిలో, నన్ను సభలకి ఆహ్వానించివారిలో కొందరికి నిజంగా నాసాహిత్యకృషిని గురించిన అవగాహన ఏమీ లేదని అర్థమయినతరవాత కలిగినబాధతో రాస్తున్నానిది.

అంతవరకూ నిద్ర పోతున్న లేదా ఆరచయితగురించిగానీ ఆపుస్తకం గానీ వినివుండని నాలాటి సామాన్య చదువరులు, మత్తు వదిలించుకుని, "ఇంతమంది పొగుడుతున్నారు, ఇందులో ఏముందో చూద్దాం" అని ఆ పుస్తకం కొంటారు. లేదా, "అందరూ కొంటున్నారు నేను కొనకపోతే నామోషీ" అని కూడా కొనొచ్చు. "లైబ్రరీ ఎడిషను నడవలో అందంగా అమర్చుకోవచ్చ"ని కొనవచ్చు. "నాకు సాహిత్యాబిలాష ఉందని మాఇంటికొచ్చినవాళ్ళకి తెలియాల"ని కొని పెట్టుకోవచ్చు. పుస్తకం.నెట్ లో

ఈపుస్తకం కొన్నానని ప్రకటించుకోడానికి కూడా కొనచ్చు. “కొత్త పుస్తకాలేవైనా ఉన్నాయా?” అని అస్తమానం చంపుకుతినే మామయ్యకొడుక్కి ఎరువివ్వడానికి పనికొస్తుందని కూడా కొని పెట్టుకోవచ్చు. (ఈపుస్తకం చూసిన తరవాత మరింక నన్ను పుస్తకాలు ఎరువివ్వమని అడగడని ఏమూలో ఆశ కూడా కావచ్చు.) ... ఇలా అన్నమాట కనీసం కొన్ని పుస్తకాలు బహుళప్రచారానికి నోచుకుంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆధునిక విశ్వవిద్యాలయాల్లో బిజినెస్ పాఠాల్లో ఒకవస్తువుని అమ్ముకోడానికి ఏం చెయ్యమని చెప్తున్నారో అవన్నీ ఈనాడు సాహిత్యానికి ఆపాదించి ప్రచారం చేయడం జరుగుతోంది. సాహిత్యం ఒక కళ, కళ కళకోసమే అన్న సూత్రాలు మాయమయిపోయి, సాహిత్యానికి మూలసూత్రం ప్రచారం, అదొక వ్యాపారం అన్నది పరమార్థం అయిపోయింది. వ్యాపారం అనగానే అది తాత్కాలికం అని కూడా ఒప్పుకోవాలి.

పోతే, ఈ పాపు పుస్తకాలకి ప్రధానగుణం లేదా కేంద్రం, అంటే ఇంతమందిని ఆకర్షించి ఆకట్టుకోడానికి వాటిలో వస్తువు సమకాలీనసమాజం కావడం. సమకాలీనం అంటే ఈనాటి రాజకీయాలూ, సినిమాలూ, నాయకుల దురాగతాలూ, దుర్మార్గాలూ, వినాయకులఅవినీతులూ, వీటన్నిటికీ మించిన ఘనాతిఘనమైన విషయం – స్త్రీ, పురుషసంబంధాలు, వారిమధ్య ఆకర్షణ – ఈ కథలన్నీ సమకాలీనపాఠకులని ఆకర్షిస్తాయి. వీటికి విలువ లేదని కాదు నా అభిప్రాయం. వాటికి సర్వకాలీనత – ఏ కాలంలోనైనా ఆదరణకి నోచుకోగల బలం – ఉంటుందా, లేదా అన్నదే నాప్రశ్న, ఎప్పుడు ఎలా సాధ్యం అని నేనడుగుతున్నాను.

ఇలా రాస్తుంటే నాకో ఓ చిన్న కథ స్ఫురిస్తోంది. అంటే ఇప్పటికిప్పుడు ఓ కథ రాసేస్తున్నా.

కాలం పాతికేళ్ళక్రితం అనుకుందాం. ఒకాయన మరొకాయనతో “ఇవాళ మీఆవిడని ఎవరితోనో ఏదో పార్కులో ఓ చెట్టుకింద చూసేను” అంటాడు. వెంటనే మొదటాయన

ధుమధుమలాడుతూ ఆఘుమేఘూలమీద ఇంటికొచ్చేసి, "ఏంటి ఎవరితోనో పార్కులూ, షికార్లూ, చెట్టుకింద సరసాలూ," అంటూ హుంకరిస్తాడు. భార్య "అయ్యో, నాస్నేహితురాలు సుందరితో వెళ్లేనండి. ఎవరితో వెళ్ళేననుకుంటున్నారేమిటి?" అంటూ సంజాయిషీలిచ్చుకుంటుంది ఒణికిపోతూ. "ఓస్, అమ్మాయా, ఆ దౌర్భాగ్యుడు నాకు ఆమాట చెప్పలేదు," అంటూ చల్లబడిపోతాడు ఆయన. ఇది పాతకేళ్లకిందటి కథ. అదే ఈనాటి కథ అయితే, అమ్మాయి అయినా అపార్థాలకి తావుంది! ఈనాడు ఈ రెండోకథ గొప్ప సమకాలీనకథ కాగలదు. వేడి వేడి పకోడీల్లా పాఠకులు తినేస్తారు. కథఖ్యాతీ, రచయితఖ్యాతీ కూడా కార్చిచ్చులా వ్యాపించేస్తుంది. ఇదే కథ మరో పాతికేళ్లతరవాత అయితే, పాఠకులు, "ప్చ్, ఇలాటికథలు చాలా చూసేం" అని చప్పరించి, తీసిపారేస్తారు. అంటే, అప్పటికి ఈ ఆడా-ఆడా, మగా-మగా సంబంధాలు సరఫరా చేసే ఉత్సాహం, కుతూహలం, కొత్తదనం ఉండదు. ఉండదని కనీసం నేనిప్పుడు అనుకుంటున్నాను. అప్పటిసంగతేమో. .. . అదీ సమకాలీనవస్తువులకుండే సత్తా. అంటే ఈ గే, లెస్బియన్ కథలు కాలానికి నిలవవు అని కాదు నేనుంటున్నది. నిజానికి ఈ కాలానికి నిలవడం అన్నది కొంతవరకూ రచయిత చాకచక్యంమీద ఆధారపడి ఉంటుంది. వస్తువుని రచయిత ఏ కోణంలో ఆవిష్కరించేడు, ఎంత బలంగా ఆవిష్కరించేడు అన్నదాన్ని బట్టి ఉంటుంది.

పోతే, పాఠకులు పుస్తకాలని ఆదరించే విధానంలో కూడా మార్పు వచ్చింది. ఎలా అంటే నేనూ, నారాతలూ, నాప్రాంతంవారి రాతలూ, నాకులంరచయితల రాతలు (కులవ్యవస్థని గర్హించేవారిలో కూడా ఈ కులాభిమానం కనిపించడం విశేషం.) – ఇవి కేంద్రం అయినంతగా రచయితని గౌరవించడం, అంటే నిజంగా రచనాసార్థ్యం చూసి గౌరవించడం కనిపించదు. వారు చెప్తున్నదానిలో మనకి తెలీని కోణాలూ, తోచని ఆలోచనలు, లేదా కొత్త ఆలోచనలు కలిగించే గుణం ఉందా లేదా అన్న దృష్టి తక్కువా, మనం ఈ రచయితకి చెప్పగలదేమిటి అన్నయావ ఎక్కువా అయేయి. పాఠకులు తమకి స్ఫురించిన అభిప్రాయాలు చెప్పకూడదు అని అనడంలేదు నేను.

ఏదో ఒకటి చెప్పడమే ప్రధానమయి, కేవలం "చెప్పడమే" జరుగుతోంది. అలాకాక తాము చెప్తున్నది చర్చకి సంబంధించినదా కాదా, అనుబంధంగా ఉందా లేదా అన్న ఆలోచన కూడా ఉంటే, చర్చ పక్కదారి పట్టి, రామక్కా అంటే తామరాకా అన్నట్టు తయారు కాదు.

ఇలా వస్తువుమీద చర్చ కేంద్రీకరించి ఎక్కువమంది ఒక కథ బాగుందనో, బాగులేకపోతే ఎందుకు బాగులేదనో చర్చ చేసినప్పుడు ఆకథకి ఎక్కువ కాలం నిలిచే అవకాశం ఉంటుందని అభిప్రాయం. ఎందుకంటే, అలా చర్చించినప్పుడు కాలాతీతమయిన విలువలు చర్చించడం జరుగుతుంది కనక.

000

(ఏప్రిల్ 22, 2013)

25. అనువాదప్రస్థానమను అనుభవాలూ, అభిప్రాయాలూ

నేను అనువాదాలు చేయడం మొదలుపెట్టి పన్నెండేళ్ళకి పైనే అయింది. ఈ పన్నెండేళ్ళలోనూ ఈ విషయంలో చాలామాటలే విన్నాను. ఉదాహరణకి, అందులో కొన్ని –

- సొంతంగా రాయగలవాళ్ళెందుకు అనువాదాలు చేస్తారు?

- అనువాదాలు ఫలానావారిని చెయ్యమంటే, “నువ్వే చేసుకో” అంటున్నారు. నాకెక్కడ తీరిక, నాకథలు రాసుకోడానికే నాకు టైం చాలడం లేదు. (ఇది కూడా పై అభిప్రాయానికి పర్యాయరూపం అనుకుంటాను).

- ఏ రెండుభాషల్లోనో నాలుగు ముక్కలు వస్తే చాలు అనువాదం చేయొచ్చు. (ఇది విన్నప్పుడు 70వ దశకంలో ఏదో పత్రికలో వచ్చిన ఓ కార్టూను గుర్తొచ్చింది. ఓ తల్లి నాలుగోక్లాసు పంతులుగారితో అంటుంది, “మాఅమ్మాయి ఉద్యోగాలు చెయ్యాలా, ఊళ్లేలా, అక్షరాలు నేర్పండి చాలు. కథలు రాసుకు బతుకుతుంది, అని.)

- అనువాదం అంటే ముక్కస్య ముక్కకి సమానార్థకాలు కావలిస్తే నిఘంటువు చూసుకుని రాసేయడమే. అదే ఉత్తమపద్ధతి. ఇక్కడ మరో ఉపకథ - బ్రిటన్లో ఉండే ఒక ప్రముఖ అనువాదసంస్థ నాకో ఒక అనువాదప్రణాళిక ఒప్పచెప్పి, ఇలా చెయ్యమని సలహా ఇచ్చేరు. అలా చేస్తే ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో తెలిసి కూడా. నేను ఇలా అనుకోడానికి కారణం, వారే నాకు ఇచ్చిన ఉదాహరణ. ఇదంతా డబ్బుతో కూడుకున్న వ్యవహారం కూడాను. వారితో నాకున్న కాంట్రాక్టుమూలంగా ఇంతకంటె ఎక్కువ వివరాలు ఇవ్వలేను కానీ వారి ఉదాహరణకి దీటురాగల మరో ఉదాహరణ ఇస్తాను. ఒకరోజు నా అమెరికన్ స్నేహితురాలు పక్కనుండగా, ఒక

తెలుగమ్మాయి, ఏదో కథ చెప్తూ, "ఆయన హాండిచ్చేరు" అంది. వెంటనే నా అమెరికన్స్నేహితురాలి ఆ అమ్మాయి ఏం చెప్తోందని అడిగింది. " he gave her a hand," అన్నాను. తెలిసింది కదూ, అర్థం మారిపోయింది. అంచేత, వెంటనే మన తెలుగమ్మాయి, "అది కాదండీ, ఆయన నాచేత ఖాజా తినిపించేరు అంటున్నా" అంది. "నా మదర్ టంగు నాకు అదర్ టంగు," అయిపోయిందని నాకప్పుడే అర్థమయింది. అంతవరకూ నాకు ఆ "జాతీయం" తెలీదు. అన్నట్టు ఇది చాంద్రాయణం కిందకి వస్తుంది. నేను మొదలు పెట్టిన నా హృదయబాధ ఇది కాదు కదా. సరే, మళ్ళీ ఆదినించీ మొదలు పెడతాను.

అనువాదాలు ఎందుకు చెయ్యడం, ఎలా చెయ్యడం అన్న విషయంలో ప్రస్తుతం మహోధృతస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. సాహితీసంస్థలు ఏటా లేదా రెండేళ్ళకోసారి కాదా నాలుగేళ్ళకోసారి జరిపే సభల్లో తప్పనిసరిగా అనువాదవేదికకి ఓ పూట, ఓ గదీ, నలుగురు అనువాదవిదులనీ ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ ప్రముఖ అనువాదకులూ, అనువాదాచార్యులూ, అనువాదభీష్ములూ అనేకానేక అనువాదరహస్యాలూ, చిట్కాలూ, తదితర కిటుకులు విశదం చేస్తున్నారు. పత్రికలు ప్రముఖంగా వాటిగురించి వ్యాసాలు ప్రచురిస్తున్నాయి. తరవాత అవే పుస్తకరూపంలో కూడా భావి అనువాదకులకు అందించబడుతున్నాయి. అంచేత **తెలుగు సాహిత్యచరిత్రలో అనువాదము ఒక ప్రముఖ ప్రక్రియ** అనే అభిప్రాయానికి ఇప్పుడు వచ్చేను. మరి ప్రముఖప్రక్రియ అయినప్పుడు అంత తేలిగ్గా తీసిపారేయడం ఎందుకు జరుగుతోంది మరో పక్కన?

నేను మొదట్లో ఉదహరించిన వాక్యాలు విన్నతరవాత నాఅనువాదాలమీద నాకే నానమ్మకమ్ము వమ్ము అయినవెనుక, నాకు మళ్లీ ఉత్సాహం కలిగించినవి రెండు. మొదటిది, సుప్రసిద్ధ రచయిత, పూజ్యులు మునిపల్లె రాజుగారు నాకథలు మాలతి అనువాదం చేస్తే బాగుంటుంది అని ప్రకటించడం. ఇంతవరకూ, నాకు నేనై అడిగి

పుచ్చుకు అనువాదాలు చేస్తున్నాను. నాకథలు చెయ్యండి అన్నవారి కథల్లో నాకు నచ్చినవి లేవు. అంచేత, రాజుగారికోరిక నాకెంతో ఆనందాన్నిచ్చింది. రెండోది, రెండురోజులక్రితం నాకళ్ళబడి, నాచేత చదవబడిన, సింహాసనద్వాత్రింశిక. నిజానికి నేనింకా కథలన్నీ చదవలేదు. ఈ పుస్తకానికి గడియారం రామకృష్ణశర్మరాగు రాసిన పీఠిక చదివేను. అదే ఉంది అరవై పేజీలకి పైన.

ఆ పీఠిక చదువుతుంటే నాకు ఎంత ఆశ్చర్యంగా అనిపించిందో చెప్పలేను. ఇదివరకోసారి నిడుదవోలు వెంకటరావుగారి గురించి ఎవరో అన్నమాట జ్ఞాపకానికొచ్చింది. వెంకటరావుగారు రాసే పీఠికలో ఎన్నో విశేషాలు విపులంగా చర్చిస్తారనీ, ఒకొకప్పుడు పుస్తకం కన్నా వెంకటరావుగారి పీఠికకే ఎక్కవ ఆదరణ లభిస్తుందనీ.

రామకృష్ణశాస్త్రిగారు తమపీఠికలో కొరివి గోపరాజు ఇంటిపేరు, కవికాలం, కవి పాండిత్యం ఇలా ఎన్నో విషయాలు చర్చించి, ఈ సింహాసనద్వాత్రింశిక సంస్కృతం విక్రమార్కచరిత్రకి అనువాదం అన్నారు. అయితే ఇది కేవలం అనువాదం అనడానికి వీల్లేదుట. తెలుగు పుస్తకంలో గోపరాజు తనకావ్యానికి ఉపయోగించుకున్న ఇతరగ్రంథాలు – కథాసరిత్సాగరం, పంచతంత్రంలాటివి ప్రస్తావించి, వాటికీ ఈ రచనకీ మధ్యగల వ్యత్యాసాలూ, గోపరాజు స్వయంప్రతిభ విశదం చేసేసమయాలూ కూడా రామకృష్ణశాస్త్రిగారు ఎత్తి చూపేరు. అంతే గాదు, గోపరాజు చేసిన మార్పులూ, చేర్పులూ -వీటివల్ల కొత్తగా సాధించిందేమీలేని సమయాలు చూపేరు. ఎందుకు అలా చేసేడో తెలీదని వ్యాఖ్యానించేరు. అలాగే, ఆయన చేసిన మార్పులవల్ల కావ్యం సంతరించుకున్న కొత్త అందాలు కూడా విశదీకరించేరు.

అది నాకు చాలా ఆనందం కలిగించింది. అంటే గోపరాజు రచనని మరొకరు తప్పు పట్టినందుకు అని కాదు నాఆనందం. అనువాదచరిత్రలో ఇలా సొంతతెలివితేటలు చూపింది నేనొక్కదాన్నీ కాదు, మొదటిదాన్నీ కాదు అని. ఇలా మార్పులూ,

చేర్పులూ చేయడం అనూచానంగా వస్తోందని తెలిసి అన్నమాట నేను బ్రహ్మానందపడిపోయింది.

అలాగే నన్నయ వ్యాసభగవానుడి భారతం తెలిగించేడు అన్నా, సాధారణంగా నన్నయ మహాభారతము అనే వాడుక. నిజానికి మహాభారతం నన్నయ ఒక్కడే రాయలేదు కదా. పూర్తి చేసినవారు మరో ఇద్దరున్నారు. కానీ బారతం అనగానే మనందరికీ తోచేది నన్నయే. ఎంచేతంటే, రెండు కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది, ఆయన తెలుగుభాష గొప్పగా వాడుకున్నాడు. రెండోది, ప్రజలు మరిచిపోతున్న సనాతన ధర్మాలనీ, మౌలికమైన సమాజికవిలువలనీ ఆనాటి ప్రజలకి మరోసారి గుర్తు చెయ్యడంకోసం, వారికి అర్థమయేవిధంగా మార్పులు చేసి రాసేడంటారు. మళ్ళీ అనువాద ప్రక్రియ అంటే, కేవలం మక్కికి మక్కీ ఎక్కించేయడం కాదని మరోసారి చెప్పుకోవాలన్నమాట.

సింహాసనద్వాత్రింశికకి ముందు గీతాంజలి చదువుతుంటే కూడా నాకు ఇలాటి అనుమానమే వచ్చింది. అందులో కొన్ని వాక్యాలు అద్భుతంగా అనిపించేయి. కొన్ని బావాలు అంతకంటే అద్భుతంగా అనిపించేయి. అప్పుడే నాకు అనుమానం వచ్చింది టాగోర్ ఇది రాయడమే ఇంగ్లీషులో రాసేడా, నేను చదువుతున్నది ఇది అనువాదమా అని. వెంటనే వెతకబోతే, అట్టే శ్రమ లేకుండానే తెలిసిపోయింది ఆయన మొదట బెంగాలీలోనే రాసేడనీ, తరవాత తనే ఇంగ్లీషులోకి అనువాదం చేసుకున్నాడనీను.

మరి కొన్నిచోట్ల ఇంగ్లీషు వాక్యాలు నాకెందుకు అంతగా నచ్చలేదు అంటే, సొంత రచన అయినా కూడ బాష అలాటి గమ్మత్తులు చేస్తుంది. ఇది ఒకటి. రెండోది, నాకు అమెరికనింగ్లీషు అలవాటయిపోయి, బ్రిటిషింగ్లీషులో కొన్ని పోకడలు విచిత్రంగా కనిపిస్తున్నాయి. ఉదాహరణకి అక్కడ for ever రెండు పదాలయితే మాకిక్కడ forever ఒకటే పదం. అలాగే copyright, copy right, everyone, every one, లాటివి. నిజానికి ఒకమాటని రెండు మాటలు చేస్తే అర్థాలు మారిపోతాయి కూడా

ఒకొకప్పుడు. మూడోది, నాకు బెంగాలీ రాదు. అంచేత బెంగాలీలో ఆ రచన ఎలా ఉందో నాకు తెలీదు. అంచేత నాకు తెలిసిన ఇంగ్లీషులోనే నేను అర్థం చేసుకుంటున్నాను. మరోలా చెప్పాలంటే, నేను అనువదించిన ఒక తెలుగుకథని తెలుగుపాఠకులు చదువుతున్నప్పుడు కలిగే అనుభూతి వేరు. తెలుగురానివాళ్ళు చదువుతున్నప్పుడు కలిగే అనుభూతి వేరు కదా.

నేను అనువాదాలు మొదలు పెట్టినప్పటికంటే, ఇప్పుడు నాఅనువాదాలు మెరుగ్గా ఉన్నాయంటున్నారు కొందరు. దానికి కారణం నిజంగా నా సామర్థ్యం మెరుగుపడిందా, చదివేవారికి అలవాటయిపోవడమా అన్న సందేహం నాకింకా ఉంది. అంతే కాదు. నామీద ఏదోరకమైన అభిమానమో, జాలో ఏర్పడి కూడా, పాపం, బాగానే చేస్తోంది అనిపించవచ్చు.

ఇదంతా మొదలు పెట్టడానికి కారణం, పైన చెప్పిన రెండు పుస్తకాలే కాక, తూలిక.నెట్ పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా, ఆ కథలూ, వ్యాసాలూ మరోసారి చూసి అక్కడ పెడుతున్నాను. రెండు రోజులక్రితం శ్రీదేవిగారి వాళ్ళు పాడిన భూపాలరాగంకి నా అనువాదం మరోసారి చూసుకుంటుంటే అనిపించింది. ఇప్పుడు నేను చేసిన మార్పులవల్ల అది నిజంగా మెరుగుపడిందా? లేక, ఢిల్లీనించి దేవగిరికీ, దేవగిరినించి ఢిల్లీకి మారినట్టు, ఏదో ఒక మార్పు మాత్రమే ముఖ్యం అని మారుస్తున్నానా అని. నిజానికి ఏనాడూ నూటికి నూరుపాళ్ళూ పర్ఫెక్ట్ అనువాదం అంటూ ఎక్కడా ఉండదేమో అని.

OOO

(మే 3, 2013)

26. ఇది యొక సాహిత్యం మాటలాడుకొనుట ...

ఒక్కరూ ఉన్నారా? అయ్యో పాపం.

అయితేనూ ... ఇంతకీ

మిమ్మల్నాయనొదిలేసారా? మీరే ఆయన్నొదిలేసేరా?

పిల్లలు మీతో మాటాడతారా? అంతా ఆయన్తోనేనా?

అయ్యో రాతా, మీకెంత కష్టంవొచ్చిందీ,

లాయరుతో మాటాడరాదూ, ముప్పతిప్పలూ పెట్టి మూడు చెరువుల్నీళ్ళు ...

ఇంతకీ ఇప్పుడాయనెక్కడున్నారు?

ఏంచేస్తున్నారు?

ఆమధ్య మావూరొచ్చేర్ట. మీకు తెలుసా,

బుచ్చమ్మింట మకాంట,

రాజుగారింట మేజువాణిట

వీరసాహిత్యకారులతో దేశసంచారంట

ఎన్నెన్నో భక్తసంఘాల్ట

ఎందరెందరో కప్పేర్ట కాశ్మీరు శాలువలు,

కట్టబెట్టేర్ట పట్టు పీతాంబరాలు

అందలాలెక్కించేర్ట, అబిషేకాల్చేయించేర్ట

వేలాదిపాఠకులు చుట్టుముట్టేర్ట కాలమేఘుంలా,

వందలాది విమర్శకులు శ్లాఘించేర్ట వేనవేల నోళ్ళ ఆదిశేషువులా

అదేమిటీ, మీకెందుకంటారా? మీక్కాకపోతే మరెవరికీ?

పాపం, ఆయనే కదా మీకు దిక్కు,

ఆయనతోనే కదా మీలోకం!

నాకెందుకంటారా?

నాక్కాకపోతే మరెవరికిటా? మీరంటే మాకెంతోఓఓఓ ప్రేమ,

మీకోసం మేం సిద్ధం ఏమి చేయడానికైనా

మీరు ఊఁ అనాలే గానీ గట్టిగా గా...ఠ్ఠిగా అడిగేస్తాం

చెంపపెట్టు పెట్టినట్టు

చెప్పుచ్చుక్కొట్టినట్టు,

నడివీధిలో కడిగి ఆరేసేస్తాం.

హేంవిటీ ... ఎవరిబతుకులు వారు బతుకుతున్నాం, మీకెందుకంటారా?

భలేవారే, మాక్కాపోతే మరెవరికి?

మనం మనం ఒకటి,

మీకంట తడి మాగుండెల్లో మంట

మీకాల్లో ముల్లు మా గుండెల్లో గునపం.

మీరోమారు మాఊరు రారాదూ

అట్టహాసంగా సభ పెట్టేస్తాం. మేం కూడా శాలువాలు కప్పుతాం.

పత్రికలలో బొమ్మలేయించేస్తాం.

ఏమిటీ, మీరేం రాసేరో మాకు తెలుసా అని అడుగుతున్నారు?

భలేవారే, సరే, మీరే చెప్పండి ఏం రాసేరో?

చెప్పకపోయినా ఫరవాలేదు, ఏదో రాసేరు కదా

అది చాలు. అంతే కావలసింది.

ఎవరో ...

ఆగండాగండి, మామాటడుగుతున్నారు?

ఇప్పుడదెందుకులెండి మామాట ...

హా, ఏఁవిటీ ... ఎవరో చెప్పేరా?

హన్నా, ఎంత కావరం,

పస్లేకపోతే సరి, ఎంతసేపూ పొరుగువారియావే వీళ్లకి.

మామీద పడేడవకపోతే, వాళ్ళిళ్ళలో వాళ్ళబతుకులేమిటో చూసుకోరాదూ

వాళ్లమాట ఎత్తితే ఊరంత కోపాలు. హుమ్.

వారికొడుకు చెడతిరుగుతాడు

వీరికూతురు చెడతాగుతుంది

పక్కింటాయన పిల్లలు అస్సస్్్సలు మాట వినరు

ఎదురింటాయన కొడుకూ, కోడలూ ఆస్తుల్రాయించేసుకుని

ముసలాళ్ళిద్దర్నీ వీధిలోకి గెంటేశారు.

హాహాహ్, ఎవరికి తెలీవుట వీళ్ల గుట్టులు

!!!!!!!!!!!!!!!!!!!!!!!!!!

పోస్లేద్దురూ, వాళ్ళపాపాన వాళ్ళే పోతారు,

మీతో సాహిత్యం మాటాడ్డం ఎంతోోోోోోోోోోోోో బావుంది, మాయింటికి రండి, ఇంకా మాటాడుకుందాం.

... .

మిత్రులారా! ఇదీ నాతో మాటాడాలనుందంటూ మాయింటికొచ్చేవారితో జరిగే సాహిత్యచర్చ.

000

(మే 10, 2013)

27. భక్తి, భక్తి, భక్తి ...

మనకి భక్తి మంచినీళ్ళప్రాయం. మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి, దేశభక్తి, దైవభక్తి, పతిభక్తి, రాయిభక్తి, రప్పభక్తి ... ఇలా మన జీవితాలు భక్తిమయం. మిత్రభక్తి లేదెంచేతో. పుత్రభక్తి కూడా లేదు. మిత్రుల, పుత్రులవిషయంలో ప్రేమ. మిత్రప్రేమ, పుత్రప్రేమ అంటే ప్రేమే భక్తి అనేమో ... ఏమో మరి. రెండింటిలోనూ రెండోవారిమీదే దృష్టి కేంద్రీకరించడం జరుగుతుంది కదా.

మీరాకి కృష్ణప్రేమే కృష్ణభక్తి. స్వతంత్రంకోసం పోరాడే రోజుల్లో చాలామంది రాట్నాలకి పూజలు చేసేరు. నాయకులబొమ్మలు గోడలకి తగిలించి దండలేసేరు. అలాటి భక్తితోనే బాపూ, గాంధీ పేర్లు కూడా పెట్టుకున్నారు తమ పిల్లలకి. అన్నట్టు ఈపేర్లు అయాచితంగా కర్మానుసారం వచ్చినవే కానీ పేరులు ధరించినవారు గాంధీమతం స్వీకరించేరనుకోడానికి లేదు. పాపం, వారి అమ్మలూ, నాన్నలూ బారసాలనాడు పళ్లెంలో బియ్యం పోసి, ఆరాసిలో రాసిన రాతలుగానే మిగిలిపోవచ్చు. వీళ్ళేమో పెరిగి, మంచి చదువులు చదువుకుని తదితర ఇజాలలో పడి పేరుకీ ప్రవృత్తికీ పొంతన లేకుండా చేసి, ఆ పేరుని నిరర్థకం చేసేస్తున్నారు. ఇంకా కొందరు తెలివి మీరి, బాప్ అనో ధీం అనో పేరు మార్చేసుకోవచ్చు కూడాను.

ఈ దేశభక్తిలో మరో విచిత్రం దేశమును ప్రేమించుమన్నా అంటూ దేశభక్తి గీతాలు, అదే వరసలో జార్జి చక్రవర్తిగారిని కొనియాడుతూ రాజభక్తి గీతాలూ అప్పారావుగారు రాసేరంటే, ఇక్కడ భక్తి మాత్రమే ప్రధానం కాని ఎవరికోసం అన్నది కాదేమో అనిపించకమానదు ఎవరికైనా. మనకి నిజంగా స్వతంత్రం ప్రధానం కాదేమో అని కూడా అనిపించింది నాకైతే.

పతిభక్తి ఉంది కానీ పత్నీభక్తి లేదు. అందుకు ప్రతిగా ఏకపత్నీవ్రతం అని ఒకటి పెట్టేరు. ఎవరూ, మనువేనా? నాకు తెలీదు. ఇప్పుడు మాత్రం మన ప్రభుత్వం దీనికో చట్టం తయారు చేసేసింది కానీ అన్ని చట్టాల్లాగే ఇదీ కాయితపుచట్రాల్లోనే బందీ అయిపోయింది. బహుభర్తృత్వం నిషేధిస్తూ చట్టం ఉందో లేదో నాకు తెలీదు. నిత్యజీవితంలో మాత్రం ఎవరూ ఎక్కడా దీన్నిగురించి అట్టే పట్టించుకున్నట్టు కనిపించదు. ఒకొకప్పుడు బహుపత్నులంటే తప్పు గొప్పకవులు కారేమో అని కూడా అనిపిస్తోంది!

ఇంతకీ భక్తీ, ప్రేమా ఒకటేనా? కాదా? అని సుదీర్ఘంగా ఆలోచించేను యథావిధిగా భ్రూకుటి ముడిచి, అర్ధనిమీలితనేత్రురాలినై. ముక్కు మూసుకోలేదు తీరి కూచుని ప్రాణంమీదకి తెచ్చుకోడం ఎందుకని.

ఇలా ఆలోచిస్తుంటే నాకు మరో విషయం తట్టింది.. భక్తి మరియు, లేక, ప్రేమ ఎటునించి ఎటు పారుతుంది అని. మాతృభక్తి, పితృభక్తి పిల్లలనుండి పెద్దలవేపు ప్రసరిస్తుంది. మాతృప్రేమ మాత్రం ఎటునించి ఎటైనా ప్రసరించవచ్చు. పిల్లలకి ఉండేదీ మాతృప్రేమే, తల్లులకి ఉండేదీ మాతృప్రేమే. పితృప్రేమ కూడా అంతే. ఎవరిని గురించి మనం మాటాడుతున్నాం అన్నదాన్ని బట్టి ఎగువకా దిగువకా, అంటే తరాలదృష్ట్యా, అన్నది మనమే నిర్ణయించుకోవాలన్నమాట. గురుభక్తికి ఈ వసతి ఉన్నట్టు లేదు. ఇది శిష్యులకి గురువులయందు మాత్రమే ఉండుకోగలదు. దానికి ప్రతిగా గురువులకి శిష్యులయందు ఉండేది ప్రేమ లేదా ప్రీతి. అతను గురువులకు ప్రీతిపాత్రుడు అంటారు చూడండి, అదన్నమాట.

ప్రేమ ఉన్నచోట కోపాలు ప్రదర్శించడానికి కూడా అస్కారం ఉంది. “నీమేలు కోరే చెప్తున్నాన్రా, లేదా చెప్తున్నానే” అంటూ మొదలు పెట్టి నోటికొచ్చిన తిట్లు తిట్టొచ్చు. పత్ని పతికి ఎంతో ఇష్టమైన కూర చేసినప్పుడూ, చీరె కట్టినప్పుడూ ప్రేమతో చేస్తోందా, భక్తితో చేస్తోందా అంటే చెప్పడం కష్టమేనని నా అభిప్రాయం. గిట్టనివాళ్ళు పతిభక్తి,

సాంప్రదాయం అంటూ మెచ్చుకోనూ వచ్చు, తెగనాడనూ వచ్చు. మరో గుంపు ఆయనంటే ఆవిడకి ప్రేమ, అంతే కాదు ఆయనకి ఆవిడంటే ప్రేమ, ఆవిడకి పుట్టినరోజునాడు ఉప్మా చేసి పెట్టేరు అని సమర్థించవచ్చు. రెండూ నిజమే కావచ్చు. ఈ మనిషితత్వాలతో ఇదే బాధ. ఏదీ నిక్కచ్చిగా రెండురెళ్ళు నాలుగు అన్నంత ఖరారుగా చెప్పలేం. హుమ్.

కొంతకాలం క్రితం 70 ఏళ్ళు పైపడ్డ ఒకాయన ఆడపిల్లలని దొంగతనంగా ఎత్తుకెళ్ళిపోయి భూగృహాల్లో ఇనపగొలుసులతో కట్టిపడేసేవాడు. ఆఖరికి పట్టుబడ్డాడు. పిల్లల్ని అలా గొలుసులతో కట్టిపడేయడం ఏమైనా బాగుందా అని పోలీసులు గట్టిగా అడిగితే, ఆయన సమాధానం, "వాళ్లు నగలు పెట్టుకోరా, ఇదీ అంతే," అన్నాట్ట. ఆయనదృష్టిలో అది ప్రేమే. ఒకొకరి బుర్రలు అలా పని చేస్తాయి కాబోలు. నాలాటి సామాన్యులకి అది హింసగానే కనిపిస్తుంది.

ఈ సకల భక్తులలోనూ, ప్రేమలలోనూ అత్యంత భయంకరమైనది మిత్రప్రేమ అనుకుంటా. అంటే మిగతా ప్రేమలలో కూడా ప్రేమపేరుతోనూ, భక్తిపేరుతోనూ ఒకమనిషిని మరొకరు ఉక్కిరిబిక్కిరి చేసేయడం జరుగొచ్చు కానీ మిత్రప్రేమలో ప్రేమతోపాటు నమ్మకం కూడా ఉంటుంది. "నా ప్రాణస్నేహితుడు నాకు ద్రోహం చెయ్యడు" అన్న ధీమా కూడా ఉంటుంది. "నాకు కష్టకాలంలో చేయి అందించివాడు నాకు సమయం చూసుకుని హేండిచ్చేస్తాడా?" అని విస్తుపోవలసిరావడం ఎంత కష్టం! ఆ బాధ ఇంతా అంతా కాదు. నేను మోసపోయేనే అనే కాక, నేను ఈమనిషిని ఎలా నమ్మేను, నాతెలివేమైంది అన్న బాధ అంతకంతా ...

ఈరోజు తెల్లారి లేస్తూనే అనుకోకుండా మధురవాణి రాసిన కథ ఒకటి నాకళ్ళ బడింది. ఈ కథ చదివి గంటన్నర పైనే అయినా దాన్నిగురించిన ఆలోచనలు నన్ను వదల్డం లేదు. బహుశా రేపు రాస్తాను.

ఈలోపున ఈ భక్తి, ప్రేమలగురించి మరోమాట చెప్పి ముగిస్తాను. నాకు ఆలోచించినకొద్దీ, భక్తి, ప్రేమ, రక్తి, అనురక్తి – అన్నీ ఒకే మాణిక్యానికి పేరు పేరు పలకలు అనిపిస్తోంది. విరక్తి కూడా మరో పలకే. బహుశా వ్యత్యస్తం అయిన పలక, అథోముఖం అనుకోవాలి హిరణ్యాకసిపుడికి విష్ణువుయందున్న పగలాగ.

ఏది ఏమైనా వీటన్నటిలోనూ ఒకవిషయం స్పష్టం. ఒకమనిషికి మరోమనిషియందున్న ఆసక్తి కానీ ఆకర్షణ కానీ ఇలా ఆపాదిల్లుతుంది. మనిషి జన్మ ఎత్తేక మరోమనిషితో ఏదో విధమైన కొలికి తగిలించుకోకుండా ఉండలేడు.

000

(మే 14, 2013)

28. నాకెందుకీ కథ నచ్చిందంటే...

మధురవాణి రాసిన ప్రకృతిఒడిలో బతుకు పాఠం, పేరు చూడగానే ఇది గంభీరమైన అంశంలా ఉంది, ఇప్పుడు చదివేస్థితిలో ఉన్నానో లేనో అనిపించింది. ఆలోచిస్తూనే మొదలు పెట్టేను. మొదలు పెట్టినతరవాత కథ హాయిగా సాగిపోయింది.

ఎత్తుగడలోనే టీవీలూ సెల్ ఫోనులూ కాక రేడియో ప్రసారం, వానతో పాటు ప్రకృతి వర్ణనా నన్ను బాగా ఆకట్టుకున్నాయి. ఆ తడి అలా ఉండగానే, అంతవానలోనూ ఓ రేకులషెడ్డులో ఒంటరిగా నిశ్చలంగా మునిపుంగవుడిలా కూర్చున్న యువకుడు. అతనిగురించి మనకి అనేక ప్రశ్నలు రావడానికి ఆ ఎత్తుగడ చాలు. అది నా మొదటి మెట్టు చదవడం కొనసాగించడానికి.

నన్ను ఆపకుండా చదివించిన రెండో అంశం కథనంలో చక్కని తెలుగుదనం. అట్టే ఆర్భాటాలు లేకుండా, ఇంగ్లీషూ, సంస్కృతం కూడా లేని జాను తెనుగు. ఇటీవలికాలంలో ఇలాటి తెలుగులో వచ్చే కథలు చాలా తక్కువే అనుకుంటున్నాను. మరోమాట కూడా ఒప్పుకుంటాను. నేను బ్లాగులూ, జాలపత్రికలూ అట్టే చూడడం లేదు కనక నా వ్యాఖ్య నాపరిమితిలోనే అని అర్థం చేసుకోవాలి.

కథ నడక కూడా తూచినట్టు సాగింది. ఎక్కడా అనవసరమైన శాఖాచంక్రమణాలు కానీ కథకురాలి సొంత అభిప్రాయాలు కానీ చొప్పించకుండా, పాఠకులు తమ తమ అభిప్రాయాలు ఏర్పరుచుకోడానికి అనువుగా కథ నడపడం నాకు నచ్చింది.

కథలో మరోకోణం – మిత్రలాభం. ముందు టపాలో రాసేను, మనిషికీ మనిషికీ మధ్య ఏదో ఒకరకం లంకె ఉండి తీరుతుందని.

నన్ను బాబాయి అనుకో అంటూ చేరదీసిన వ్యక్తి మోసగాడని తెలియడం క్షోభ కలిగిస్తుంది. కానీ, ఆయనవల్ల అతను బొత్తిగా ఏమీ లాభం పొందలేదనడానికి లేదు. కథ విషయం కొంచెంసేపు పక్కకి పెట్టి, నిత్యజీవితంలో మనం రోజు చూస్తూనే ఉంటాం ఎవరో ఒకరు ఎవరికో ఒకరికి ఎప్పుడో అప్పుడు ఏదో సాయం చేస్తూనే ఉంటారు. ఒకొకప్పుడు మరో ఉద్దేశం ఏమీ పెట్టుకోకుండా సాయం చెయ్యొచ్చు. ఒకొకప్పుడు, అంతరాంతరాల మరో ప్రణాళిక వేసుకుని చెయ్యొచ్చు. ఏది ఏమైనా సాయం పొందిన మనిషికి కొంత లాభం తప్పకుండా కలుగుతుంది. ఏమీ లేకపోతే, కనీసం జ్ఞానోదయం. ఈకథలో బాబయితో ఉన్నంతకాలం పని నేర్చుకున్నాడు. అదే అతనికి లాభం. కానీ తాను మోసపోయేనన్న జ్ఞానం అతన్ని మరింత కుంగదీసింది. అది కూడా సహజమే. ఎప్పుడైనా మనసుమీద నొప్పిముద్రలే మరింత గాఢంగా పడతాయి. మంచి ఉన్నా అంత మంచిగా అనిపించదు.

ముగింపు మరింత చక్కగా అమిరింది. ఏదో అవుతుందనే కానీ ఏమవుతుందో తెలీదు మనకి. హఠాత్తుగా పెద్ద వెలుగు అని చదివినప్పుడు కారు అనుకున్నాను. నా అంచనా తప్పు. అదొక చమత్కారం. తరవాత, అతనిలో కలిగిన కలకలం. అదంతా ఇక్కడ రాయను కానీ రచయిత్రి గొప్పగా ఆవిష్కరించేరని మాత్రం చెప్పగలను. నాకలా అనిపించింది. నాకు ప్రత్యేకంగా అలా అనిపించడానికి అలాటి అనుభవం ఈమధ్యనే నాక్కూడా కలగడం కావచ్చు. బహుశా అదే కారణం కూడానేమో ఈ టపాకి.

ఇప్పటికి చాలా టపాలే రాసేను మంచి కథ అంటే ఎలా ఉండాలో. కానీ అవేవీ గుర్తు లేవు నాకు ఈ కథ చదువుతంటే. నేననేది, ఒక సంఘటనో, విషయమో మనకి అనుభవం అయినతరవాత, దానికి అనుబంధంగా కనిపించే కథ చదివినప్పుడు మన స్పందన వేరుగా ఉంటుంది. ఇప్పటికి చాలా టపాలే రాసేను మంచి కథ అంటే ఎలా ఉండాలో. కానీ అవేవీ గుర్తు లేవు నాకు ఈ కథ చదువుతున్నంతసేపూ. నేననేది, ఒక సంఘటనో ఒక సన్నివేశమో మనకి అనుభవం అయినతరవాత, దానికి

అనుబంధంగా కనిపించే కథ చదివినప్పుడు మన స్పందన మరింత బలంగా ఉంటుంది. ఏ ఆత్మీయురాలితోనో గుట్టుగా చెప్పుకుంటున్నట్టు స్వాంతన పొందుతాం. అదే ఎదుట నిలబడి మరోమనిషి, పోస్లెద్దూ, అదో పాఠం అనుకో, నొప్పి అదే పోతుందిలే అంటే చిరాకేస్తుంది.

ఇప్పుడు మీకర్థం అయిందనుకుంటాను ఎందుకు నాకు ఈకథ చదివేక, దాన్ని గురించి రాసేవరకూ తోచలేదో. మాలిక పత్రికలో వ్యాఖ్యలని, ఈకథ చాలామందిని ఆకర్షించింది.

మంచి కథ అందించిన మధురవాణికి శుభాకాంక్షలు.

000

(మే 15, 2013)

29. పాతకథలలో కొత్తరుచులు?

ఈమధ్య నాకు కొన్ని సందేహాలు మొదలయేయి. మొదటి సందేహం ఏ కథ ఎప్పుడు మంచికథ అవుతుంది. ఈరోజుల్లో కథలేవీ బాగుండడం లేదనుకుంటున్నవారికి పూర్వం ప్రచురించినకథలు నచ్చేయా? ఎందుకు నచ్చేయి? వాటిలో అందాలేమిటి? అలాగే సమీక్షల్లో, పరిశీలనాత్మకవ్యాసాల్లో వాళ్లు చెప్పేదానికీ ఇప్పుడు మనం అనుకుంటున్నదానికీ ఏమైనా తేడాలునాయా? అని.

ఇంతలో మన తవ్వకాలరాణి (వి.బి. సౌమ్య) మళ్ళీ కొన్ని పాతకాలపు కథలూ వ్యాసాలూ తవ్వి తీసి నాకంపింది. సరే, విశ్వనాథ సత్యనారాయణగారి వేనరాజు చదవలేకపోయేను కనక పులులసత్యాగ్రహం మొదలు పెట్టలేదు. రెండు కథలు నల్లబిందె-దుక్క చెంబు (భోగరాజు నారాయణమూర్తిగారిరచన), మల్లుపంచె (వర్ఝు బాబూరావుగారిరచన) పాతభారతి పత్రికలలో ప్రచురించినవి. పేర్లబట్టే తెలుస్తున్నాయి కదా మామూలుగా మననిత్యజీవితాల్లో, నట్టింట జరిగే భాగోతాలే అని. ఈపాత కథల్లో నాకు కొత్తదనం రచయితల పేర్లు. అప్పట్లో వారు ప్రసిద్ధులే అనుకుంటా. ఆరోజుల్లో కూడా బారతిలాటి పత్రికలలో కూడా ఇలాటికథలు వచ్చేవన్నమాట అనుకోడానికి బాగున్నాయి. మునిమాణిక్యం నరసింహారావుగారి కథలు చాలామందికి పరిచయమే కనక ఇవి కూడా అలాగే ఉన్నాయనుకోండి.

1928లో అంతటి నరసింహంగారు, యం.ఏ.యల్.టి, రాసిన **గద్యకథానకము** అన్నవ్యాసంలో కథాలక్షణాలు వివరించడం జరిగింది. కథకీ నవలకీ గల తేడా, కథల్లో అంశానికి ప్రాధాన్యం చర్చించేరు. వ్యాసం నిడివి పది పేజీలుంది కనక చాలా విషయాలుంటాయనుకున్నాను కానీ ఆనాటి కథలు దాదాపు పదో పదిహేనో కథలు సూక్ష్మంగా చెప్పేరు కానీ పాత్రపోషణ, వాతావరణం, నేపథ్యం, ఎత్తుగడా, ముగింపువంటి కథానికాలక్షణాలేవీ విడివిడిగా చర్చించలేదు.

నాకు కొత్తగా తెలిసినవేమిటంటే, ఇంగ్లీషు పదాలకి ఆయన ఇచ్చిన తెలుగుపదాలు. ఉదా. anti-climax హీనక్రమము, background వెనుకభాగము. అట్టే లేవు కానీ ఆరోజుల్లోనే ఈ సమానార్థకాలు సృష్టించడం మొదలయినట్టుంది. లేదా, ఇంకా ముందే మొదలయిందేమో.

రెండో విషయం **కృష్ణవేణి అన్న కథలో కథాంశంగురించి ఆయన రాసిన కొన్ని** విషయాలు కూడా నాకు ఆసక్తికరంగానే ఉన్నాయి. నిజానికి ఈకథవిషయంలోనే ఆయన లోపాలు ప్రస్తావించింది. "కథాంశము కల్పితమా, లేక ఆధునికజీవితమునుండి కొలదిమార్పులతో గ్రహించినదా అని సందేహము కలుగవచ్చు. ఇది ఒకలోపము" అంటారు నరసింహంగారు. ఇది లోపమని ఎందుకనుకున్నారో నాకర్థం కాలేదు. "కల్పన నైజ జీవితప్రతిబింబముగా నుండవలెను గానీ నైజజీవితకథనమే యగుచో వెగటు పుట్టించును. కళయొక్క ఆశయమే చెడిపోవును. ప్రకృతిననుసరించి నైజజీవితమును ప్రతిబింబింపజేయు కల్పన జీవితమందును, మనుజులభావములయందును గల మంచిచెడ్డలను గుర్తెరుంగ నూత యొసగుచు మనస్సుకు ఆనందము కలిగించును" అంటారు. ఈవాక్యాలు నాకు బాగా అర్థం కాలేదు కానీ, ఇది శిల్పానికి సంబంధించిన వ్యాఖ్య అనుకుంటాను. ఈ తరవాతివాక్యం కూడా అదే చెప్తున్నట్టుంది. "చదువరికి ఉత్కంఠ కలుగజేసి యాతనిమనము బలవద్గ్రాహముగా పట్టియుంచును." ఇది ఆనాటి వాడుకభాష అనుకోవాలి. కథాశిల్పంగురించిన ప్రస్తావన మరొకచోట కూడా ఉంది. పాశ్చాత్యులు కనిపెట్టిన Planchet పద్ధతిని కథకుడు ప్రవేశపెట్టినట్టుంది అన్నారు రచయిత. ఆ పదానికి అర్థం A flat disk of metal ready for stamping as a coin; a coin blank అని జాలంలో వెతికి తెలుసుకున్నాను. కిందటివారం చర్చలోకి వచ్చిన కుక్క జాలి అన్నమాట నాకు గుర్తుకొచ్చింది. మనం ఒక విషయం తెలుసుకోడానికి చదువుతున్న వ్యాసాల్లో ఇలా అర్థాలు ప్రాచుర్యంలో లేని మాటలు వాడితే పాఠకులకి కష్టం అని నా

అభిప్రాయం. ఇవి మన దృష్టిని మరోవేపు మళ్ళిస్తాయి. నాకు ఈ వ్యాసంలో రాలేదు కానీ కొన్ని కథల్లో చాలామాటలకి అర్థాలు వెతుక్కోవలసివచ్చింది.

ఈ కథలో నరసింహంగారు ఎత్తి చూపిన మరో విశేషం, కథ చివరలో "చదువరులు ఇందువలన నేర్చుకొనతగిన పది నీతుల పట్టిక చేర్చబడినది," అని. దీన్ని కూడా నరసింహంగారు లోపము అనే " ఇది కళకు పెద్దలోపము. ఈపట్టిక లేకున్న కథ బాగుండెడిది" అని రాసేరు. ఈ పద్ధతిని ఆయన కూడా ఆమోదించలేదు కనక మనం ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు కానీ ఒక కథారచయితకి అలా చెప్పాలని తోచడం, భారతి పత్రిక సంపాదకులు దాన్ని ప్రచురించడం మాత్రం విశేషంగానే భావిస్తున్నాను నేను. నిజానికి ఈనాటికీ ఈ చర్చ సాగుతూనే ఉంది. అంటే ముగింపులో రచయిత అలా జాబితా ఇవ్వకపోయినా, సందేశం స్పష్టం చేయాలా చేయకూడదా అన్నది చర్చనీయాంశంగా. 1928 ఆగస్టు బారతిలో ప్రచురించిన వ్యాసం ఇది.

పిలకా గణపతిశాస్త్రిగారు తెలుగుస్వతంత్ర ఆగస్టు 1948 సంచికలో **ఏది ఉత్తమరచన** అన్న వ్యాసంలో సంపాదకులు ఏది మంచికథ అవునో కాదో ఎలా నిర్ణయించుకుంటారో, ఎలా నిర్ణయించుకోవాలో చెప్పేరు. చారిత్రకంగా సాహిత్యఉద్యమాలు లేదా కొత్తపోకడలు ఒకదానితరవాత ఒకటి రావడానికి ప్రాతిపదిక మేధ, బావము అని చెప్తూ, భావమే ప్రదానంగా కందుకూరి వీరేశలింగంగారికాలంలో మొదలయితే, గురజాడ అప్పారావుగారికాలం వచ్చేసరికి భావానికి పెద్దపీట వేయడం జరిగిందంటున్నారు. పాఠకులు ఆత్మాశ్రయకథలూ, కవితలూ అర్థం కాలేదంటే, రచయితలు మేం మీకోసం రాయడంలేదంటారుట. ఈరచయతకి ఆత్మాభివ్యక్తి, ఆత్మానందం ప్రధాన లక్ష్యాలయేయి అంటారు. కానీ సంపాదకులు ఉత్తమరచన సేకరించాలంటే ఒక్క భావమో ఒక్క మేధో మాత్రమే కాక రెంటినీ గమనించి, సమన్వయపరుచుకుని, కథ సజీవమైనదో కాదో నిర్ణయించుకోవాలిట. అంతే కాదు. కేవలం అక్కడే ఆగిపోతే, కొత్త ఉద్యమాలు పుట్టే అవకాశం లేదు. నవ్యత కూడా అవసరమే సాహిత్యం అభివృద్ధి చెందడానికి. నవ్యత

అంటే భావంలోను, భాషలోనూ, సరికొత్తగా ఉండడంమాత్రమే కాదు. "ఈరోజుల్లో అనేకులు విదేశీనవలలు, కథలు చదివి, ఆదేశాల సాంఘికసమస్యలు, సంఘటనలు మనదేశంలో ఉన్నాయని భ్రమించి సరిగా విదేశీయరచనలకు మక్కికి మక్కిగా రాస్తున్నారు. నవ్యతలో ఒకరకమైన దేశీయత కూడా ఉంటుంది. ఇక్కడ దేశీయత దేశానికి సంబంధించిడము అనే అర్థంలో వాడడం లేదు. ఆంగ్లరచన చదివినా, పరాసు రచన చదివినా ... మనకు ఆయా దేశాలముద్ర కనబడుతుంది. ఎంత ప్రాచీరచన అయినా, ఎంత నవ్యరచన అయినా మనం ఆయా దేశాల "ఆత్మముద్ర" గుర్తించగలము. అలాగే తెలుగు దేశీయులరచన చదివితే ఆ దేశీయుల సంస్కృతి, పరిసరాలు, ఆచారాలు, మొదలైనవి ఆలోచనలో ప్రతిబింబించి, మన ప్రత్యేకదేశీయత సూక్ష్మంగానైనా కనిపించి తీరుతుంది, మనం అనుకున్న ఈ దేశీయత మన అంతరాంతరాల్లో ఉండాలి. సజీవమైన రచనలో ఈ దేశీయత ఉండితీరుతుంది. ఇంతకు పూర్వం వచ్చే రచనలో లేని ఒక ప్రత్యేకత్వము, కొత్తదనము కూడా ఉంటాయి" అంటారు. ఈవాక్యాలు నాకు చాలా నచ్చేయి. 1948లో రాసిన ఈవాక్యాలు మనం ఇప్పటికీ అన్వయించేలా ఉన్నాయంటే, గణపతిశాస్త్రిగారి రచన సర్వ కాలీనం అనుకోవాలా? అయ్యో, ఎవరూ ఆయనమాట లక్ష్యపెట్టలేదు అనుకుని విచారించాలా?

మనసాహిత్యం ఎంతటి పురోభివృద్ధి సాదించింది అని తెలుసుకోడానికి ఇలాటి రచనలు కూడా చాలా సాయపడతాయి. ఎందుకంటే, ఇప్పుడు చాలామంది తెలుగు సాహిత్యం ఎంతో ముందుకు సాగిపోయిందని మురిసిపోతున్నారు. కానీ గణపతిశాస్త్రిగారు నిర్వచించిన "నవ్యత" మాత్రం అట్టే కనిపించడంలేదనే నాకనిపిస్తోంది.

అన్నట్టు కథలవిషయంలో **ఎదుగని బిడ్డ కథ కూడా ఉంది. చదివేను కానీ దానిమీద** సౌమ్యే రాస్తే బాగుంటుంది. ఆటపాకోసం ఎదురు చూస్తూ ...

000 (జూన్ 12, 2013)

30. సంకలించడం ఓ శ్రమ

తెలుగు సాహిత్యం మూడు పూవులు పన్నెండు కాయలుగా మహోత్సాహంతో, మహోద్వేగంతో వెల్లివిరిసిపోతోందనడానికి సాక్ష్యం ఈనాడు కోకొల్లలుగా వస్తున్న పుస్తకాలు. వాటిలో సంకలనాలు ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే ఒక రచయిత పుస్తకం వేసుకుంటే ఆ రచయితకి మాత్రమే ప్రతిష్ఠ. సంకనలం వేస్తే, ఆ సంకలనంలో ఎవరిపేర్లు ఉన్నాయో వారందరికీ ప్రతిష్ఠే కదా.

కొన్ని సంకలనాలు చూసికనప్పుడు సాహిత్యంలో ఏదో కృషి చేద్దాం అనుకుంటే, మరో పని తోచకపోతే ఓ సంకలనం వేసేద్దాం అని కొందరి అభిప్రాయమేమో అనిపిస్తోంది కొన్ని చూస్తే. ఈమధ్య వచ్చిన రెండు సంకలనాలు చూసినతరవాత, పుస్తకం.నెట్‌లో దీపతోరణం వందమంది రచయిత్రులకథానికలు సంకనలంమీద సారికగారి సమీక్ష చూసినతరవాత, నాకు ఈ టపా రాయాలనిపించింది.

సారికగారు తమ సమీక్షలో "లబ్ధ ప్రతిష్టులైన సీనియర్ రచయిత్రులు తాము రాసిన వాటిల్లో మరి కొంత నాణ్యమైన కథల్ని పంపడంలో నిర్లక్ష్యం వహించారనిపించింది. నూరు కథల సంపుటి అనేది ఒక రికార్డు కాబట్టి దీనిలోని కథలు ఒకదానితో మరొకటి పోటీ పడే స్థాయిలో ఉంటే బావుండేది," అని వ్యాఖ్యానించేరు. ఈవాక్యంలో రెండు అంశాలు ఉన్నాయి. నూరు కథలసంపుటి ఒక రికార్డు అన్నవిషయం ఒకటి, రెండోవిషయం – కథలు చెప్పుకోదగ్గస్థాయిలో ఉంటే బాగుండునన్నది. నేను ఈ రెండువిషయాల్లోనూ ఆమెతో ఏకీభవిస్తూ, నాకు తోచిన మరికొన్ని విషయాలు కూడా ప్రస్తావించడానికి ఈ టపా.

1. సంకలనానికి సంకల్పం చెప్పుకున్నాక, ఒక అంశం, ఎంచుకున్న లేక ఎంచుకోబోయే కథలకి, సూత్రప్రాయంగా తీసుకుంటాం. అంటే ఆ పుస్తకం మూసేవేళకి పాఠకుడికి ఆవిషయంమీద కనీసం లీలామాత్రంగానైనా ఒక సమగ్రకోణం ఏర్పడేలా చూస్తాం. ఆ అంశం చాలా చిన్నవిషయం కావచ్చు. చిన్నపిల్లల చదువులు, ఆడపిల్లలఉద్యోగాలు, రోజుకూలీలు, వికలాంగులు – ఇలా ఒక అంశంమీద అనేక కోణాలు ఆవిష్కరిస్తూ అనేకమంది రచయితలు రాసిన కథలు. లేదా, చరిత్ర ఆవిష్కరించదలుచుకుంటే, 19వ శతాబ్దం, 20వ శతాబ్దం, 90వ దశకం, లేదా, ప్రాంతీయత వెల్లివిరసే కథలు – రాయలసీమకథలు, కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లా, ఉత్తరాంధ్ర, తెలంగాణా కథలు సంకలనాలుగా వేయొచ్చు. ఇలా ప్రాంతీయకథలు వేసినప్పుడు ఆ ప్రాంతంలోని సంస్కృతి, సంప్రదాయాలు వ్యక్తమవుతాయి అని వేరే చెప్పక్కర్లేదు కదా.

అలా కాక, నాయిష్టం అనుకుంటూ ఎంచిన కథలు, మాయింటికొచ్చినవాళ్ళకథలు, ఆదివారం సాయంత్రం ఛార్మినార్‌దగ్గర తారసపడ్డవాళ్ళకథలు – ఇలా కూడా సంకలించవచ్చు కానీ ఇవి ఆ సంకలనాల్లోని రచయితల మిత్రులపరిధిలో మాత్రమే ఉండిపోయే అవకాశం ఉంది.

దురదృష్టవశాత్తు, ఈ చివరిరకం సంకలనాలే ఎక్కువగానే వస్తున్నట్టు కనిపిస్తోంది నాకు. అచ్చంగా అలాగే కాకపోవచ్చు కానీ సుమారుగా అలాగే ఉంటున్నాయి. ఏదో పుస్తకం వేసేద్దాం అన్న ఉత్సాహమే, కాని ఆపైన కావలసిన శ్రమ పడడానికి సిద్ధంగా లేకపోతే, దరిమిలా బజారుకెక్కిన సంకలనాలు కూడా అస్తవ్యస్తంగానే తయారవుతాయి.

2. ఎంపిక అయినతరవాత, రచయితలనీ, రచయిత్రులనీ సంప్రదించడం. నేనయితే, ఆ సంకనలం కూర్చడంలో నా ఆశయం ఏమిటో వారికి వివరించి, తదనుగుణంగా ఉండే కథలు ఏమైనా వారివి ఉంటే రెండో మూడో పంపమంటాను. వాటిలో నా ఆశయానికి

నప్పుతుందనుకున్నది ఎంచుకుని ఆవిషయం వారికి తెలియజేస్తాను. (ఇవన్నీ ఎవరికి తెలీవు అనకండి. నాప్రమేయం ఏమాత్రమూ లేకుండానే, నాకథలు కనీసం నాలుగు సంకలనాల్లో వచ్చేయి, పైన చెప్పిన దీపతోరణంతో సహా.)

3. "కథలు ప్రచురించిన పత్రికల పేర్లూ, తేదీలూ, రచయిత్రుల చిరునామాలూ కనీసం కాంటాక్ట్ ఫోన్ నంబర్లూ లేకపోవడం ప్రధాన లోపంగా చెప్పాలి," అని సారికగారు సూచించేరు. కొన్ని సంకలనాల్లో ఈ సమాచారం ఇస్తున్నారు.

నేను కూడా కథ ప్రథమ ముద్రణకి సంబంధించిన వివరాలు ఇవ్వడం అవుసరం అనే అనుకుంటాను. కనీసం ఏ దశకంలో ప్రచురితమయిందో తెలిస్తే, కథకి మరింత పటుత్వం ఏర్పడుతుంది. ఇంకా, ఆ కథ నేపథ్యం, స్ఫూర్తి కలిగించిన సందర్భం కూడా రచయితని అడిగి తెలుసుకుని, ప్రచురిస్తే, మరింత బలం. పైగా ఇలాటి వివరాలు పాఠకులలో వ్యక్తిమీద కంటే వస్తువుమీద దృష్టి నిలపడానికి దోహదం చేస్తాయి.

చిరునామాలు, కాంటాక్ట్ నెంబర్లూ అవుసరమని నేననుకోను. నిజానికి అవి అచ్చులో కనిపించడం నాకిష్టం లేదు. ప్రైవేసి మాట అటుంచి, ఈ చిరునామాలూ, ఫోన్నెంబర్లూ అచ్చుపుస్తకం ఉన్నన్నాళ్ళూ ఉండవు కదా. మారిపోతుంటాయి.

4. అలాగే రచయితకి సంబంధించిన వివరాలు - పుట్టినతేదీలు, చదువులాటివి - కొంతవరకూ ఉపయోగపడొచ్చు సాహిత్యచరిత్ర దృష్ట్యా. కానీ ప్రతి రచయితపేరుకిందా ఒక మూస వాక్యం "అనేక పురస్కారాలు పొందేరు, అనేక పుస్తకాలు ప్రచురించేరు"వంటివి మాత్రం రచయితకి ఘనత తేవు. నాసంకలనం Telugu Penscape చివరలో ప్రచురణకర్తలు (నన్నడక్కుండా) నాపేరుకింద చిన్నతనంలో నేను రాయడం మొదలుపెట్టినరోజుల్లో రాసిన చిట్టి పొట్టి స్కెచ్చిలు, గల్పికలు ఉదహరించేరు నా రచనాపాటవానికి గుర్తుగా. **అవసలు కథలే కావనీ, ఇలాటివి**

రచయితలకీ, సంకలనకర్తలకీ కూడా గౌరవప్రదం కాదనీ వారికి తెలీలేదు. రచయితలతో సంప్రదించకపోవడంవల్ల ఇలాటివి జరుగుతాయి.

5. కథాక్రమం – ఇది కూడా అర్థవంతంగా ఉండాలి. రచయితల సాంఘికస్థాయినో, ప్రాముఖ్యాన్నో బట్టి కాక, ఒకకథలో సన్నివేశం తరవాత సన్నివేశం కూర్చినట్టే, సంకలనం కూడా ప్రధానాంశాన్ని ఆవిష్కరించే తీరులో ఒక అర్థవంతమైన క్రమంలో జరగాలి. అప్పుడు పాఠకుడు ఇక్కడో కథ, అక్కడో కథ అంటూ కప్పగంతులేసుకుంటూ పోకుండా పూర్తిగా పుస్తకం అంతా ఒక నవలలా చదివే అవకాశం ఉంటుంది.

6. ఇంక అచ్చుతప్పులమాట నేను చెప్పను. ఎందుకంటే నాపుస్తకంలో తప్పులగురించి మీరందరూ నాకు బాగానే పెట్టేరు కనక. కానీ, మీరు నాకంటె ప్రముఖులు కనక, మందీ మార్బలమూ ఉన్నవారు కనక, వీటివిషయంలో కూడా జాగ్రత్త వహించగలరు.

7. కాపీరైటు విషయం కూడా అనుమతి ఇచ్చినప్పుడే మాటాడుకోడం మంచిది. సాధారణంగా రచయితలు సరే వేసుకోండి అంటే, ఆ సంకలనంలో చేర్చుకోడానికి మాత్రమే అనుమతి ఇస్తున్నట్టు లెఖ్ఖ. అలా కాక, మాకు మీకథ సర్వ హక్కుభుక్తములుగా ఇచ్చేయండి, మాతరవాత మీరు మరెక్కడా ఈకథ మార్చడానికి గానీ, మళ్ళీ ప్రచురించుకోడానికి గానీ మీకు హక్కు లేదనగలరు. ఇలాటివి ముందు మాటాడుకోవాలి. (అడక్కుండా వేసేసుకునేవాళ్ళని మనం ఏమి చెయ్యగలం అని నన్నడక్కండి.

ప్రధానంగా శ్రద్ధ, లక్ష్యశుద్ధి కావాలి. సంకలనం వెయ్యాలనుకున్నాం, వేసేసేం అని కాక, శ్రద్ధతో, లక్ష్యశుద్ధితో చేసినప్పుడే సాహిత్యానికి నిజంగా సేవ చేసినవారవుతారు. మంచి సాహిత్యచరిత్ర ఏర్పడడానికి మార్గదర్శకులవుతారు.

000

(జులై 13, 2013.)